

ఆంధ్రప్రదేశ్



శ్రీమతి ఇందిర గాంధి

ఆగస్టు 1966
30 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి: 10] ఆగస్టు, 1966 [సంచిక: 10

శ్రావణ-భాద్రపద 1888 శా. శ.

ప్రధాన సంపాదకులు : టి. రామచంద్రరావు

సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి

ఈ సంచికలో

మొదటి చిత్రం : ప్రధాని
ఫోటో : శ్రీ సయీదుద్దీన్

రెండవ చిత్రం : లలితా మహల్ ప్యాలెస్, మైసూరు

మూడవ చిత్రం : వెలుగు నీడలు

నాలుగవ చిత్రం : ప్రకృతి సంపద
ఫోటోలు : ప్రధాన సంపాదకులు

*

ముఖ్యమంత్రి

58వ జన్మదినమునకు

ఆంధ్రప్రదేశ్ శుభాకాంక్షలు

*



జన్మదిన శుభాకాంక్షలు:

మన ముఖ్యమంత్రి

మన ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, జులై 28 న 58 సంవత్సరంలో అడుగుపెడుతున్నారు. అంతేగాక ఈ రోజుతో రాష్ట్ర రథసారథ్యం వహించి దాదాపు 2½ సంవత్సరాలు అవుతుంది. అంతకు పూర్వం 1956 నుండి రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యులుగా ఉంటున్నారు. మంత్రిగా ఎన్నో కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా ఆరున్నర సంవత్సరాలు ఆర్థిక మంత్రిగా రాష్ట్ర ఆదాయాన్ని రు. 68 కోట్లనుండి రు. 143 కోట్లకు పెంచారు. రాష్ట్రంలో సుస్థిరతను నెలకొల్పి దేశంలో రాష్ట్ర ప్రతిష్ఠతను యినుమడింపజేసిన సమర్థులైన పరిపాలకులుగా ఆయన వేనోళ్ళ కొనియాడపడుతున్నారు.

శాసన సభలోకూడ ఆయన ప్రతిభావంతంగా వ్యవహరిస్తున్నారు. శాసన సభా సమావేశాలలో ఆయన కనబరచే ఆత్మవిశ్వాసం, ప్రతి విషయాన్ని సాకల్యంగా సమీక్షించి, విపులీకరించే విధానం ఎన్నో సందర్భాలలో శ్లాఘించబడింది. వాస్తవంగా నేటి మన యీ తరంలో ఉన్నకొద్దిమంది ఉత్తమ పార్లమెంటరీ ప్రజాస్వామ్యవాదులలో ఆయన ఒకరుగా గుర్తించబడినారు.

ప్రజా పరిపాలనా రంగంలో న్యాయవాద వృత్తిలో కొన్ని సంవత్సరాలుగా గడించిన అనుభవం, నైపుణ్యం ఫలితంగానే ఆయన పార్లమెంటరీ ప్రజాస్వామ్యవాదిగా రాణించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయకళాశాలలో జరిగిన సమావేశంలో తన గతానుభవాలని వివరిస్తూ యీ విషయాన్ని ఆయన పేర్కొన్నారు. విజయవంతులైన న్యాయవాదులు తమ కేసులలోని బలాన్నీ, దౌర్బల్యాన్ని తెలుసుకొని వివరణాత్మకమైన ఆమోదనీయమైన వాదనలతో కేసులను గెలుస్తారని ఆయన ఆ సందర్భంలో వివరించారు. మన ప్రియతమ నాయకునిలో యీ లక్షణాలు కొల్లలుగా ఉన్నాయి.

ఎటువంటి విభిన్న అభిప్రాయాలు ఉన్న విషయాలలోనైనా సమన్వయాన్ని సాధించి తమ సౌజన్యంతో ప్రజలను ఆకట్టుకునే అపూర్వమైన మంచిగుణంకూడ ఆయనలోఉంది. తాబట్టిన కుందేటికి మూడేకాళ్ళు అనే తత్వంతో గాకుండా ప్రతి విషయంలోను వివిధ భిన్నాభిప్రాయాలకు తావుకలిపిస్తూ విభిన్నదృక్పథాలను గౌరవించే ఉత్తమ విధానాన్ని ఆయన అలవర్చుకున్నారు.

ఆయన ముమ్మూర్తులా ఆంధ్రత్వం మూర్తీభవించిన వ్యక్తి. ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతిని త్రికరణశుద్ధిగా వాంఛిస్తున్న మహనీయుడు. రాష్ట్రంలో న్యాయమైన అవసరాలకొరకు, హక్కులకొరకు కేంద్ర ప్రభుత్వంతో వాదించి దానిపై ఒత్తిడి

తేపడానికి యేమాత్రం వెనుకంజవేయని ధీశాలి. ఆయన నిరంతర కృషి సమంజసమైన, సమర్థవంతమైన వాదన పటిమ కారణంగా రాష్ట్రంలో కేంద్రరంగానికి చెందిన పరిశ్రమలను నెలకొల్పి తద్వారా రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడినతనాన్ని నిర్మూలించాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రస్తుత అసమానత్వాన్ని తొలగించడానికి రాష్ట్రం పరంగానే వివిధ పథకాలను అమలుజరపడానికి ఆయన కృషిచేస్తున్నారు.

శ్రీశైలం, పోచంపాడు, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఆయనచేసిన నిరంతరకృషి అందరికీతెలిసిందే. కేవలం ఆయన కృషిఫలితంగానే గత రెండు మూడు సంవత్సరాలలో ప్రత్యేకంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అదనపునిధులు లభించాయి.

విశాఖపట్నంలో పబ్లిక్‌రంగంలో ఐదవ ఉక్కుకర్మాగారాన్ని నెలకొల్పడానికి ఆయన చేస్తున్న నిరంతర పరిశ్రమ మనందరికీ తెలిసిందె. అయితే వివిధకారణాలవల్ల అదియింకా ఫలించలేదు. ఇటీవల శాసనసభ యీవిషయంలో చేసిన ఏకగ్రీవ తీర్మానంవల్ల ఆయన కృషికి మరింత బలం చేకూరింది. దీనివల్ల అనుకూలమైన నేటి వాతావరణాన్నిఅధిగమించి యీపథకం కార్యరూపం ధరిస్తుందని ఆశించ బడుతున్నది.

గోదావరిపై రైలు రోడ్డు వంతెన నిర్మాణం, క్రొత్త రైల్వేమండలం ఏర్పాటు. ఆయనకృషికి తార్కాణాలు. రూ. 70 కోట్ల ఖర్చుతో డెల్టా ప్రాంతంలో మురుగునీటి పారుదల పథకాన్ని అమలుజరపడానికి ఆయన చేస్తున్న కృషి ఫలించిన పక్షంలో అనేకవేల ఎకరాలలో అమూల్యమైన పంటలను పరిరక్షించి తద్వారా దేశంలో ఆహార కొరత నివారణకు చాలావరకు తోడ్పడవచ్చు. అతి త్వరలోనే గోదావరి బ్యారేజి నిర్మాణానికి పునాదిరాయి వేయనున్నారు. దీనివల్ల డెల్టాప్రాంతంలోని అనేక ఎకరాలకు నీటిపారుదలసౌకర్యం లభిస్తుంది.

ఆంధ్రత్వం మూర్తీభవించి వ్యక్తి అయినా సాధారణంగా ఆయన జాతీయ దృక్పథంకలవాడు. సంకుచితత్వం, ప్రాంతీయతత్వం ఆయనలో కనుపించవు. జాతి గౌరవానికి, ప్రతిష్ఠకు ప్రమాదం ఏర్పడిన తరుణంలో తమ సర్వశక్తులను ధారపోయడానికి వెనుకాడలేదు. భారత-పాకిస్తాన్ సంఘర్షణ సమయములోను, భాషావివాదం, యితర సమస్యలను ఎదుర్కోవడంలోను, ఆయన చేసినకృషి అధిష్ఠాన వర్గాలమన్ననలను అందుకొన్నది. మద్రాసు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లతో గూడిన దక్షిణాదిలోని క్షామపీడిత ప్రాంతాలకు శాశ్వత నివారణోపాయాలకు చేస్తున్న కృషి కేంద్రప్రభుత్వ సానుభూతిని పొందగలిగింది.

ఈ మూడు రాష్ట్రాల ముఖ్య మంత్రుల సమావేశంలో రూపొందించిన ప్రతిపాదనలను అమలు పరచినట్లయితే ఈ ప్రాంతం నుంచి క్షామాన్ని అనతి కాలంలోనే నిర్మూలించవచ్చు.

ధరల పెరుగుదలను అరికట్టే నిమిత్తం. ఉద్యోగస్థుల కొరకు ఈ సంవత్సరం వినియోగదార్ల సహకార సంస్థలను ప్రారంభించడానికి సంబంధించిన పథకాన్ని వేసింది శ్రీ బ్రహ్మానందరెడ్డిగారే. అయితే ఈ పథకాన్ని తక్షణమే చేపట్టడానికి వీలు కలుగలేదు. ధరల పెరుగుదలను నిరోధించడానికి మార్గం వేతనాల హెచ్చింపు కాదనీ, ధరలను అదుపులో పెట్టగల హేతుబద్ధమైన విధానం అవలంబించడమే దీనికి పరిష్కార మార్గమనే విషయాన్ని ఇప్పుడు అందరూ గుర్తించడం జరిగింది. కేంద్రప్రభుత్వంకూడా ఈ దృక్పథంతోనే దేశంలో డిపార్ట్‌మెంటల్ స్టోర్సు ప్రారంభించడానికి నిశ్చయించడం మన ముఖ్యమంత్రి కుశాగ్రబుద్ధికి నిదర్శనం.

అత్యున్నత పదవిలో వున్నప్పటికి కూడా శ్రీ బ్రహ్మానంద రెడ్డి బీదసాదలతో చాలా కలగొలుపుగా మెలగుతారు. పేదల సంక్షేమంపట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపుతారు. వారు ఆయనను తమ మిత్రునిగా, హితైషిగా, మార్గదర్శిగా ఎంచుతారు.

భగవంతుడు ఆయనకు దీర్ఘ ఆయురారోగ్యాలు ప్రసాదించి మన రాష్ట్రానికీ, దేశానికీ సేవ జేయు భాగ్యం కలుగజేయుగాక.

నవభారత నిర్మాణానికి సమైక్యంగా కృషి చేద్దాం

శ్రీమతి ఇందిరాగాంధీ లాల్ బహదూర్ స్టేడియంలో లక్షకు పైగా ప్రజలు చేరిన గొప్ప బహిరంగ సభలో ఉపన్యసిస్తూ ఇంత కాలం తర్వాత మళ్ళీ తాను హైదరాబాదును సందర్శిస్తున్నాననీ, ఈ రాజధానీనగరాన్ని సందర్శించడం తనకు చాలా ఆనందదాయకమనీ అన్నారు. తను ఎప్పుడు హైదరాబాదుకు వచ్చినా యిక్కడి ప్రజల హృదయ పూర్వక స్వాగతం తనకు లభిస్తున్నదనీ, ఇదే తనకు తనవిధి నిర్వహణలో కొండంత అండగా నిలుస్తున్నదనీ ఆమె చెప్పారు.



"ముఖ్యమంత్రి సెలవిచ్చినట్టు వర్తమానసంవత్సరం కష్టాలతో ఆరంభమైంది. ఈ కష్టకాలం మరికొన్ని నెలలు మనల్ని అంటి పెట్టుకునే వుంటుంది. ఈ కష్టాల్ని అధిగమించే మార్గం ఏదైనా వుండి వుంటే అందుకుతప్పక మనం తగుచర్యలు తీసుకోవలసిందే. ప్రజల జీవనస్థాయిని మెరుగు పరచవలసి వుంది. వారి జీవితాన్ని సుఖమయంచేయాలి. దారిద్ర్యం, నిరుద్యోగం, అనారోగ్య సమస్యల్ని ఎదుర్కోవాలి. ఆర్థికప్రగతిని సాధించనిదే స్వాతంత్ర్యానికి అర్థంలేదు— అన్నారు శ్రీమతి ఇందిరాగాంధి. ఇంకా వారు ఈ విధంగా చెప్పారు —

"స్వాతంత్ర్యానికి పూర్వమే అభివృద్ధి ప్రణాళికలను మనం రూపొందించుకున్నాం. స్వాతంత్ర్య సంపాదనలో ఆంధ్రులు అనుపమ శౌర్య పరాక్రమాలను ప్రదర్శించారు. ఎన్నో త్యాగాల్ని చేశారు. ఆనాడు శౌర్య ధైర్య సాహసాలతోనూ సమైక్యతతోనూ, పరస్పర సహకారంతోనూ స్వాతంత్ర్య పోరాటాన్ని మనం కొనసాగించాం. అందుచేతనే స్వాతంత్ర్యాన్ని సంపాదించగలిగాం. అయితే స్వాతంత్ర్యసంపాదన ప్రాథమిక చర్యమాత్రమే. ఈ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాలీ అంటే ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కూడా మనం సాధించుకోవాలి. దేశఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలి. గత పంతొమ్మిదేళ్ళుగా ఈ కృషిలోనే మనం నిమగ్నులమై ఉన్నాం.

"మనది సువిశాలమైన దేశం. ఈ నాడు మనం ఎదుర్కొంటున్న సమస్యల వంటి వాటిని యితరదేశాలుకూడా ఎదుర్కొని వుండవచ్చు. అయితే మనం మన అసంఖ్యాక నిరక్షరపు ప్రజలతో ఎదుర్కొంటున్నంత పెద్దఎత్తున వారు ఎదుర్కొని వుండలేదు. ఈవిషయంలో మరేదేశంతోనూ పోల్చాల్సిన అవసరంలేదు. ఇంతవరకూ ఎదుర్కొంటూ మనం సాధించిన కృషి ఫలితం మనం చూస్తూనే వున్నాం. దేశస్వరూపాన్నే మార్చివేశాం. అయితే గత కొద్దిసంవత్సరాలుగా మనం మోస్తున్న బరువు మరీ ఎక్కువయ్యింది. విదేశదురాక్రమణల వల్ల మన నిధులను అటువైపుగా మళ్ళించవలసి వచ్చింది. దేశంలో క్షామపరిస్థితులు ఏర్పడినందువల్ల ఉత్పత్తులలో తగ్గుదల కనిపించింది. అందువల్లనే మనం కష్టాల్ని ఎదుర్కోవలసి వస్తున్నది. దీనికితోడు విదేశీమారక ద్రవ్యం సమస్య ఒకటి మననెత్తిమీద పడింది.

"ఆంధ్రప్రదేశ్‌లో క్షామపరిస్థితి ఏర్పడినట్లు చెప్పారు. క్షామం వున్నా ఇక్కడ పంట దిగుబడి బాగానేవుంది, ఇతర రాష్ట్రాలకు కొంతవరకు ఎగుమతిచేసినా యింకా ఈ రాష్ట్రంలో తగినంతగా ఆహారం వుండనే వుంటుంది. 'మేము యింత తక్కువ ఆహారాన్ని తింటుండగా ఆంధ్రలో అంత ఎక్కువ కోటా ఏమిటి' అని యితర రాష్ట్రాలవారు అంటున్నారు. మనం ఆంధ్రులమైనా, కాశ్మీరీలమైనా మన మంతా కలిసి కష్టసుఖాల్ని పంచుకోవాలి. అప్పుడే మనం ఒక్క త్రాటిమీద నిలవగలం. సమైక్యతను సాధించగలం". అన్నారు ప్రధాని.

గత కొన్నేళ్ళుగా మనం క్లిష్టపరిస్థితిలోవున్నాం. దేశంలోని ఆహార కొరత సమస్యను పరిష్కరించడానికి ఇతర దేశాల సహాయం పొందాల్సివచ్చింది — అన్నారు శ్రీమతి ఇందిరాగాంధి.

రూపాయి విలువ తగ్గింపును గురించి ప్రధాని మాట్లాడుతూ "ఇది మంచి పనికాదని మనకు తెలుసు. సంతోషంగా యీ చర్య తీసుకోలేదు కూడాను, బాగా ఆలోచించిన మీదటనే యీ నిర్ణయం

తీసుకోవడం జరిగింది. దీనివల్ల సమస్యలు ఉత్పన్నంకావనీ, కష్టాలు చేకూరవనీ అనుకోడానికి వీల్లేదు. అయితే మరీ ఎక్కువ ప్రమాదం కలగని విధం ఏదో ఆవిధంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీనితోపాటు మరి కొన్ని చర్యల్నికూడా తీసుకోవాలి. ఎగుమతుల్ని మనం అధికం చేసుకోవాలి. అందువల్ల మన విదేశీ మారకద్రవ్య పరిస్థితి మెరుగు పడుతుంది. మన కరెన్సీ దేశం వెలుపలకు వెళ్ళిపోతున్నది. అదే యీ నాడు మనల్ని ఎదుర్కొంటున్న సమస్య. దురదృష్ట వశాత్తూ మన దేశశ్రేయస్సును విస్మరించి మన కరెన్సీని దేశం వెలుపలకు చేరవేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం రూపాయి విలువను తగ్గించిందంటే ప్రభుత్వం వాస్తవికతను గుర్తించిందని అనుకోవాలి. ఈ నాడు రూపాయి విలువను తగ్గించకుండా మరికొన్ని నెలల అనంతరం ఆ చర్యతీసుకున్నామనుకోండి. అప్పుడు మరీ ఎక్కువగా యిబ్బందుల్ని ఎదుర్కోవలసివుంటుంది" అన్నారు.

రూపాయి విలువ తగ్గింపు అనంతర పరిణామాలను గూర్చి మాట్లాడుతూ ప్రధాని ఈ విధంగా తెలియజేశారు. "దీనివల్ల ధరలు పెరుగుతాయి. విదేశవస్తువుల ధరలు మాత్రమే పెరగవచ్చు. విదేశాలనుంచి దిగుమతికాని వస్తువుల ధరలుకూడా పెరిగాయంటే దానికి అర్థంలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వదేశీ వస్తువులనే మనం వాడేందుకు ప్రయత్నించడం అవసరం. అది మనం కర్తవ్యంకూడా. స్వదేశీ ఉద్యమానికి గాంధీజీ నాందిపలికారు. ఈ నాడు మనం రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక ఔషధాలు వంటి అత్యవసరమైన వాటిని మాత్రమే దిగుమతి చేసుకోవడానికి ప్రయత్నించాలి. వ్యవసాయోత్పత్తిని, కర్మాగారాలలో ఉత్పత్తిని అధికం చేయడానికి తోడ్పడే వస్తువుల దిగుమతుల మీద నిర్బంధాలను తొలగించడం అవసరం" అన్నారు.

నెహ్రూ విధానాలనుంచి తాము వైదొలగుతున్నామన్న విమర్శను గురించి మాట్లాడుతూ అది నిజంకాదనీ, గాంధీ, నెహ్రూజీలు మనకు మార్గాన్ని రూపొందించారనీ, జాతీయ, అంతర్జాతీయ విషయాలలో తమకు ఆమార్గమే శరణ్యమని, అయితే ఆ విధానాల పరిమితులమేరకు కొన్ని సర్దుబాట్లు చేసుకోవడం అవసరమని అన్నారు. తగిన విధంగా మనం చేపట్టని కారణం వల్ల చాలా వరకు మన కార్యక్రమాలు విజయవంతం కాలేదన్నారు. మనల్ని దిగ్బంధనం చేసివేసే సమస్యలు అనేకం మన చుట్టూవున్నాయి అని తెలియజేశారు.

విదేశ సహాయాన్ని గురించి మాట్లాడుతూ అమెరికా, ఇంగ్లాండు, రష్యా, జర్మనీ, జపాను తదితర దేశాలనుంచి భారత దేశం ఆర్థిక సహాయం పొందుతున్నది. ఈ సహాయాన్ని యిటీవలి కాలంనుంచే మనం పుచ్చుకొనడంలేదు. స్వాతంత్ర్యం పొందిన దగ్గరనుంచి కూడా సహాయం అందుకుంటూనే వున్నాం. విదేశీ సహాయం పొందుతున్న వాళ్ళం. మనం ఒక్కరిమేకాదు, ఇతరదేశాలుకూడా మొదట్లో విదేశాలనుంచి సహాయంపొంది, ఆ తర్వాత స్వయం సమృద్ధమయ్యాయి. ముందు ఎప్పుడో తీసుకొనవలసిన అవసరం లేకుండా యిప్పుడే మనం ఆ సహాయాన్ని అందుకుంటున్నాం. ముందుముందు మనంకూడా సహాయం చెయ్యగల స్తోమతుకు చేరుకుంటాం. మనకన్న పేద దేశాలకు, కొన్ని ఆఫ్రికా దేశాలకు మనం సహాయం చేస్తున్నాం. విదేశీ సహాయాన్ని పొందడంలో తప్పేమీలేదు. మనం తీసుకుంటున్న సహాయానికి ఏ షరతులూలేవు. అయితే కొన్ని ప్రతిపాదనలు చేశారుగాని వాటిని అంగీకరించేదీ, లేనిదీ మనమీద ఆధారపడి వుంటుంది. ఇంతకు పూర్వంలాగా యిప్పుడుకూడా మన విధానం స్వతంత్రమైనదే.

"రూపాయి విలువ తగ్గించినందుకు మన కమ్యూనిస్టు సోదరులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొంతకాలం క్రిందట రష్యాకూడా వాళ్ళ రూబుల్ విలువను తగ్గించిందన్న విషయాన్ని వారు విస్మరిస్తున్నారు. పండిట్ జీ (నెహ్రూ) ఇంకా బ్రతికి వుంటే వారుకూడా ఇంతకు భిన్నంగా మరోచర్య తీసుకుని వుండరు. వారి ఆలోచన అతిసునిశితమైనదీ, దృఢమైన దీనీ. మనం మరణించినాసరే అందుకు సిద్ధమేగాని విదేశంనుండి మనం ఆహారాన్ని దిగుమతి చేసుకోవద్దు అని ఒక పార్లమెంటు సభ్యుడెవరైనా అనొచ్చు. అలాచేస్తే అప్పుడు ఆకలితో మరణించేది ఆ పార్లమెంటు సభ్యుడూకాదు, నేనూకాదు, సామాన్య ప్రజానీకమే ఆకలికి బలి అయ్యేది. నా ప్రజలు ఆకలితో అలమటించి అసువులు కోల్పోవడాన్ని నేనెలా భరించగలను? ప్రజలకు అన్నపెట్టే బాధ్యత మనమీదలేదా? స్వాతంత్ర్యానికి పూర్వం ఎంతో మంది ఆకలితో అసువులు కోల్పోయారు. కరువులేకుండా ఏ సంవత్సరమూ గడవలేదు. కాని స్వాతంత్ర్యానంతరం ఏ వ్యక్తీ ఆకలితో మరణించకుండా వుండడానికి తగు చర్యలు తీసుకొనడం జరిగింది". అన్నారు శ్రీమతి ఇందిరాగాంధి.

క్షామ ప్రాంతాలలో తమ పర్యటనను గురించి ప్రధాని మాట్లాడారు. ఎక్కడకూడా ప్రజలు అన్నం పెట్టమని తన దగ్గరకి రాలేదని, క్షామం తలెత్తకుండా చూడమని అర్థించారని అన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మరికొన్ని రాష్ట్రాలు అధిక వ్యవసాయోత్పత్తికి తగు చర్యలు తీసుకున్నాయనీ, సాధారణంగా మధ్యప్రదేశ్‌లోని రాయపూర్ జిల్లాలో ధాన్యం విరగ పండేదనీ, యీ ఏడాది అక్కడ ఒక్క వడ్లగింజకూడా పండలేదని, అందువల్ల వారికి ధాన్యం సరఫరా చేయవలసిన అవసరం ఎంతయినా వున్నదని అన్నారు.

"విదేశాలనుండి సహాయం పొందకుండా వుండడానికే చాలా వరకు మనం ప్రయత్నిస్తున్నాం. మనకు విదేశాలనుండి లభిస్తున్నది దానంకాదు, బహుమతి అంతకన్నాకాదు. అది ఋణం మాత్రమే. ఆడబ్బును మనం తిరిగి చెల్లించివేస్తాం. చెల్లించి వేస్తున్నాంకూడా".

ఇంకా ఆమె ఇలా అన్నారు—

"సోషలిజం మన ధ్యేయం. మనం సోషలిజం మార్గంనుండి పక్కకు మళ్ళుతున్నామా? అన్నదేప్రశ్న. మనం మిశ్రమ ఆర్థిక విధానాన్ని అనుసరిస్తున్నాం. దేశప్రగతికి తోడ్పడేందుకే మనం

మన శక్తినంతటినీ వినియోగిస్తున్నాం. ప్రయివేటు రంగంలో సాధించలేని బృహత్కార్యాలు చాలావున్నాయి. వాటిని ప్రభుత్వం నెరవేర్చాల్సి వుంది. అందువల్ల మనం పబ్లిక్ రంగాన్ని పటిష్ఠ వంతంచేయడం అవసరం. దానిని విస్తృత పరచడం అవసరం. ఆపని మనం చేస్తున్నాం. దానితోపాటు ప్రయివేటు రంగానికి కూడా ప్రాధాన్యతను యిస్తున్నాం.

"హరిజనులు, ఆదివాసిలు, గిరిజనులు, సాగుభూమిలేని వ్యవసాయదారులు వంటి సమాజంలోని బలహీన వర్గాలవారి అభి వృద్ధికి మనం కృషిచేయాలి. వారి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతీసు కుంటేనే తప్ప లేకపోతే భారతదేశం అనే యీ ఏక కుటుంబం బలహీన పడిపోతుంది" అన్నారు శ్రీమతి ఇందిరాగాంధి.

విదేశాంగ విధానాన్నిగురించి మాట్లాడుతూ అందరితోనూ స్నే హాన్ని వృద్ధిచేసుకోవడమే భారత దేశ విదేశాంగ విధానం అన్నారు. "అయితే మన ఎదుట సవాలు నిలిచినప్పుడు ఆసవాలుకు జవాబు చెప్పి మన శక్తిని నిరూపించుకుంటాం. ఇటీవల భారత-పాకిస్తాను సంఘర్షణలో ప్రజలందరూ అసమానధైర్య సాహసాల్ని ప్రదర్శిం చారు. ప్రజలందరూ ఒకత్రాటిమీద నిలచి ఏ సవాలునైనా ఎదుర్కో గలమని నిరూపించారు. ఏ దురాక్రమణనైనా త్రిప్పికొట్టడానికి మన సైన్యం సిద్ధంగావుంది" అన్నారు.

చైనా, పాకిస్తానులు మినహా మిగిలిన దేశాలన్నీ మనస్నేహాన్ని వాంఛిస్తున్నాయన్నారు. భారతదేశం ప్రజాస్వామిక దేశమనీ, అది సమైక్యతతో, శాంతియుతంగా వున్న దేశమనీ, ప్రపంచలో అనేక శక్తి సమన్వితమైన దేశమనీ, భారతదేశం బలహీన పడితే శాంతి ప్రజాస్వామ్యాలే బలహీన పడిపోతాయనీ ప్రపంచం గుర్తించిదని ఆమె తెలియజేశారు. అందువల్ల మనకు సహాయ పడదలచిన వారి సహాయంలో కొంత స్వార్థంకూడా కలిసివున్నదని ఆమె అన్నారు.

తన విదేశ పర్యటనను గురించి శ్రీమతి ఇందిరాగాంధీ ఈ విధంగా తెలియజేశారు.

"అమెరికా ప్రభుత్వమూ, ప్రజలు నాకు హృదయపూర్వక స్వాగతం చెప్పారు. ఆ స్వాగత గౌరవం నా ఒక్కదానికే సంబంధించినది కాదు, అది యావత్ భారత ప్రజలదీను. ఒక బృహత్కార్యాన్ని భారతదేశం సాధించ దలచిందన్న విషయాన్ని వారు గుర్తించారు."

"తమ దేశాన్ని సందర్శించ వలసిందిగా రష్యానుంచికూడా ఆహ్వానం వచ్చిందినాకు. అయితే పార్లమెంటు సమావేశాలకు నేను హాజరు కావలసివున్నందున అప్పుడు నేను అక్కడకు వెళ్ళ లేదు. కొద్ది రోజుల్లో నేను రష్యా వెళ్ళబోతున్నాను. మన విదేశాంగ విధానంలో ఏమార్పూలేదని విదేశాలకు తెలియ వలసిన అవసరం ఎంతయినావుంది."

"రానున్న ఆరేడు నెలలూ మన దేశానికి చాలాగడ్డు కాలం. మనం యీ కాలాన్ని ధైర్యంతోనూ, సమైక్యంగానూ ఎదుర్కొని అధిగమించ గలిగితే ఆపైన, పడిన కష్టానికి తగిన ఫలితాన్ని అను భవించవచ్చు. ఓడిపోయామో చిరకాలం మనం బాధ పడక తప్పదు" అన్నారు శ్రీమతి ఇందిరాగాంధి. వస్తువుల ధరలను గురించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్ని అనువుగా చేసుకుని వస్తువుల ధరల్ని పెంచేవారికి తగినట్టు బుద్ధి చెప్పాలన్నారు. అత్యవసర వస్తువుల ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం సబ్సిడీ యిస్తుందని తెలియజేశారు.

చాలా సమర్థవంతంగానూ, చక్కగానూ ప్రభుత్వ యంత్రాం గాన్ని నడుపుతున్నందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ప్రధాని అభినందించారు. వారి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభ్యుద యాన్ని సాధించగలదన్న విశ్వాసాన్ని ఆమె తెలియజేశారు.

విశాఖపట్టణంలో అయిదవ ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పవల సిన ఆవశ్యకతను గూర్చి ముఖ్యమంత్రి ప్రస్తావించిన అంశంపై ప్రధాని మాట్లాడుతూ "దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. ఈనాడు దేశం చాలా క్లిష్ట పరిస్థితులలో వుంది. అందువల్ల ఇది ప్రభుత్వానికి అదనపు భారమో కాదో, ఒక వేళ భారమే అయిన పక్షంలో అది ఎంతమేరకో మొదలయిన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించవలసివుంది. తమ బాధ్యతలను, బరువులను యిప్పట్టున పెంచుకోవచ్చా అనే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించవలసివుంది."

"ఉక్కుకర్మాగారం స్థాపనపై ఢిల్లీలో చర్చలు జరుగు తున్నాయి. త్వరలోనే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుంది. ఉక్కుకర్మాగారం నెలకొల్పడానికి వీలువుంటే నెలకొల్పవచ్చు. ఒకవేళ యిప్పుడు వీలుపడదనుకోండి అందుకు కారణం— మనకు యిప్పుడువున్న పరిమితమైన వసరులే అనుకోవాలి. ఉక్కుకర్మాగాన్ని నెలకొల్పుకోదలిస్తే అది మరీ భారీ ఎత్తున కాకుండా ముందు చిన్న ఎత్తున ప్రారంభించి, ముందు ముందు విస్తృత పరచుకొనే విధంగా నైతే బావుంటుంది" అన్నారు ప్రధాని.

ఈ ఏడాది మనం వ్యవసాయోత్పత్తి మీదనే అధికకృషిని కేంద్రీకరించాలి అన్నారు. అయితే కర్మాగారాల్లో ఉత్పత్తిని కూడా అభివృద్ధి పరచాలి అనికూడా తెలియజేశారు.

దేశంలో యీనాడు నెలకొనివున్న సమస్యల్ని తాను ఏకరువు పెట్టానని, అంతా మాత్రంచేత ప్రజలు భయపడిపోవలసిన పని లేదని అంటూ "మన యువకులపై నాకు అపారమైన విశ్వాసం వుంది. ఏలాంటి కష్టతరమైన కార్యాన్నయినా వారు సాధించ గలరు. మన వ్యవసాయదారులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్ని చేపట్టగలరు. విదేశాలనుంచి కొద్దిపాటి సహాయంతో మనం ముందుకు కదిలివెళ్ళితే యీచీకటిని అధిగమించి వెలుతుర్ని చూడగలం. ఆ విశ్వాసం నాకువుంది. నేనుమిమ్మల్ని కోరేది ఒక్కటే-మనమంతా కలిసి పని చేద్దాం. దేశాన్ని ప్రగతిపథంలో నిలిపి ఐశ్వర్యవిలసితం చేదాం," అన్నారు.

ప్రధాని తమప్రసంగాన్ని ముగిస్తూ భారత దేశం అతిప్రాచీన దేశంఅనీ, ప్రాచీన సాంప్రదాయంలోని మంచినిఅంతా పరిరక్షించు కుంటూ ఆధునిక కాలంలో శాంతి ప్రతిష్ఠాపనకు భారత దేశం కృషిచేస్తున్నదనీ, ఇట్టితరుణంలో మనమంతా, గతంలో స్వాతంత్ర్య పోరాటంలో ఏకత్రాటిమీద నడిచిన విధంగా, సమైక్యతతో కృషిచేయాలని అన్నారు.

* * *

శ్రీమతి ఇందిరాగాంధి ప్రధాన మంత్రిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా "మన కాస్మాపాలిటన్ నగరం" హైదరాబాదుకు విచ్చేసిన సందర్భంలో ఆమెకు ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి స్వాగతం పలుకుతూ; ఆమెకు స్వాగతం చెప్పడానికి గుమిగూడిన లక్షలాది ప్రజల్ని చూస్తుంటే ఆమెఎడల ప్రజలకు గల అభిమానం ఎంతగాఢతరమైనదో అర్థం అవుతున్నదని అన్నారు.

"దేశంలో ఎన్నో క్లిష్టపరిస్థితులు నెలకొనివున్న సమయంలో అటు కరువు కాటకాలూ, యిటు భారత పాకిస్తాను సంఘర్షణ అనంతర పరిణామాలనుండి దేశం యింకా కోలుకోని సమయంలో ఇందిరాగాంధి ప్రధాని పదవిని అధిష్టించారు విదేశాల్లో పర్యటించి భారతదేశ స్వరూపాన్ని వారి ముందుంచారు. ఏతత్ఫలితంగా మన అవసరాలను పెద్ద పెద్ద దేశాల వారు గుర్తించి సహాయపడ్డారు. కష్టాల్లో మనల్ని ఆదుకునే మిత్రులున్నారు అని తెలుసుకోవడం ఎంతో ఆనంద దాయకం అయ్యింది."

"శ్రీమతి ఇందిరాగాంధి ప్రధానిగా ఎన్నికయినప్పుడు ప్రజలు ఆమెమీద పెట్టుకున్న ఆశల్ని అడియాసలు చేయలేదు. ఆమెముందు నిలచిన సవాలును ఎదుర్కొనగలిగే అంత ఉన్నతంగా నిలిచారు." అన్నారు శ్రీ బ్రహ్మానందరెడ్డి.

శ్రీమతి ఇందిరాగాంధి కాంగ్రెసు అధ్యక్షురాలిగావున్న సమయంలో, తండ్రివలె ఆమెకూడా ప్రజాస్వామ్యవాది అని నిరూపించుకున్నారన్నీ. ప్రజలు తమ ఊహల్లో ప్రతిష్ఠించుకున్న స్థాయికి చేరగలిగారని అన్నారు శ్రీ బ్రహ్మానందరెడ్డి ఆమె నాయకత్వ ప్రతిభకు అభినందనలు తెలియజేస్తూ పురుషులుకూడా వెనుకంజవేసే కొన్ని కొన్ని నిర్ణయాల విషయంలో-ముఖ్యంగా ఎన్నికల సంవత్సరంలో కొన్ని కొన్ని జటిల విషయాలలో ఒక నిర్ణయం తీసుకోవడంలో—చాలా ధైర్యాన్ని తెగువను ప్రదర్శించారని అన్నారు. రూపాయి విలువ తగ్గింపు విషయాన్ని, పంజాబీ సుభా విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావిస్తూ యీ విషయాలలో ఆమె తీసుకున్న నిర్ణయాలను ఆలోచించి చూస్తే ఆమెవంటి గొప్పనాయకులకే అది సాధ్యమని అన్నారు.

రాష్ట్ర సమస్యలను గురించి ముఖ్యమంత్రి ప్రస్తావిస్తూ తాను వాటన్నిటినీ ఏకరువు పెట్టదలచుకోలేదనీ, ప్రధాని తనకు యిచ్చే మద్దతూ, నమ్మకము-యివే తనబాధ్యతలను నెరవేర్చడానికి తనకు శక్తి నివ్వగలవనీ అన్నారు.

"ఆంధ్ర ప్రదేశ్ తీవ్రక్షామానికి గురయ్యింది. ఇది నమ్మ దగ్గ విషయంగా అనిపించక పోయినా నమ్మక తప్పదు. ఇంతగా క్షామానికి గురైనప్పటికీ యీ రాష్ట్రం యితర రాష్ట్రాలకు బియ్యం సరఫరా చేస్తోంది బియ్యాన్ని సరఫరాచేస్తూ, ఉక్కు కర్మాగారాన్ని మాకు యిప్పించమని అడుగుతున్నాను నేను. దేశస్వాతంత్ర్య సముపార్జనలోనూ, దేశస్వరూప నిర్మాణంలోనూ ఎంతగానో తోడ్పడిన ఈ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రప్రజలను మీరు నిరుత్సాహ పరచరన్న విశ్వాసం నాకువుంది"-అన్నారు ముఖ్య మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రధానిని ఉద్దేశిస్తూ.

తమన్యాయమైన కోర్కెల్ని మన్నించగలరనీ, ప్రజాస్వామ్యవాదిగా యావదాంధ్ర ప్రజల్లో, నిరుత్సాహాన్ని రేకెత్తించరని తాము ఆశిస్తున్నామనీ అన్నారు. "మీరు న్యాయంచేకూర్చగలరని నాలుగుకోట్ల తెలుగు ప్రజలూ విశ్వసిస్తున్నారు"-అని ప్రధానికి తెలియజేశారు ముఖ్యమంత్రి.

రానున్న క్లిష్టకాలాన్ని గురించి ప్రస్తావిస్తూ నాలుగు కోట్ల ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు కలిసికట్టుగా ప్రధానికి అండగా నిలువగలరని తమ హామి తెలియజేశారు. "మీ నాయకత్వం క్రింద ప్రజలు ప్రగతి పథంలో పయనించాలని నేను ఆశిస్తున్నాను" అన్నారు.

నెహ్రూస్మారక నిధి నిమిత్తం ప్రధానికి 7 లక్షల రూపాయల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. దీనితో కేంద్ర నిధికి రాష్ట్రం విరాళం మొత్తం 25 లక్షల రూపాయలయ్యింది. రాష్ట్రంవాటా 40 శాతం తీసివేయగా మిగిలిన మొత్తమిది. స్వర్గీయ జవహర్లాల్ తృతీయ వర్ధంతి ముందుగానే రాష్ట్రంలో అనేక బాల భవనాలను ప్రారంభించడం జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రధానికి తెలియజేశారు. ప్రధానికి వారిఎదుటగల బృహత్తరకార్య నిర్వహణలో అండగా నిలుస్తానని మరొకసారి ముఖ్యమంత్రి ప్రధానికి హామీయిచ్చారు.

హైదరాబాదు, వరంగల్లు, కడప, విజయవాడ, విశాఖపట్టణాలను సందర్శిస్తూ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి, రాష్ట్రంలో జూన్ 23 నుంచి 26 వరకు మూడు రోజులపాటు చేసిన పర్యటన చాలా విజయవంతమైంది. ప్రధాని ఎక్కడకు వెళ్ళినా బారులు దీర్చిన అశేష ప్రజానీకం—వారిలో అత్యధిక సంఖ్యాకులు స్త్రీలు—హృదయపూర్వక స్వాగతాలతో ముంచెత్తి వేసారు. నెహ్రూజీ భారత దేశంలో ఏప్రాంతాన్ని సందర్శించడానికి వెళ్ళినా పరంపరాగతంగా స్వాగతసత్కారాలు బహుళసంఖ్యలో లభించిన వెనకటి దినాలు జ్ఞప్తికి వచ్చాయి—ఆ ప్రజావాహినిని చూస్తుంటే.

★

సంయుక్త శాసనసభలో గవర్నరు ప్రసంగం

రాష్ట్ర సౌభాగ్యంకోసం దీక్షబూనండి

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ పట్టంతాను పిళ్లై రాష్ట్ర శాసనసభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ, రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులు ఏర్పడినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆహారోత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించినదని పేర్కొన్నారు. గత సంవత్సరం విడుదల అయినంత ఉత్తమ ధాన్యం ఈ యేడు మన రాష్ట్రంలో లభించదంకష్టం అని కూడా వారు అన్నారు. ఈ ఖరీఫ్ పంటకాలంనుంచి రాష్ట్రమంతటా పంటల ఋణాలు యివ్వబడుతాయని ప్రకటించారు.

గతపర్యాయం మిమ్ములను ఉద్దేశించి ప్రసంగించిన తరువాత మన దేశానికి సంబంధించి ముఖ్యసంఘటనలెన్నో జరిగాయి, క్రూరవిధి మన ప్రియతమ ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిని మననుండి వేరుచేసి తీవ్రఘాతం కలిగించింది మనకు. ఆయన నేతృత్వంవహించిన పద్దెనిమిది మాసాల కాలంలో అనేక క్లిష్ట సమస్యల నెదుర్కొని మనదేశాన్ని విజయ వంతగా ముందుకునడిపించారు. ఆయన ఎదుర్కొన్న సమస్యలలో కడపటిది పాకిస్తాన్‌తో జరిగిన సాయుధ సంఘర్షణ. అది భారతదేశ సమైక్యతను, దేశ సమగ్రతను వాటిల్లే ఏ సవాలునైనా ఎదుర్కొనడానికి ఏకవ్యక్తిగా సంఘటితంకావాలన్న జాతిసంకల్పాన్ని యావత్ప్రపంచానికి చాటిచెప్పింది.

స్వర్గీయ ప్రధాని నిర్విరామకృషి, వ్యవహారదక్షతలవల్లనే తాష్కెంటు ఒప్పందం సాధ్యమైంది. తాష్కెంటులో జనించిన ఈ శాంతి అవగాహనా వాతావరణం వృద్ధిచెందె. వివిధ క్లిష్ట సమస్యలను అదే వాతావరణంలో పరిష్కరించు కోవడానికి ప్రపంచంలోని సర్వదేశాలకు మార్గదర్శకం కాగలదని మన సంపూర్ణ విశ్వాసం.

అనావృష్టి, సహాయక చర్యలు



ప్రకృతి మనపట్ల నిర్దయ వహించింది. వర్తమాన వ్యవసాయ సంవత్సరంలో వర్షఋతు వైఫల్యంవల్ల రాష్ట్రంలోని 16 జిల్లాలలో మునుపెన్నడూ ఎరుగని అనావృష్టి పరిస్థితులు ఏర్పడినై. తత్ఫలితంగా 1.82 కోట్ల జనాభాగల 11,917 గ్రామాలకు నష్టం వాటిల్లింది. ఒక్క మొదటి పంటకాలంలోనే ఆహారపంటల క్రిందవున్న 6127,539 ఎకరాలభూమి బాగా దెబ్బతిన్నది. రాష్ట్రంలో విస్తారంగా పండించే ప్రధాన నగదుపంట అయిన వేరుసెనగ దాదాపు విఫలమైంది. విస్తృతమైన ఈ విపత్తును గురించిన నివేదికలు అందగానే మన ప్రభుత్వం తొలిచర్యగా శిస్తుమాఫీకి ఉత్తరువు లిచ్చింది. నాలుగణాలకంటె తక్కువ పంట వచ్చిన భూములపై శిస్తును పూర్తిగాను, 4-6 అణాలమధ్య పంట దిగుబడి అయిన భూములపై సగం శిస్తును మాఫీచేసింది. భూమిశిస్తు బకాయిలు, ప్రస్తుతపు శిస్తు, తక్కావీ ఋణాల కిస్తులు, సెస్సుల వసూళ్ళను వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తరువు చేసింది.

అనావృష్టికి గురైన ప్రాంతాలలో సహాయక చర్యలు గైకొనడం కోసం ప్రభుత్వం వివిధ పద్దుల క్రింద సుమారు మూడుకోట్ల రూపాయలు మంజూరు చేసింది. మంచినీటి బావులను లోతుచేయడం, మంచి నీటి సరఫరాకు రవాణా ఖర్చులు, పశుగ్రాసం సరఫరాకు సబ్సిడీ, రోడ్ల నిర్మాణం, నీటిపారుదల పనుల పునరుద్ధరణ, సహాయక పనుల్లో నిమగ్నమైవున్న వ్యక్తులకు సరఫరా చేసిన ఆహార ధాన్యాలపై సబ్సిడీ, విత్తనాల సరఫరా, ఆపద

తక్కావీ ఋణాల మంజూరు మొదలైన వాటికోసం పై మొత్తం మంజూరు చేయబడింది. భారత ప్రభుత్వం అనావృష్టి సహాయక చర్యల కోసం మన రాష్ట్రానికి ఇప్పటికి ఒక కోటి రూపాయల ఋణసహాయం మంజూరు చేసింది. కొన్ని విదేశీ ప్రభుత్వాలు, భారత రెడ్‌క్రాస్ సంస్థ ఔదార్యంతో పాలపొడి, గోధుమ, శిశు ఆహారం మొదలైన వాటిని విస్తారంగా అందజేశాయి. వారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

అగ్ని ప్రమాదాలు

వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించడం అరుదుకాదు. కాని దురదృష్టవశాత్తు విజయవాడ, గుంటూరు పట్టణాలలోను, వాటి పరిసరాలలోను వరుసగా భారీ ప్రమాదాలనేకం సంభవించి, 26 మంది వ్యక్తులప్రాణాలను బలిగొన్నాయి. ఇతర చోట్ల కూడా తీవ్ర అగ్ని ప్రమాదాలే జరిగాయి. అగ్నికి అహుతైన ఆస్తివిలువ అధికంగానేవుంది. విజయవాడలోను, ఆ చుట్టుపట్లా పదేపదే అగ్ని ప్రమాదాలు జరగడానికి గల కారణాలను గురించి, పరిస్థితులను గురించి సమగ్ర విచారణకు ప్రభుత్వం ఉత్తరువులు జారీచేసింది. ఇందుకోసం ఒక జిల్లా జడ్జిని విచారణ సంఘంగా నియమించింది. (1) విజయవాడ, గుంటూరులలోను, ఆ పరిసరాలలోను అగ్ని ప్రమాదాలు జరగడానికిగల కారణాలను గురించి, (2) ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను గురించి, (3) తీసుకోవలసిన ఏవేని ఇతర చర్యలను గురించి సంఘం విచారణ జరుపుతుంది. రెండు మాసాలలోగా సంఘం తన నివేదికను సమర్పించగలదని ఆశించబడుతున్నది.

అగ్నిబాధితులు, నిర్వాసితులైనవారికి సహాయం అందజేయడానికి ప్రభుత్వం తగు తక్షణచర్యలు గైకొన్నది. సహాయానికి అర్హులైన బాధితులు ఒక్కొక్కరికి అనుమతించదగిన గరిష్ఠరేటు ప్రకారం అంటే 50 రూపాయల చొప్పున ఆయా కలెక్టర్లు నగదు గ్రాంటులను పంపిణీచేశారు. వాటికితోడు ప్రభుత్వం నిర్మాణ పరికరాలు కొన్ని ఉచితంగా సరఫరా చేయడం, ఇళ్ళు కోల్పోయిన నాన్ గెజెటెడు ఆఫీసర్లకు వడ్డీలేకుండా అప్పులివ్వడం, అర్హులైన బాధితులకు దయాపూర్వక ఎక్స్‌గ్రేషియా గ్రాంట్లు చెల్లించడంవంటి ప్రత్యేక సహాయ చర్యలనుకూడా తీసుకొన్నది. బాధితులకు 100 టన్నుల గోధుమ ఉచితంగా పంపిణీ చేయబడింది. మన ప్రధాని అగ్నిబాధితుల సహాయార్థం ప్రధాని జాతీయ నిధినుంచి రూ. 30,000 లు దయతో విరాళంగా ఇచ్చారు. నా ఆధీనంలోగల గోదావరి వరద సహాయనిధి నుంచికూడా రూ. 5,000 మంజూరు చేయడం జరిగింది. బాధితులకు పంపిణీచేసే నిమిత్తం అనేక సంస్థలు గోధుమలు, బియ్యం మొదలైన అవసర వస్తువులను అందజేశాయి. వారందరికీ నామనఃపూర్వక కృతజ్ఞతలు.

ఈ ఘోర ప్రమాదాలకు గురైనవారికి నా తరపున, ప్రభుత్వం తరపున ప్రగాఢ సానుతాపం తెలుపుతున్నాను.

పౌర సరఫరాలు

దేశ ఆహారసమస్య క్లిష్టంగానే వుంటూవచ్చింది. ఈ ఏడు రాష్ట్రమందలి అనేక జిల్లాలలో తీవ్ర అనావృష్టి పరిస్థితు లేర్పడడంవల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. ఈ విషమ ఆహార పరిస్థితిని ఎదుర్కొనడంకోసం ప్రభుత్వం ఉత్పత్తిదార్లనుంచి బియ్యం సేకరణకు ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. కాని ప్రతికూల ఋతుపరిస్థితులవల్ల, పేద రైతులకు, ఉత్పత్తిదార్లకు కొంత సహాయం చేకూర్చేనిమిత్తం ఆ పథకాన్ని విరమించవలసి వచ్చింది. అయితే మిల్లర్లనుంచి బియ్యం సేకరించే పథకం మాత్రం అమల్లోనేవుంది. ఇప్పటికి 5.43 లక్షల టన్నుల బియ్యం సేకరించబడింది. రెండవ పంట విషయంలోకూడా సేకరణ కార్యక్రమం కొనసాగగలదు. భారత ఆహారసంస్థ ధాన్య సేకరణ విషయంలో ప్రభుత్వ ఏజెంటుగాను, నిలువలను ఇతర రాష్ట్రాలకు రవాణా చేసే విషయంలో కేంద్రప్రభుత్వ ఏజెంటుగాను వ్యవహరిస్తున్నది. రేషనింగు ప్రాంతాలలో బియ్యం, గోధుమ, గోధుమ ఉత్పత్తులను సరఫరా చేసే పనినికూడా అది చూస్తున్నది.

ప్రభుత్వం తగు బఫర్ స్టాకులను ఏర్పాటు చేసేందుకు సాధ్యమైన సకల ప్రయత్నాలూ చేసి 3.70 లక్షల టన్నుల బియ్యం సేకరించగలిగింది. అందులో ఇప్పటికే 1.20 లక్షల టన్నులు వినియోగించబడింది రెండవ పంటలోకూడా సేకరణద్వారా నిల్వలను అధికం చేయాలని సంకల్పించబడింది. రానున్న మాసాలలో రాష్ట్రం అంతటా కొరత ఏర్పడే అవకాశం వుంది. కనుక అప్పుడూ, తరుగు ప్రాంతాలలో తక్షణ సహాయానికి ఈ నిల్వలు వినియోగించబడతాయి. వీటికితోడు రేషనింగు వున్న హైదరాబాదు, సికిందరాబాదు, విశాఖపట్నం ప్రాంతాలకు ప్రతి నెలా సుమారు 13,000 టన్నుల బియ్యం సరఫరా చేయబడుతున్నది.

కేంద్ర ప్రభుత్వం తరుగు రాష్ట్రాలకు కనీసం 2.50 లక్షల టన్నుల బియ్యం సరఫరాచేసే బాధ్యతను మన రాష్ట్రానికి అప్పగించింది. అందుకుగాను ఇప్పటికి కేరళ, మైసూరు వంటి రాష్ట్రాలకు 1.74 లక్షల టన్నుల బియ్యం ఎగుమతి చేయబడింది. అయితే తీవ్ర అనావృష్టి ఫలితంగా అనేక ప్రాంతాలలో ఆహారధాన్యోత్పత్తి తగ్గిపోవడంవల్ల తరుగు రాష్ట్రాలకు పై స్థాయిలో ఎగుమతులను కొనసాగించడం సాధ్యం కాదని మన ప్రభుత్వం కేంద్రానికి నచ్చచెప్పింది. మనం ఎగుమతి చేసిన బియ్యానికి బదులు మనకు వచ్చే మిలో, గోధుమలను అధికం చేయవలసిందని కూడా కేంద్రాన్ని కోరడం జరిగింది.

దొంగ నిల్వలను, చీకటి వ్యాపారాన్ని, దొంగ రవాణాలను అరికట్టడంకోసం పోలీసు శాఖలో ప్రత్యేక రహస్య సమాచార విభాగం ఒకటి ఏర్పాటు చేయబడింది. రాష్ట్ర సరిహద్దులలో 117 స్థావర తనిఖీ కేంద్రాలు, 18 సంచార తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. పౌర సరఫరాల ఉత్తరువుల ఉల్లంఘనకు సంబంధించిన అనేక కేసులు ఆచూకీ తీయబడ్డాయి. 3,297 కేసులలో శిక్ష విధించడం జరిగింది.

రాష్ట్రస్థాయిలో రాష్ట్ర ఆహార సలహా సంఘాన్ని, జిల్లా స్థాయిలో జిల్లా ఆహార సలహా సంఘాలను ప్రభుత్వం ఇటీవలనే ఏర్పాటు చేసింది. అన్ని రాజకీయ పార్టీలు ఈ సంఘాలలో పని

చేయడానికి, క్లిష్టమైన ఈ సమస్యను పరిష్కరించడంలో తోడ్పడ డానికి సమ్మతించినందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఈ సంఘాలు ఆహార ధాన్యాల సరఫరాను, పంపిణీని గురించి సమీక్షి స్తాయి. సరఫరాల సక్రమ పంపిణీకి, కట్టుదిట్టమైన ధర కంట్రోలుకు సంబంధించి సూచనలు కూడ చేస్తాయి.

సరసధరలను అమలుపరచి, చీకటి వ్యాపారాన్ని అరి కట్టడం అన్నది ప్రభుత్వ బాధ్యత. ప్రజలు, ప్రజా ప్రతినిధులు హృదయపూర్వకంగా సహకారం అందజేసినప్పుడు మాత్రమే ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించడానికి వీలవుతుంది. ప్రభుత్వ విధానాలను అమలుపరచడంలోను, మనకు ఎదురయ్యే ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడానికి తమకు చేయూత నివ్వడంలోను గౌరవసభ్యులు దయతో సహకారం అంద జేస్తారని ప్రభుత్వం ఆకాంక్షిస్తున్నది.

ఆహారోత్పత్తి

దేశంలో ఆహారోత్పత్తి క్రమంగా అధికమవుతున్న విషయం గౌరవ సభ్యులకు తెలిసినదే. అయినప్పటికీ నానాటికీ పెరుగుతున్న మన జనాభా అవసరాలకు అనుగుణంగా ఈఉత్పత్తి అధికం కావడంలేదు. ఆహారధాన్యాలు అధిక పరిమాణంలో ఏటేటా దిగుమతి చేసుకోబడుతున్నాయి. ఇందుకుగాను చాల విదేశీ మారకద్రవ్యం ఖర్చవుతున్నది. మునుపెన్నడూ లేనంతగా విస్తృతమైన అనావృష్టి మూలంగా ఈ పరిస్థితి మరింత తీవ్ర రూపందాల్చింది. సాధారణంగా మిగులు రాష్ట్రంగావుండి ఇతర రాష్ట్రాలకు అధిక పరిమాణంలో ఆహార ధాన్యాలను సరఫరాచేసే మన రాష్ట్రం ఈ సంవత్సరం పైపరిస్థితుల కారణంగా అలా సరఫరా చేయడం కష్టమనిపిస్తుంది.

ఎంతో విలువయిన విదేశీ మారకద్రవ్యం ఖర్చవుతున్న ఆహారధాన్యాల దిగుమతిపై ఎల్లప్పుడూ ఆధారపడి ఉన్నట్లయితే మన దేశ ఆర్థిక పరిస్థితి బాగా దెబ్బతినగలదన్న విషయం గౌరవ సభ్యులకు తెలిసినదే. ఈ పరిస్థితిని చాలకాలంవరకు కొనసాగించ డానికి వీలులేదు. ఎక్కువ ఫలసాయాన్నిచ్చే వరి, తృణధాన్యాలు, మొక్కజొన్న రకాలను విస్తారంగా పండించడమే ఈ సమస్యను పరిష్కరించడానికి అత్యవసరము, ఫలప్రదముఅయిన పద్ధతి అని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఈ రకాలు ఎకరాకు సుమారు 2, 3 టన్నులు పండుతాయి. నాల్గవ ప్రణాళికాంతం నాటికి అట్టి అధిక ఫలసాయం యిచ్చే రకాలను దేశమంతటా 325 లక్షల ఎకరాలలో పండించడానికి కేంద్రప్రభుత్వం కార్యక్రమాన్ని తలపెట్టింది. మన రాష్ట్రంలో ఈ కార్యక్రమంక్రిందికి తేదలచిన ప్రాంతం సుమారు 125 లక్షల ఎకరాలు కాగా 1966-67లో 10 లక్షల ఎకరాలలో ఈ పంటలు వేయబడుతాయి. 6.65 లక్షల ఎకరాలలో వరి పండించబడుతుంది. ఇందులో 5 లక్షల ఎకరాల మేర తైచుంగ్ నేటివ్ - 1 రకం పండించబడుతుంది. మిగతా ప్రాంతంలో ఇతర రకాలు వేయబడుతాయి. సుమారు 2.9 లక్షల ఎకరాలలో సంకరజొన్న, 0.20 లక్ష ఎకరాలలో సంకర మొక్క జొన్న, 0.3 లక్షల ఎకరాలలో సంకర సజ్జ పండించాలని సంకల్పించబడింది. గత సంవత్సరంలో ఈ రకాలను పండించడం ద్వారా పొందిన అనుభవాన్ని బట్టి తైచుంగ్ నేటివ్-1 రకం, రాబీకాలానికి బాగా అనువైనదని కనుగొనబడింది. ఈ రకం ఎకరాకు 36 నుండి 50 క్వింటాళ్ళవరకు పండింది. సాంద్ర ఎరువుల పథకం క్రింద పంచాయితీ సమితులద్వారా రైతులకు ఋణాలు పంపిణీ చేయబడుతున్నాయి. 1965-66లో 3.5 లక్షల టన్నుల రసాయనిక ఎరువులు (అమోనియం సల్ఫేటు) పంపిణీ చేయబడినాయి. ఈ సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం 7.5 లక్షల టన్నుల రసాయనిక ఎరువులను (అమోనియం సల్ఫేటు) కేటా యించడానికి వాగ్దానం చేసింది. ఇందులో సుమారు ఒక లక్ష టన్నుల ఎరువు ఇంతవరకు పంపిణీ చేయబడింది.

ఉత్పత్తి ఋణాలు

వ్యవసాయ పరపతి విషయంలో తగు సదుపాయాలులేనిదే ఆహార ఉత్పత్తి పెరగదనే సంగతి గౌరవసభ్యులకు విదితమే. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని పరపతి సౌకర్యాలను పెంపొందింప జేయడానికి సకల చర్యలు తీసుకోబడుతున్నాయి. ఉత్పత్తి పరపతి రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించబడిందని తెలియజేయ డానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను. సహకార సంఘాలద్వారా వ్యవసాయదారులకు అందజేయబడే స్వల్పకాలిక, మధ్యకాలిక ఋణాలు క్రమంగా పెరిగాయి. ఈ ఋణాలు 1955-56 లో సుమారు రూ. 5.00 కోట్లు ఈయబడగా 1965-66 లో రూ. 17.00 కోట్లు ఈయబడినాయి. 1966-67 లో సుమారు రూ. 33.00 కోట్ల వరకు స్వల్పకాలిక, మధ్యకాలిక ఋణాలను సమకూర్చాలని సంకల్పించబడింది.

పంట ఋణాలు

రాష్ట్రమంతటా 1966 ఖరీఫ్ కాలంనుండి పంట ఋణం పద్ధతిని ప్రవేశ పెట్టాలని నిర్ణయించడం జరిగింది. ఈ పద్ధతి ననుసరించి, ప్రస్తుతం అమలులో ఉన్నట్లు వ్యవసాయదార్లు ఇచ్చే హామీ విలువనుబట్టి కాకుండా వారు వేసిన పంటల అవసరాలను బట్టి ఈ ఋణాలు నిర్ణయించబడుతాయి.

అధిక ఫలసాయాన్నిచ్చే ఆహార ధాన్యాల రకాలను వేసి పండించడం కోసం పూర్తి ఆర్థిక సహాయం అందజేయడానికిగాను రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి ప్రత్యేక పరపతి పరిమితులను పొందడం కూడా జరిగింది.

పెద్దతరహా నీటిపారుదల

బృహత్తరమైన నాగార్జున సాగరు ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆశాజ్యోతి. మొత్తం భారత దేశానికే ఇది గర్వ కారణమైన ప్రాజెక్టు. దీని నిర్మాణపు పనిని శీఘ్రతరం చేసే కార్యక్రమం క్రింద నిర్ణయించుకొన్న లక్ష్యాలను సాధించడం కోసం—అంటే 1966, జులై నాటికి 5.79 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించగలగడంకోసం — ఈ ప్రాజెక్టు పని చురుకుగా సాగుతున్నది. డాము ఎత్తు క్రమక్రమంగా

పెరుగుతున్నది. ఆయకట్టు ప్రాంతాల్లో కాలువల త్రవ్వకం కొనసాగుతున్నది. నాగార్జున సాగరు రిజర్వాయరు నుండి జూలై ఆఖరువారంలో కాలువలకు నీరు వదలాలని సంకల్పించబడింది. ప్రాజెక్టు తాలూకు కాలువల క్రింద నీటిపారుదల మొట్టమొదటి సారిగా అప్పుడే ప్రారంభమవుతుంది. నాగార్జున సాగరు డాములో కొంతమేరకు చేసిన నిలువ నుంచి కృష్ణాడెల్టా ప్రయోజనార్థం గత ఏడాది మొదటి పంట, రెండవ పంట కాలాల్లో నీటిని వినియోగించడం జరిగింది. నిర్మాణపు పనుల విషయంలోనే కాకుండా కల్పించిన నీటి పారుదల సౌకర్యాన్ని వినియోగించుకోవడానికి అవసరమైనట్టి ఆయకట్టు అభివృద్ధి పథకాల విషయంలోకూడ తగిన శ్రద్ధచూపబడింది. భూమిని చదునుచేయడం మున్నగు పనులకోసం ఆయకట్టు ప్రాంతంలోని రైతులకు 1966, ఏప్రియల్ ఆఖరునాటికి రూ. 428 లక్షల మొత్తం భూమితనఖా బ్యాంకుల ద్వారా ఋణాల రూపంలో పంపిణీ చేయడం జరిగింది. 2 లక్షల ఎకరాల అవసరాలను తీర్చడానికి కాలువలను త్రవ్వడం జరిగింది.

1956–57 లో ప్రారంభించబడిన తుంగభద్ర ఎగువ కాలువ పథకం పూర్తికావస్తున్నది. ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్యమైన అన్ని భాగాల్లోను పని చురుకుగా సాగింది. 1966, జూలైలో నీటిని వదలడం జరుగుతుంది, ఇందు మూలంగా 1.19 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది.

పోచంపాడు ప్రాజెక్టు విషయంలో తగిన అభివృద్ధి సాధించడానికి వీలుపడలేదు. కేంద్ర ప్రభుత్వంనుండి అధికంగా సహాయం పొందటానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషిచేస్తున్నది.

అత్యవసర నీటి పారుదల పథకాలు

ఆహారధాన్యాలు అధికంగా పండించడంకోసం సాధ్యమైనంత శీఘ్రంగా నీటిపారుదల సౌకర్యాలు సమకూర్చే దృష్టితో కేంద్రప్రభుత్వం 1965–66 లో నీటి తోడిపోత పథకాలకు సంబంధించి ప్రత్యేకాభివృద్ధి కార్యక్రమాన్ని తలపెట్టింది. దీనికోసం మన రాష్ట్రానికి రూ. 44 లక్షలు మంజూరు చేయబడ్డాయి. ఈ కార్యక్రమం క్రింద 55 నీటి తోడిపోత పథకాలు అమలు పరచబడ్డాయి. వచ్చే పంటకాలంలో 25,000 ఎకరాలు నీటి పారుదల సౌకర్యం పొందుతాయి.

విద్యుచ్ఛక్తి

నేను క్రిందటిసారి చేసిన ప్రసంగంలో ప్రస్తావించినట్లు విద్యుత్ స్వయంసమృద్ధి విషయంలో మనం ఇంకా వెనుకబడే ఉన్నాం. విద్యుదుత్పత్తిని అధికం చేయడానికి ప్రభుత్వం సర్వ విధాలా కృషి చేస్తున్నది. శ్రీశైలం జలవిద్యుత్తు ప్రాజెక్టు, ఎగువసీలేరు జలవిద్యుత్తు ప్రాజెక్టు, కొత్తగూడెం థర్మల్ పథకం, నిజాంసాగర్ జలవిద్యుత్తు పథకం పనులు సంతృప్తికరంగా సాగుతూ వుండడం ఎంతో ముదావహం.

గత సంవత్సరంలో సంభవించిన తీవ్ర అనావృష్టి పరిస్థితుల కారణంగా మాచ్ఖండ్, తుంగభద్ర హైడల్ రిజర్వాయర్లలో నీటి నిలువ తక్కువగా ఉన్నందున విద్యుచ్ఛక్తి విషయమై ఎక్కువ కొరత ఏర్పడింది.

వర్షాకాలం ఆరంభమై హైడల్ రిజర్వాయర్లలో తిరిగి పూర్తిగా నీరు నిండి, కొత్తగూడెం మొదటి యూనిటు పనిచేయడం ప్రారంభించిన మీదట గడ్డుకాలం తీరుతుంది. విద్యుచ్ఛక్తి వాడకంపై విధించిన నిర్బంధాలు త్వరలోనే తొలగించడం జరుగుతుంది.

గ్రామీణ విద్యుదీకరణ

ప్రణాళికా కేటాయింపుల పరిమితికిలోబడి గ్రామీణ విద్యుదీకరణ కార్యక్రమం పట్లకూడా శ్రద్ధవహించడం జరుగుతున్నది. 31–3–1966 తేదీనాటికి మన రాష్ట్రంలో 5,500 గ్రామాలు మాత్రమే విద్యుదీకరించబడిన సంగతి గౌరవ సభ్యులకు తెలిసినదే. 1966–67 లో మరో 657 గ్రామాలను విద్యుదీకరించడానికి సంకల్పించబడింది. ఈ సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం ప్రయత్నించగలదు.

గ్రామీణ పనుల కార్యక్రమం

గ్రామీణ అంగబలాన్ని వినియోగించుకోవడానికి సంబంధించిన ప్రత్యేకపనుల కార్యక్రమం మనరాష్ట్రంలోని 3 బ్లాకులలో 1960 సంవత్సరాంతంలో ప్రవేశపెట్టబడింది. గ్రామీణ ప్రజలలో ముఖ్యంగా వ్యవసాయం మందకొడిగా సాగే కాలాలలో పనిదొరకనివారికి, చాలినంతపనిదొరకనివారికి గరిష్ఠంగా పనిదొరికే అవకాశాలను కల్పించడం, వ్యవసాయోత్పత్తిని అధికంచేయడమన్నవి ఈ కార్యక్రమంయొక్క ఉద్దేశం. ప్రస్తుతం ఈ కార్యక్రమం 106 బ్లాకుల్లో అమలుపరచబడుతున్నది. గత రెండేళ్లలో ఈ కార్యక్రమం గణనీయమైన ప్రగతిని సాధించింది. దీనికి రూ. 52 లక్షల అడ్హాక్ కేటాయింపు జరుగగా 1965–66 లో పంచాయితీసమితులు రూ. 80 లక్షలు ఖర్చుచేశాయి. ఈ కార్యక్రమం మూలంగా అదనంగా ఏర్పడినమనిషి–పని దినాలు 45 లక్షలు.

పరిశ్రమలు

ఐదవ ఉక్కు–కర్మాగారాన్ని నెలకొల్పడానికి విశాఖపట్నం మిక్కిలి అనుకూలమైన ప్రదేశంగా బ్రిటిష్–అమెరికన్ ఉక్కు–కర్మాగారాల నిపుణుల బృందం సిఫార్సుచేసిందని, ఈ సిఫార్సులను ఆమోదించేవిషయం కొంతకాలంగా కేంద్రప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని గౌరవసభ్యులకు తెలిసినదే. ఎంతమాత్రం జాప్యం చేయకుండ ఉక్కు–కర్మాగారం స్థాపనగురించి కేంద్రప్రభుత్వం నిర్ణయంచేయాలని మనప్రభుత్వం వాంఛిస్తున్నది. నిపుణుల బృందంవారి సిఫార్సులను, మనరాష్ట్రప్రజల మనోభావాలను కేంద్రప్రభుత్వం తగువిధంగా పరిశీలించగలదని, త్వరలోనే అనుకూలమైన నిర్ణయం గైకొనగలదని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను.

వెనుకటి ప్రసంగంలో నేను ప్రస్తావించిన పల్లికురంగంలోని జింక్ స్మెల్టర్ కర్మాగారానికి తోడు రూ. 14 కోట్లు ఖర్చయ్యే

స్టీల్ హెవీ వెసల్స్ పరిశ్రమనుకూడా విశాఖపట్నంలో నెలకొల్ప డానికి ఇటీవల కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. టర్బైన్లు, టర్బోఆల్టర్ నేటర్లు, పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు మున్నగునవి తయారుచేయడంకోసం భారత భారీవిద్యుత్ పరికరాల కర్మాగారం లైసెన్సులు పొందింది. పని చురుకుగాసాగుతున్నది.

సాలీనా 2 లక్షల టన్నుల శక్తిగల సిమెంటు యూనిటును కడపజిల్లా ఎర్రగుంట్లవద్ద నెలకొల్పడానికి భారత సిమెంటు సంస్థ చురుకుగా చర్యలు తీసుకొంటున్నది.

జిర్కోనియం కర్మాగారం, సిరామిక్ ఫ్యూయెల్ ఫ్యాబ్రికేషను కర్మాగారం, యురేనియం ఆక్సైడ్ కర్మాగారం చేరివుండే పరిశ్రమల కూటమిని చర్లపల్లి (మౌలాలి) ప్రాంతంలో నెలకొల్ప డానికికూడా కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. జిర్కోనియం కర్మాగారానికి రూ. 4 కోట్లు, సిరామిక్ ఫ్యూయెల్ ఫ్యాబ్రికేషను కర్మాగారానికి సుమారు రూ. 2.15 కోట్లు, యురేనియం ఆక్సైడ్ కర్మాగారానికి రూ 1.50 కోట్లు ఖర్చు అవుతుందని దాదాపు 3,000 మందికి ఉద్యోగాలు లభించగలవని అంచనా వేయబడింది. ఈ ప్రాజెక్టుకోసం ప్రభుత్వం 1,000 ఎకరాల భూమిని ఉచితంగా ఇవ్వడానికి సమ్మతించింది.

పారిశ్రామికీకరణ రంగంలో పురోగమించడానికి రాష్ట్రం దీక్షతో కృషిచేస్తున్న సంగతి గౌరవ సభ్యులు గుర్తించగలరు.

కాందిశీకుల పునరావాసం

తూర్పు పాకిస్తాన్, తదితర దేశాలనుంచి తరలివచ్చిన 2,000 కాందిశీక కుటుంబాలకు పునరావాసం కల్పించడంకోసం రామగుండంవద్ద పట్టణవాటికను నెలకొల్పడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కాలనీలో నివసించేవారికి ఉద్యోగ వసతి కల్పిస్తుంది. చేనేత, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్ప డానికి సదుపాయాలు కల్పిస్తుంది. పునరావాస పథకం క్రింద రామగుండంవద్ద సహకార నూలుమిల్లును నెలకొల్పే ప్రతిపాదన నుకూడ మన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపింది.

ఉత్తమ వైద్య సదుపాయాలు

హైదరాబాదు, సికింద్రాబాదు జంటనగరాలలోని ఆరు ఆస్పత్రులు, ఔషధాలయాల స్థాయిని పెంచడానికి సంకల్పించ బడింది. ఈ విధంగా చేయడంవల్ల ఉస్మానియా ఆస్పత్రిలోను, గాంధీ ఆస్పత్రిలోను బయటిరోగుల ఒత్తిడిని తగ్గించడానికి వీలు పడుతుంది. ఆ ఆస్పత్రులలోని స్పెషలిస్టులు దీర్ఘరోగుల పట్లను, ప్రమాదస్థితిలోవున్న కేసులపట్లను తగుశ్రద్ధ వహించ డానికికూడ అవకాశముంటుంది. జిల్లా స్థాయిలో జిల్లా కేంద్ర ఆస్పత్రులన్నింటిలోను సివిల్ సర్జను స్పెషలిస్టులను మంజూరు చేయడానికి సంకల్పించబడింది. 1966-67 లో రాష్ట్రంలోని వివిధ బోధనా ఆస్పత్రులలో పడకలు 425 పెంచడానికి, జిల్లా కేంద్ర ఆస్పత్రులలోని పడకలు 420 పెంచడానికి ఉద్దేశించబడింది. తాలుకా కేంద్రాల ఆస్పత్రులలో పడకలు 220 (ఆంధ్ర ప్రాంతంలో 78, తెలంగాణా ప్రాంతంలో 142) పెంచబడతాయి. ఈ ఏడాదిలో 10 తాలూకా ఆస్పత్రులు అభివృద్ధి చేయడానికి చేపట్ట బడతాయి. తాలూకా ఆస్పత్రులలో దంతవైద్య విభాగాలను దశలవారీ కార్యక్రమంగా ప్రారంభించే ప్రతిపాదనలు కూడా పరిశీలనలో ఉన్నాయి. జిల్లా, తాలూకా ఆస్పత్రులలో ఎక్స్‌రే రోగనిదాన సదుపాయాలు సమకూర్చే నిమిత్తం దాదాపు రూ. 10 లక్షల ఖర్చుతో 35 ఎక్స్‌రే ప్లాంటులను కొనడానికి ప్రభుత్వం మంజూరు చేసింది.

కుటుంబ నియంత్రణ కార్యక్రమం

మనదేశంలో అతివేగంగా పెరిగిపోతున్న జన సంఖ్యను తగ్గించడమన్నది మనలను ఎదుర్కొంటున్న బృహత్తర సమస్యలలో ఒకటని గౌరవ సభ్యులకు తెలిసినదే. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మన ప్రభుత్వం సకల చర్యలు తీసుకొంటున్నది. 1966-67 లో ప్రణాళిక బడ్జెటు క్రింద రూ. 1 కోటి కేటాయించబడింది. ఈ ఏడాదికి ప్రణాళికేతర బడ్జెటు క్రింద రూ. 21,79,300 కేటాయించబడినాయి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు అనుబంధంగా అనేక గ్రామీణ కుటుంబ నియంత్రణ క్లినిక్కులు, నగరాలు, పట్టణాలలోని ఆస్పత్రులకు అనుబంధంగా పట్టణ కుటుంబ నియంత్రణ క్లినిక్కులు ప్రారంభించడానికితోడు రాష్ట్రంలో జిల్లాకు ఒకటిచొప్పున అన్ని జిల్లాలకు సంచారశస్త్రచికిత్స యూనిట్లుకూడా మంజూరు చేయబడినాయి. గర్భనిరోధక లూపులనుఅమర్చే కార్యక్రమాన్ని అమలుజరుపడంకోసం ఆస్పత్రులద్వారా తగు సౌకర్యాలుకూడా కలుగజేయబడ్డాయి.

సివిలు సర్జన్ల ప్రైవేటు ప్రాక్టీసుపై నిషేధం

ఉన్నత హోదాలకుచెందిన సివిలు సర్జన్లు ప్రజలకు చేసే వైద్యచికిత్స విస్తృతి అవధిని అభివృద్ధిపరచడానికి చర్యలు రూపొందించే విషయాన్ని ప్రభుత్వం కొంతకాలంగా యోచిస్తూ ఉన్నది. ఈ సమస్యకు సంబంధించిన వివిధఅంశాలను పరిశీలించిన మీదట, వైద్యకళాశాలలకు అనుబంధించి ఉండే వైద్యశాలలలో పనిచేసే సివిలు సర్జన్ల హోదాలోని వైద్యాధికారులను నాన్ క్లినికలు ప్రొఫెసర్లను ప్రాక్టీసుచేయకుండా నిషేధించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. దీనివల్ల వైద్యశాలలోని రోగులకు ఈ వైద్యులు ఇంకా ఉత్తమంగా చికిత్స జరపడానికీ, పూర్తి కాలం వారిపట్ల శ్రద్ధచూపించడానికి వీలుంటుంది. ప్రైవేటు ప్రాక్టీసు పోయినందువల్ల వచ్చే నష్టాన్ని భర్తీ చేయడానికిగాను ప్రాక్టీసు మానినందుకు భత్యంగా వారిజీతంలో 50 శాతం ఇవ్వడానికి నిర్ణయం గైకొనబడింది. అయితే ఆ మొత్తం నెలకు రూ. 500ల గరిష్ఠ పరిమితికి లోబడివుంటుంది.

విద్య

1966-67 లో గుంటూరుజిల్లా మాచెర్లలోను, పశ్చిమ గోదావరిజిల్లా తాడేపల్లిగూడెంలోను, కడపజిల్లా ప్రొద్దుటూరులోను, కర్నూలుజిల్లాలో బహుశా మార్కాపురంలోను, మహిళలకోసం

గుంటూరుజిల్లా చీరాలలోను ప్రభుత్వ ఆర్ట్సు-సైన్సు కళాశాలలను క్రొత్తగా ప్రారంభించడానికి ప్రభుత్వం ఉద్దేశిస్తూ ఉన్నది. కృష్ణా జిల్లా మచిలీపట్టణంలోను, తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం లోను, నిజమాబాద్ జిల్లా ఆర్మూరులోను ఆర్ట్సు-సైన్సుకళాశాలల అవసరం ఉండడంవల్లను వాటి ప్రారంభకులు నిధులు, తదితర సౌకర్యాలు సమకూర్చడానికి మొదటిసంవత్సరం ప్రభుత్వ గ్రాంటులేకుండా కళాశాలలను నడపడానికి సిద్ధంగా ఉండడంవల్లను 1966-67 లో ఆయా ప్రాంతాలలో ఎయిడెడ్ కళాశాలలను ప్రారంభించడానికి ప్రైవేటు సంస్థలకు అనుమతినిచ్చే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహాన్నిచ్చే ఉద్దేశంతో ఎస్ ఎస్ ఎల్. సి; హెచ్. ఎస్. సి./హైయ్యరు సెకండరీ, బహూళార్థ సాధక పరీక్షలలో అత్యధికంగా మార్కులు వచ్చే విద్యార్థులకు—

రూ. 100, రూ. 150, లు ప్రత్యేక విద్యార్థివేతనాలు ఇవ్వడానికి పథకం ఒకటి ఏర్పాటు చేయబడింది.

అదేవిధంగా. ఒకే పరీక్షలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కాగల విద్యార్థులను తయారుచేసేవిషయంలో పాఠశాలలమధ్య పోటీదృక్పథాన్ని పెంపొందించే ఉద్దేశంతో రూ. 1.76 లక్షల వ్యయంతో భవనాలు, పరికరాల నిమిత్తంగ్రాంట్లు ఇచ్చే పథకం ఒకటి అమలుపరచబడింది,

అధికార భాష

మన రాష్ట్రంలో అధికార కార్యకలాపాలన్నీ సాధ్యమైనంత త్వరలో తెలుగులోనే జరపాలని ప్రజలు, గౌరవసభ్యులు ప్రభుత్వం చిరకాలంగా వాంఛిస్తున్నారు. దీనిని నెరవేర్చేటందుకు 1966, ఆంధ్రప్రదేశ్ అధికారభాషా చట్టాన్ని ఇటీవల ఆమోదించడం ఒక ముఖ్యమైన చర్య. తెలుగుకు తోడుగా, ప్రకటన ద్వారా నిర్దేశింపబడే అధికార కార్యాలకు, గడువువరకు రాష్ట్రంలోని కొన్నిప్రాంతాల్లో ఉర్దూను ఏదైనా యితరభాష, లేక భాషలను వాడడానికి ప్రత్యేక నిబంధన చేయబడింది. సాధ్యమైనంత త్వరలో చట్టపు నిబంధనలను అమలుపరచడానికి అవసరమగు చర్యలు తీసుకొనబడుతున్నాయి.

రూపాయి విలువ తగ్గింపు

ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన మన రూపాయి మారకపు విలువ తగ్గింపు అనేది దేశ ఆర్థిక స్థితిని పటిష్ఠం చేయడానికి, యితర దేశాలకు మనంచేసే ఎగుమతులకు ఇతర దేశాలలో మనం చేసేకొనుగోళ్లు లేదా ఋణాలకు మధ్య ఉండే వ్యత్యాసం మూలంగా ఏర్పడిన సమస్యలను అధిగమించడానికి ఉద్దేశించబడింది. రూపాయి విలువ తగ్గింపు మూలంగా నష్టపడగల పరిశ్రమలకు, సాధారణ వినియోగదారలకు భారత ప్రభుత్వం అనేక సదుపాయాలను ప్రకటించింది. అత్యవసరమైన ముడి పదార్థాలు విడిభాగాలు, వాడకపు సరకుల కొరతవల్ల ఏర్పడే క్లిష్టపరిస్థితిని తట్టుకోడానికి కూడా కేంద్రం అవసరమైన చర్యలు తీసుకొంటున్నది. కాగా దిగుమతులపై ఆధారపడివుండే పరిశ్రమల అవసరాలు చాలావరకు తీర్చబడతాయని ఆశింప బడుతున్నది. అందువల్ల పరిశ్రమలయూనిట్లు తమ పూర్తి ఉత్పాదక శక్తిమేరకు పనిచేయడానికి ఎగుమతులకు మాత్రమేకాకుండా ఇప్పుడు తక్కువగా సరఫరా అవుతున్న రసాయినిక ఎరువులు, క్రిమిసంహారక మందులువంటి అత్యవసర సరకులకు స్థానికంగా వుండే గిరాకీ తీర్చగలిగేటట్టుగా అధికంగా ఉత్పత్తి చేయడానికి వీలు కలుగుతుంది. దేశమంతటా భారీయెత్తున డిపార్టుమెంటల్ స్టోర్లు, వాడకందార్ల స్టోర్లు నెలకొల్పడం గురించి కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నది. వారిసహాయంతో మన ప్రభుత్వం సబబైన ధరలకు అవసర వస్తువులు సరఫరా జరిగేటట్లు చూడటానికి తగిన అన్ని చర్యలు తీసుకొంటుంది.

పొదుపు చర్యలు

ప్రభుత్వ ఆదాయ మార్గాల పరిస్థితి క్లిష్టంగా వుండడం దృష్ట్యాను, రక్షణ, ఆహారోత్పత్తి తదితర ముఖ్య కార్యక్రమాల పై ఖర్చుపెరుగుతూ వుండడంవల్ల కట్టుదిట్టంగా పొదుపరితనం పాటించడం అవసరం కావడంవల్లను సిబ్బందిపైన కంటింజన్సీల పైన జరిగే ప్రభుత్వ వ్యయంలో కట్టుదిట్టమైన పొదుపరితనం పాటించవలసిందిగా ప్రభుత్వశాఖలన్నిటికీ ఆదేశాలివ్వడం జరిగింది. ఇంతవరకూ తీసుకొన్న వివిధ చర్యలమూలంగా 1.14 కోట్ల రూపాయలు పొదుపు చేయగలిగామని గౌరవసభ్యులకు తెలియ జేయడానికి నేనెంతో సంతోషిస్తున్నాను.

ముగింపు

నేడు మీ మధ్యకు వచ్చి. మీ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించినందుకు నేను చాల సంతోషిస్తున్నాను. శాసన పరిషత్తు సభ్యులు కొందరు త్వరలోనే పదవీవిరమణ చేయబోతున్నారు. పరిషత్తుకార్యకలాపాలు నిర్వహించడంలో వారు దయతో చూపిన సహకార సద్భావాలకు వారికి ధన్యవాదాలర్పిస్తున్నాను.

మీకు శుభం కలగాలనీ ఈ సమావేశం ప్రయోజనకరంగాను, జయప్రదంగాను జరగాలనీ ఆకాంక్షిస్తూ నా ప్రసంగాన్ని ముగించడానికి ముందు మీకు మరో విషయాన్ని వివరించదలచాను. ఈనాడు మన దేశం క్లిష్టమైన కాలాన్ని దాటుతూవుంది. ముఖ్యంగా అనావృష్టి, అగ్ని ప్రమాదాలవంటి విపత్కర పరిస్థితులదృష్ట్యా రాష్ట్ర సౌభాగ్యంకోసం మనం దీక్షతో గట్టికృషి జరపడానికి సన్నద్ధులం కావాలి. మీ అందరి సహకారంతో రాష్ట్రం అన్ని కష్టాలను అధిగమించి లక్ష్యాన్ని సాధించ గలదని నా ప్రగాఢ విశ్వాసం.

జై హింద్ :

ఆంధ్రప్రదేశ్ లో ప్రధాని పర్యటన దృశ్యాలు

(జూన్ 23 నుంచి 25 వరకు)

విమానాశ్రయం వద్ద స్వాగతం







ప్రధానికి స్వాగతం చెప్పుతున్న గవర్నరు, ముఖ్యమంత్రి, మేయరు



బేగంపేట విమానాశ్రయంవద్ద ప్రధానితో పాత్రికేయులు






హైదరాబాదు పౌరులు దారిపొడుగునా నిలుచుని ప్రధానికి స్వాగతమిస్తున్నదృశ్యం


కమలానెహ్రూ పాలిటెక్నిక్‌వద్ద ప్రధాని



మీటనొక్కి, పాలిటెక్నిక్ భవనానికి ప్రారంభోత్సవం జరుపుతున్న ప్రధాని




కమలానెహ్రూపాలిటెక్నిక్ భవన దృశ్యం



పాలిటెక్నిక్ భవనానికి లాంఛనంగా ప్రారంభోత్సవం జరిపిన అనంతరం ప్రసంగిస్తున్న ప్రధాని
"ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి"




సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి "యావద్భారత దేశంలోనే యిది మహిళల తొలిపాలిటెక్నిక్ కళాశాల"




హోంశాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ ఛైర్మన్ అయిన శ్రీ మీర్ అహమద్‌అలీఖాన్ ప్రధానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం



పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణ సంఘం అధ్యక్షుడు శ్రీ ఎల్. ఎన్. గుప్త కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం



''పిల్లలు భావిభారత పౌరులుగా రూపొంది దేశానికి సేవచేయాలి''



బాలభవన్ వద్ద సరస్సులో పడవలో విహరిస్తున్న ప్రధాని




జవహర్ బాలభవన్‌ను సందర్శిస్తున్న ప్రధాని

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో—



త్వరలో నిర్మించనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ భవనాల నమూనాను ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు శ్రీ ఒ. పుల్లారెడ్డి ప్రధానికి చూపిస్తున్న దృశ్యం




రాజేంద్ర నగర్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయ భవనాలకు ప్రధాని ప్రారంభోత్సవం జరిపిన సందర్భంలో ప్రసంగిస్తున్న ముఖ్య మంత్రి. ''దేశం మూలమూలల్లోనూ పరిశోధన, విస్తరణ కార్యక్రమాలను అమలు జరుపడానికి యితోధికంగా పట్టభద్రులు అవసరం''




శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానం అవసరాన్నిగూర్చి నొక్కి వక్కాణిస్తున్న ప్రధాని.

"వ్యవసాయాన్ని, పరిశ్రమలను సమానంగా నడిపించాలి. పొలంలో రైతు, కర్మాగారంలో కార్మికుడూ — యీ యిరువురూ దేశ ఆర్థిక వ్యవస్థకు పటిష్ఠమైన స్తంభాలు"




నెహ్రూ జూలాజికల్ పార్కులో ప్రధాని చెట్టునాటుతున్న సందర్భంలో మ్యునిసిపల్ నిర్వహణ, అటవీశాఖా మంత్రి శ్రీ యన్. చెంచురామానాయుడు, తదితర అటవీశాఖ అధికారులను ప్రధానికి పరిచయం చేస్తున్నప్పటి దృశ్యం

శాసన సభ్యులతో ప్రధాని



విధానసభ స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డి, శాసనమండలి అధ్యక్షుడు శ్రీ జి. బ్రహ్మయ్య జూబ్లీహాలులో ప్రధానికి స్వాగతం పలుకుతున్నప్పటి దృశ్యం




ప్రధానికి స్వాగతం చెప్పుతున్న స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డి


"స్వదేశంలోను, విదేశాలలోను మన విధానాలకు ప్రధాని ఒక కొత్త స్వరూపాన్ని, అవగాహనను కలిగించారు"



ఇందిరా సేవాసదనంలో జ్యోతిని వెలిగిస్తున్న ప్రధాని



ఇందిరా సేవాసదనంలో ప్రధాని ప్రసంగిస్తున్న దృశ్యం




వజీర్ సుల్తాన్ టుబాకో కంపెనీ కార్మికుల సంఘం ప్రారంభించిన లాల్‌బహదూర్ శాస్త్రి సాంకేతిక పాఠశాలకూ, అక్కడి కార్మికుల చిన్న మొత్తాల పొదుపు ఉద్యమానికీ ప్రధాని ప్రారంభోత్సవం జరిపారు. ఆసందర్భంలో నెహ్రూస్మారక నిధి నిమిత్తం, జాతీయ రక్షణ నిధి నిమిత్తం విరాళాన్ని ప్రధాని అందుకున్నప్పటి దృశ్యం.




రాజ్‌భవన్‌లో ప్రధానికి స్వాగతం పలుకుతున్న గవర్నరు దంపతులు


జవహర్ బాలభవన్ ప్రారంభోత్సవం




పాఠశాల విద్యార్థినులు ప్రధానికి "గార్డ్ఆఫ్ ఆనర్'' ఇస్తున్న దృశ్యం




జంటనగరాల బాలబాలికలు ప్రధానికి స్వాగతం చెప్పుతున్న దృశ్యం







జవహర్ బాలభవన్‌కు ప్రారంభోత్సవం చేస్తున్న శ్రీమతి ఇందిరా గాంధి




రాష్ట్ర జవహర్ బాలభవన్ కమిటీ అధ్యక్షుడూ, ఆర్థికమంత్రి అయిన డా॥ ఎం. చెన్నారెడ్డి ప్రధానికి స్వాగతం చెప్పుతున్న దృశ్యం



జవహర్ బాలభవన్ ప్రారంభోత్సవానికి హాజరైన పిల్లలు




శాసన సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని




క్లిష్టసమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనడంలో ప్రదర్శించి చూపిస్తున్న ధైర్యానికి ముఖ్యమంత్రి గారిని అభినందిస్తున్న దృశ్యం



జూబ్లీహాలులో శాసన సభ్యులలో కొందరు




మరికొందరు శాసన సభ్యులు




చివరలో కృతజ్ఞతలు తెలుపుతున్న శాసనమండలి అధ్యక్షుడు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య


హైదరాబాదు బహిరంగ సభలో ప్రధాని




లాల్‌బహదూర్ స్టేడియంకు వస్తున్న ప్రధాని




లాల్‌బహదూర్ స్టేడియంలో జూన్ 23న ప్రధానికి పౌరసన్మానం
జరిపిన సందర్భంలో సన్మానపత్రం చదువుతున్న
నగర మేయరు శ్రీమతి సరోజినీదేవి పుల్లారెడ్డి




లాల్‌బహదూర్ స్టేడియంలో లక్షకు పైగా ప్రజలుగల సభలో
ఉపన్యసిస్తున్న ప్రధాని
"శ్రీ బ్రహ్మానందరెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో
ఆంధ్రప్రదేశ్ ఎంతగానో అభివృద్ధి చెందింది"




దేశంలో పారిశ్రామికీకరణ విషయంలోగల అసమానతలను
తొలగించవలసిన అవసరాన్నిగూర్చి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి



నెహ్రూ స్మారకనిధికి ప్రజల విరాళంగా 7 లక్షల రూపాయల
చెక్కును ప్రధానికి అందజేస్తున్న ముఖ్యమంత్రి




జూన్ 24న హైదరాబాదులోని పరిపాలనా సిబ్బంది కళాశాల
సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని.
"సరైన ఉద్యోగంలో సరైన వ్యక్తివుండడం అవసరం"




బహిరంగ సభకు విచ్చేసిన అసంఖ్యాక ప్రజానీకం


వరంగల్లులో ప్రధాని




జూన్ 24న ఆహారశాఖామంత్రి శ్రీ యన్. రామచంద్రారెడ్డి వరంగల్లులో ప్రధానికి స్వాగతం చెప్పుతున్న దృశ్యం



వరంగల్లులో ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, డా. బి. గోపాలరెడ్డి, శ్రీ టి. హయగ్రీవాచారి, తదితరులతో సంభాషిస్తున్న ప్రధాని



దారిపొడవునా ప్రధానికి స్వాగతం పలుకుతున్న ప్రజలు




కాకతీయ వైద్య కళాశాల భవనానికి ప్రధాని ప్రారంభోత్సవం జరిపిన తర్వాత తీసిన చిత్రం.


"గ్రామసీమల్లోకీ, కొండ ప్రాంతాల్లోకీ డాక్టర్లు వెళ్ళడానికి ప్రయత్నించాలి"




కాకతీయ వైద్య కళాశాల భవన ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి




ప్రధానమంత్రి, కాకతీయ వైద్యకళాశాల క్రొత్త భవనాలకు ప్రారంభోత్సవం జరిపి తిరిగివస్తున్న దృశ్యం




కాకతీయ కళాశాల అధ్యాపకులు, కమిటీ సభ్యులతో ప్రధాన మంత్రి



వరంగల్లులో జరిగిన బహిరంగ సభ దృశ్యం




న్యాయశాఖా మాత్యులు
శ్రీ పి. వి. నరసింహారావు, ప్రధానమంత్రి ఉపన్యాసాన్ని
తెలుగులో చెప్పుతున్న దృశ్యం




ముఖ్యమంత్రి, బహిరంగసభలో ప్రసంగిస్తున్న దృశ్యం.
" ఆంధ్రప్రదేశ్‌లో 8 వైద్య కళాశాలలు ఉన్నాయి "


కడపలో




కడపకు ఆగమనం




శ్రీమతి ఇందిరాగాంధీ, రాయలసీమజిల్లాల కలెక్టర్లతో...







జనసందోహం అధికసంఖ్యలో ప్రధానికి స్వాగతం చెప్పారు. స్వాతంత్ర్యం తర్వాత శ్రీమతి ఇందిరాగాంధీ కడపకు రావడం ఇది మూడవసారి




ప్రధానమంత్రి, కడపలోని పాత్రికేయులతో




శ్రీ పి. తిమ్మారెడ్డి, కడపలో జిల్లా పరిషత్తు అధ్యక్షులు, కలెక్టర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం రాయలసీమలో కరువు పరిస్థితులు నివారణ చర్యలను గూర్చి చర్చించడానికి జూన్ 21న యీ సమావేశం జరిగింది




ప్రధానమంత్రి కడపజిల్లాపరిషత్తు సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న దృశ్యం




కర్నూలు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు
శ్రీ కె. విజయ భాస్కరరెడ్డి సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం



'' కడప జిల్లాకు గండికోట చాలా అవసరం '' అన్నారు ముఖ్య మంత్రి



కేంద్ర మంత్రి డాక్టర్ కె. ఎల్. రావు ప్రసంగిస్తున్న దృశ్యం.
'' నాలుగవ ప్రణాళికలో భాగంగా సోమశిల ప్రాజెక్టు మంజూరు కావచ్చు



4 దక్షిణాదిరాష్ట్రాలలో ఉంటున్న రకోట్ల ప్రజలను బాధింపజేస్తూ దాదాపు లక్ష చదరపు మైళ్ల ప్రాంతంలో తాండవిస్తున్న క్షామాన్ని నివారింపజేయడానికి వీలుగా జాతీయ ప్రణాళికలో భాగంగా ప్రాంతీయ పథకాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి తమ స్వాగతోపన్యాసంలో అభ్యర్థించారు




కడపలో జిల్లా పరిషత్తు అధ్యక్షులు, కలెక్టర్ల సమావేశంలో ప్రసంగించిన తర్వాత తిరిగి వెళ్తున్న ప్రధాన మంత్రి




ప్రధాన మంత్రి కడపలో బహిరంగ సభలో ప్రసంగించారు. క్షామ పీడిత ప్రాంతాలలో నివారణ చర్యలకు నిర్దేశించిన జాతీయ ప్రణాళికలో రాయలసీమకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబడుతుంది


విజయవాడలో




జూన్ 24న విజయవాడ గన్నవరం విమానాశ్రయానికి ఆగమనం




విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో ముఖ్యమంత్రి పురప్రముఖులను ప్రధానమంత్రికి పరిచయం చేస్తున్న దృశ్యం




జనసమూహం ప్రధానికి స్వాగతం చెప్పుతున్న దృశ్యం



ప్రధానమంత్రి జవహర్ ఆటోనగర్‌కు పునాదిరాయి వేశారు



ప్రధానమంత్రి విజయవాడలో బహిరంగసభలో ప్రసంగిస్తున్న దృశ్యం




బహిరంగసభలో ప్రేక్షకులు


విశాఖ పట్టణంలో




విశాఖపట్నం విచ్చేసిన ప్రధానమంత్రికి పూలమాలవేస్తున్న దృశ్యం




జూన్ 25న ప్రధానమంత్రికి ప్రజలు స్వాగతం చెప్పుతున్న దృశ్యం



జూన్ 25న విమానాశ్రయంలో



విశాఖపట్నం ప్రజలు ప్రధానమంత్రికి ఘనంగా స్వాగతం చెప్పారు



శ్రీమతి ఇందిరాగాంధీ బాలల పార్కుకు ప్రారంభోత్సవం చేశారు.



శ్రీమతి ఇందిరాగాంధీతో శ్రీ వి. వి. జి. రాజు దంపతులు




శ్రీ పి. వి. నరసింహారావుతో . .




ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పి. తిమ్మారెడ్డితో




ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ ఎన్. లక్ష్మణదాసుతో



ప్రధానమంత్రితో కేంద్రమంత్రి డాక్టర్ కె.ఎల్. రావు. శ్రీ పి. తిమ్మారెడ్డి, ముఖ్యమంత్రి, డా॥ బి. గోపాలరెడ్డి, శ్రీ పి. వి. నరసింహారావు. విశాఖపట్నంలో తీసిన చిత్రం.




బహిరంగసభలో ప్రధానికి అధికారులను పరిచయం చేశారు




ప్రధానమంత్రికి స్వాగతం చెప్పుతూ ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రరంగంలో ఎక్కువ పరిశ్రమల్ని నెలకొల్పాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు




విశాఖపట్నం బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తున్న దృశ్యం



జూన్ 4న మద్రాసునుంచి ఢిల్లీవెళ్తూ బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీకి ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ పట్టంథాను ఎ. పిళ్ళై స్వాగతం ఇస్తున్న దృశ్యం




ప్రధానమంత్రి. ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంలో తీసిన ఫోటోగ్రాపు అల్బమ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం




పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు శ్రీ మొరార్జీదేశాయ్ జూన్ 10న రాజధానికి విచ్చేసిన సందర్భంలో బేగంపేట విమానాశ్రయంవద్ద వారికి స్వాగతం చెప్పుతున్న ముఖ్యమంత్రి




సచివాలయంలోని కమిటీ హాలులో పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు, సభ్యులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి, తదితర మంత్రులు



జూన్ 11న రవీంద్ర భారతిలో ప్రదర్శించిన "దేశంకోసం" నాటకం నటీ నటులతో కార్మిక రవాణాశాఖామంత్రి శ్రీ బి.వి. గురుమూర్తి




చిన్నతరహా, మధ్యతరహా పత్రికల సంపాదకుల స్థాయీసంఘ సమావేశానికి జూన్ 28న హైదరాబాదులో ప్రారంభోత్సవం జరుపుతున్న కార్మిక, రవాణా, సమాచార శాఖామంత్రి శ్రీ బి.వి. గురుమూర్తి




పశ్చిమగోదావరి జిల్లాలోని కైకలూరులో జూన్ 8న సహకార మార్కెటింగ్ సంఘం బియ్యపు మిల్లుకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం జరిపారు. సహకార శాఖామంత్రి, శ్రీ తోట రామస్వామి ఆనాటి సభకు అధ్యక్షత వహించారు


తిరుపతిలో ముఖ్యమంత్రులు



ఆహార రాష్ట్రాలలోని పరిస్థితులను చర్చించడానికై తిరుపతిలో జూన్ 19, 20వ తేదీలలో సమావేశమైన మైసూరు, మహారాష్ట్ర, మద్రాసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి.




మైసూరు ముఖ్యమంత్రి శ్రీ ఎస్. నిజలింగప్ప ప్రసంగిస్తున్న దృశ్యం




మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ ఎం. భక్తవత్సలం ప్రసంగిస్తున్న దృశ్యం



మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్ ప్రసంగిస్తున్న దృశ్యం



తిరుపతి సమావేశంలో కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యంతో మైసూరు, మహారాష్ట్ర, మద్రాసు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు



పశ్చిమ గోదావరిలోని సిద్ధాంతం వద్ద వశిష్ఠ నదిపై నిర్మించబడుచున్న రోడ్డు వంతెనను జూన్ 6న పరిశీలిస్తున్న పబ్లిక్ వర్క్సు శాఖ మంత్రి శ్రీ ఎ.సి. రాఘవులు

ఆంధ్రప్రదేశ్‌లో సహకార సంఘాలు

భారతదేశంలో మొట్టమొదటి సారిగా సహకారోద్యమానికి స్వాగతం పలికిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు లోని సహకారభూమి తనఖా బ్యాంకును ఆంధ్రప్రదేశ్‌లో–బహుశా భారతదేశంలోనే–మొట్టమొదటి భూమి తనఖా బ్యాంకుగా చెప్పవచ్చు. **1925** లో యిది స్థాపించ బడింది. **1933** లో విశాఖపట్టణం జిల్లా ఏటికొప్పాకలో ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీ నెలకొల్ప బడింది. ఇది దేశంలో సహకార పద్ధతిన నెలకొల్పబడిన తొలి చక్కెర ఫ్యాక్టరీ. అయిదేళ్ళ అనంతరం తూర్పు గోదావరిజిల్లా అలమూరులో మొట్టమొదటి గ్రామీణ బ్యాంకు ప్రారంభించబడింది. పెద్దఎత్తున వ్యవసాయ ఋణాలను మంజూరుచేసే తొలి సహకార సంఘంగా దీనిని పేర్కొన వచ్చు.

దేశంలో ప్రణాళికలు అమలుపరుచబడుతున్న తర్వాత సహకారోద్యమం కొత్తబలాన్ని పుంజుకుంది. **1951** లో అనంతపురం జిల్లా గుంతకల్లులో 'ది ఆంధ్ర కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్' నెలకొల్పబడింది. భారతదేశంలో మొట్టమొదటి సహకార నూలు మిల్లు యిదే. గిరిజనుల అభ్యున్నతికై **1956** లో విశాఖపట్టణంలో 'ది ఆంధ్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్' స్థాపించబడింది. ఆనకట్ట ప్రాంతములలో పూర్తి ఆర్థిక సౌకర్యాన్ని కలిగించే పథకాన్ని దానిని తెలంగాణాలోని మూసి ఆనకట్ట ప్రాంతంలో అమలుపరిచే నిమిత్తం **1961**లో చేపట్టడం జరిగింది. ఇదొక కొత్త పథకం. దీనికిదే సాటి. ఇంతే కాదు ఆహార ధాన్యాల ఉత్పత్తి రంగంలో కూడ సహకారోద్యమం విస్తరించి కొత్త చివుళ్లు తొడిగింది. **1962** లో వరంగల్ జిల్లాలో 'ది తెలంగాణా కోఆపరేటివ్ హైబ్రిడ్ సొసైటి' అనే సంఘము ఒకటి మొట్టమొదటిసారిగా హైబ్రిడ్ విత్తనాల అభివృద్ధి నిమిత్తం ఏర్పడింది.

ప్రణాళికలు–సహకార సంఘాలు

గత కొన్నేళ్ళుగా సహకార విధానంలో ప్రవేశించిన కొత్త ధోరణులను దృష్టిలో వుంచుకొని, ప్రణాళికల్లో సహకార సంఘాలకు అప్పగించిన ప్రత్యేక బాధ్యతలను దృష్టిలో వుంచుకొని ఉత్పత్తి, మార్కెటింగ్, ప్రోసెసింగ్ తదితర రంగాలలో అభివృద్ధి పథకాలను అమలు పరిచే విషయంలో సహకార విధానానికి పంచవర్ష ప్రణాళికలు అత్యధిక ప్రాధాన్యతను యిచ్చాయి. తొలి పంచవర్ష ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకించి ఒక పథకం అంటూ చేపట్టబడలేదు. తొలిపంచవర్ష ప్రణాళికలోని పథకాలన్నీ చాలవరకు ఆయాశాఖలకు సంబంధించిన కార్యకలాపాలకు పరిమితమైన మామూలు పథకాలే. తొలి పంచవర్ష ప్రణాళికలో సహకార రంగం క్రింద రూ **25.75** లక్షలు కేటాయించబడగా రూ. **23.20** లక్షలు వెచ్చించ బడ్డాయి. ప్రయివేటు, పబ్లిక్ రంగాలతో పాటు సహకార రంగాన్ని కూడ సమానంగా నడిపించాలన్నది మన జాతీయ విధానం. ఈ విధానానికి ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో శ్రీకారం చుట్టడం జరిగింది. ద్వితీయ ప్రణాళికలో రాష్ట్రంలో సహకార రంగానికి కేటాయించ బడిన మొత్తం రూ **291.71** లక్షలు. రెండోసారి సవరించి, ప్రకటించిన కేటాయింపు యిది. దీనిలో రూ **285.88** లక్షలు వెచ్చించడం జరిగింది. కేటాయింపుకు, వ్యయానికి మధ్య గల తేడ గ్రామీణ సహకార సంఘాలకు సబ్సిడీలను పంపిణీ చేయడంలోని కొన్ని యిబ్బందుల వల్ల ఏర్పడింది. తృతీయ ప్రణాళికలో యీ రంగం క్రింద చేసిన సవరించబడిన కేటాయింపు రూ **450** లక్షలు.

1966–67 సంవత్సరానికి రాష్ట్ర వార్షిక ప్రణాళిక కేటాయింపు రూ 88 లక్షలు. చక్కెర ఫ్యాక్టరీలకు, మార్కెటింగ్ సంఘాలకు, ప్రోసెసింగ్ కార్యకలాపాలకు వాటాధనాన్ని అందజేయడానికి వీలుగా యీ మొత్తంలోంచి కొంత కేటాయించడం జరిగింది. మార్కెటింగ్ సంఘాలు (గ్రామీణ గిడ్డంగిలతోసహా) గిడ్డంగులను నిర్మించేందుకు కూడా యీ మొత్తంనుంచి కొంత సొమ్మును కేటాయించారు. 1966–67 లో అదనంగా 115 బియ్యపు మిల్లుల్ని నెల కొల్పేందుకుగాను రూ 253 లక్షలు జాతీయ సహకార అభివృద్ధి సంస్థనుండి ఆర్థిక సహాయంలభించవచ్చు.

వ్యవసాయ ఋణాలు

ఈ రంగంలో మనం సాధించిన అభివృద్ధి ప్రత్యేకించి చెప్పుకోదగ్గది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికాంతానికి మన రాష్ట్రంలోని 84 శాతం గ్రామాలను ఆవరిస్తూ 15.89 లక్షల సభ్యులతో 14,000 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు వుండేవి. 25 శాతంవరకు గ్రామీణ జనాభాను యివి ఆవరించేవి. వ్యవసాయదారులకు ఆయాసీజన్లకు సంబధించిన వ్యవసాయ కార్యకలాపాల నిమిత్తం 1955–56లో సుమారు రూ 5 కోట్లు పంపిణీచేయగా 1960–61లో యీ మొత్తాన్ని రూ 16.50 కోట్లకూ, 1963–64లో రూ 22 కోట్లకు పెంచడం జరిగింది. ద్వితీయ పంచవర్ష ప్రణాళి

కాంతానికి 14,000 ప్రాథమిక సంఘాలన్నిటిలో మొత్తంవున్న వాటాపెట్టుబడి, డిపాజిట్లు వరుసగా రూ. 408 లక్షలు, రూ. 87 లక్షలు.

పంచవర్ష ప్రణాళికల క్రింద వ్యవసాయ కార్యక్రమాలను శీఘ్రతరం చెయ్యాలనేది మన ఉద్దేశం. తదనుగుణంగా వ్యవసాయ దారులకు కావలసిన ఋణాలలో కనీసం 50 శాతంమేరకైనా చతుర్థ ప్రణాళికాంతం నాటికి వారికి అందజేయాలని సహకార సంఘాలు లక్షించాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సభ్యత్వపు సంఖ్య ద్వితీయ పంచవర్ష ప్రణాళికాంతంనాటికి 15.89 లక్షలువుండగా దానిని తృతీయ ప్రణాళికాంతానికి 20 లక్షలకు పెంచాలనన్నీ; సహకారసంఘాలు స్వల్పకాలిక, మధ్యకాలిక ఋణాలక్రింద పంపిణీచేసే మొత్తం, 1960-61 లో రూ. 16.50 కోట్లుకాగా దానిని తృతీయ ప్రణాళిక చివరి సంవత్సరం నాటికి రూ. 30 కోట్లకు హెచ్చించాలనన్నీ తృతీయ ప్రణాళికలో ఉద్దేశించబడింది. నిజానికి స్వల్పకాలిక, మధ్యకాలిక ఋణాల క్రింద మనకు కావలసిన వ్యావసాయక ఋణం సుమారు రూ. 200 కోట్ల వరకువుంటుందని అంచనా.

తృతీయ ప్రణాళిక ఆఖరుకు మొత్తం 24,375 గ్రామాలకు వ్యవసాయ పరపతి సౌకర్యంలభిస్తుందని అంచనా. అంచే సుమారు 150 లక్షల గ్రామీణులకు యిది అవర్తిస్తుందన్న మాట. తృతీయ ప్రణాళికలో స్వల్పకాలిక, మధ్య కాలిక ఋణాల పంపిణీ విషయంలో మన లక్ష్యం రూ. 30 కోట్లుకాగా 1964-65 సంవత్సరాంతానికి రూ. 18.67 కోట్లు పంపిణీచేయడం జరిగింది.

దీర్ఘ కాలిక ఋణాలు

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ముగిసేనాటికి ఆంధ్రప్రదేశ్‌లో 104 ప్రాథమిక భూమితనఖా బ్యాంకులు వున్నాయి. 1966 ఫిబ్రవరి మాసాంతానికి మరొక 70 బ్యాంకులు అదనంగా నెలకొల్పబడ్డాయి. భూమి తనఖా బ్యాంకులు యిచ్చే సాధారణ ఋణాలను యిటీవలి కాలంలో బాగా పెంచడం జరిగింది. 1965 అక్టోబరు 31 నాటికి యీ బ్యాంకులు రూ. 193.46 లక్షల ఋణాలను పంపిణీ చేశాయి. ఇంకా చాలా ఋణాల్ని మంజూరు చెయాల్సి వుంది. 1965 జూన్ 30 నాటికి ఆవిధంగా యింకా మంజూరు కావల్సిన ఋణాలు రూ. 1767.55 లక్షల వరకు వున్నాయి. చిక్కుల్తో కూడిన తక్కావీ ఋణాలు, ప్రత్యేక

పనులకు ఋణాలు మినహా అన్ని దీర్ఘకాలిక తక్కావీ ఋణాలనూ భూమి తనఖా బ్యాంకుల ద్వారా మంజూరుచేసి పంపిణీ చేయాలని ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. తదనుగుణంగా 1966 జనవరి 31 నాటికి రూ. 46.34 లక్షల మేరకు ఋణాలకు సంబంధించిన దరఖాస్తులను అంగీకరించి రూ. 26 లక్షల వరకు పంపిణీ చేశారు. మిగిలిన దరఖాస్తులు యింకా పరిశీలించ బడుతున్నాయి.

ఆనకట్టల క్రింద భూమి అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్ర భూమి తనఖా బ్యాంకు సాధారణ ఋణాలను మంజూరు చేయడమేగాక ఆనకట్ట ప్రాంతాలలో ఆయకట్టుల అభివృద్ధికికూడా కొన్ని ప్రత్యేక పథకాలను చేపట్టింది. మూసి, నాగార్జునసాగర్, కర్నూలు-కడప కాలువ, కడెం మొదలైన ఆనకట్టల ప్రాంతాలలోని ఆయకట్టుల అభివృద్ధికి ప్రాథమిక భూమి తనఖా బ్యాంకులద్వారా, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఋణసౌకర్యాలను కల్పించే కొన్ని ప్రత్యేక పథకాలను రూపొందించింది. తెలంగాణాలోని మూసి ఆనకట్ట ప్రాంతంలోని వ్యవసాయదారులకు అవసరమయ్యే స్వల్పకాలిక, మధ్య కాలిక, దీర్ఘ కాలిక ఋణాలను గ్రామీణ సహకార సంఘాలద్వారా, ప్రాథమిక భూమి తనఖా సహకార సంఘాలద్వారా అందజేసే సమగ్ర ఆర్థిక పథకం ఒకటి పూర్తయ్యింది. 30,000 ఎకరాలను సాగుక్రిందకు తేవడానికి దీర్ఘ కాలిక ఋణాల క్రింద రూ. 75 లక్షలు యీ పథకంలో కేటాయించబడ్డాయి. 1964లో . యీ పథకం విజయవంతంగా అమలుపరచ బడింది.

ఈ దిగువ పథకాలు కూడా చాలా విజయవంతంగా అమలు పరచ బడుతూ వున్నాయి. నాగార్జునసాగర్ పథకం రూ. 2.90 లక్షల ఎకరాల అభివృద్ధికి ఉద్దేశించ బడింది. దీని క్రింద అయ్యే ఖర్చు రూ. 831 లక్షలు. ఈ పథకంక్రింద యింత వరకు రూ. 180.67 లక్షలు పంపిణీ చేయడం జరిగింది. కర్నూలు-కడప కాలువ పథకంక్రింద రూ. 165 లక్షల ఖర్చుతో 0.50 లక్షల ఎకరాల్ని అభివృద్ధి పరచాలని ఉద్దేశించ బడింది. ఈ పథకం క్రింద యిప్పటివరకు రూ. 59.63 లక్షలు పంపిణీ చేయడం జరిగింది. కడెం ఆనకట్ట పథకం క్రింద రూ. 7.5 లక్షల ఖర్చుతో 0.25 లక్షల ఎకరాల్ని అభివృద్ధి చేయాలని ఉద్దేశించ బడింది. దీనిక్రింద యింతవరకు రూ. 37.5 లక్షలు పంపిణీ అయ్యాయి. మధ్య పెన్నారు పథకం రూ. 80 లక్షల ఖర్చుతో 0.21 లక్షల ఎకరాల అభివృద్ధికి సంబంధించినది. దీనిక్రింద యింతవరకు 12.94 లక్షల రూపాయల్ని పంపిణీ చేయడం జరిగింది. రామడుగు, జుర్రేరు, రామభద్రునిపల్లి, తోటవారి పాలెం, ఎమ్మిలేరు పథకాలక్రింద రూ. 32.26 లక్షల వ్యయంతో 8,393 ఎకరాలను అభివృద్ధి పరచడం జరుగుతుంది. ఇంతవరకు యీపథకాలక్రింద రూ. 3.59 లక్షలు పంపిణీ జరిగాయి. వీనికి కావలసిన నిధులను ఆంధ్రప్రదేశ్ సహకార

కేంద్ర భూమి తనఖా బ్యాంకు ప్రత్యేకమైన అభివృద్ధి డిబెంచర్ల జారీచేసి తద్వారా సమకూరుస్తుంది. బొంబాయిలోని అగ్రికల్చరల్ రి ఫైనాన్స్ కార్పొరేషను, రాష్ట్ర ప్రభుత్వమూ యీ డిబెంచర్లకు డబ్బుసర్దుబాటు చేస్తాయి.

పేకేజి కార్యక్రమాలు

తీవ్రతర వ్యవసాయ కార్యక్రమాలు అమలు పరచబడుతున్న పశ్చిమ గోదావరి జిల్లాలో సహకార సంఘాలు అత్యంత ప్రధానమైన పాత్ర వహిస్తున్నాయి. ఎరువులు, మేలుజాతి విత్తనాలు, క్రిమి సంహారక ఔషధాలు మొదలైన వ్యవసాయావసరాలను సభ్యులకు తగుసమయంలో లభించడానికి వీలుగా తగు మొత్తాలలో ఋణాలను యీ సహకార సంఘాలు అందించి తోడ్పడుతున్నాయి. తీవ్రతర వ్యవసాయజిల్లా కార్యక్రమాలకు 1965_66లో ఆర్థిక సౌకర్యాన్ని కలిగించడానికి వీలుగా ఏలూరు, మచిలీపట్టణం, రాజమండ్రిలలోని సెంట్రల్ బ్యాంకులకు ప్రభుత్వపు పూచీకత్తుమీద రిజర్వుబ్యాంకు రూ. 216.50 లక్షలవరకు స్వల్పకాలిక ఋణాలను మంజూరు చేసింది. సవరించబడిన పేకేజి పథకానికి సహకార సంఘాలుఉత్పత్తికి ఉద్దేశించిన ఋణాలను అందజేస్తాయి. పంటపై ఋణాలిచ్చే విధానాన్ని అమలు పరుస్తాయి. 1966_67 ఖరీఫ్ పంటకాలంనుంచి వీటిని చేపట్టడం జరుగుతుంది.

సహకార సేద్యం

రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధాన్ని సాధించడానికి సంయుక్తంగాగానీ, కొన్నికొన్ని ఒక్కటిగా చేర్చిగాని సంఘాలను ఏర్పాటుచేసి నిర్వహించడమే సహకార సేద్య పథకం ఉద్దేశం. 1966 జనవరి 1 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 153 సహకార సేద్య సంఘాలు ఉన్నాయి. వీటిలో 73 సంఘాలు పైలట్ ప్రాజెక్టు ప్రాంతంలోనివి. మిగిలిన 80 సంఘాలలో పైలట్ ప్రాజెక్టుకు చెందని ప్రాంతంలోనివి. 1966 ఆర్థిక సంవత్సరాంతానికి అదనంగా 47 సంఘాలు ఏర్పాటవుతాయని అంచనా. తృతీయ ప్రణాళికాంతానికి యిలాంటి సంఘాలు మన రాష్ట్రంలో 200 పనిచేస్తూండాలనేది మన లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంతవరకు 80 సంఘాలు వ్యవసాయ కార్యకలాపాల్ని ప్రారంభించాయి. 1966_67లో 20 సహకార సేద్య సంఘాలకు పైలట్ ప్రాంతంలో నిర్వహించాలనన్నీ, మరో 20 సంఘాలను పైలట్ ప్రాంతాలు కానిచోట్ల నిర్వహించాలనన్నీ ఉద్దేశించడం జరిగింది. సహకార సేద్య సంఘాలకు 1964_65లో కల్పించిన ఆర్థిక సహాయం రు. 2. 70 లక్షలవరకు వుంది. 1965_66 కాలంలో రు. 7. 94 లక్షలవరకు ఆర్థిక సహాయాన్ని కల్పించాలని ఉద్దేశించబడింది.

ప్రభుత్వ బంజర్లను అభివృద్ధిపరచే విషయంలో యింతవరకు 14 సహకార జాయింట్ సేద్య సంఘాలు పనిచేస్తున్నాయి. మరింతగా సంఘాలను ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. అమలాపురం ప్రాంతంలో 135 సహకార ఉమ్మడి వ్యవసాయ సంఘాల్ని అక్కడగల 210 క్షేత్ర కార్మిక సహకార సంఘాలస్థానే 1965_66లో ఏర్పాటుచేయడానికి ఒక పథకం రూపొందించబడినది. ఇంతవరకు 100 సంఘాలు నమోదయినవి.

సహకార మార్కెటింగ్

సహకార రంగంక్రింద పరపతి సౌకర్యాన్ని బాగా విస్తృతపరచడం దృష్ట్యా సహకార మార్కెటింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత వచ్చింది. అందువల్ల ఈ సహకార మార్కెటింగును అభివృద్ధి పరచడానికి తీవ్రమైన కృషి జరుగుతున్నది. ఆంధ్ర ప్రదేశ్‌లో వివిధ రకాలకు చెందిన 235 ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘాలువున్నాయి. వీటి సభ్యత్వం మొత్తం 2.62 లక్షలు, వీటి పెట్టుబడి వాటాధనం రూ. 136.61 లక్షలు. దీనిలో రూ. 61 లక్షల్ని సహకార మార్కెటింగును అభివృద్ధిపరచే ఉద్దేశంతో ప్రభుత్వం అందజేసింది. ఈ మార్కెటింగ్ సంఘాలు యించుమించు రాష్ట్రంలోని అన్ని మండీలనూ ఆవర్తిస్తున్నాయి. జిల్లాకి ఒకటిచొప్పున మొత్తం 20 జిల్లా సహకారమార్కెటింగ్ సంఘాలు వున్నాయి. జిల్లాల్లోని ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘాలకు ఒక సమాఖ్యగా యివి పనిచేస్తాయి. అదే విధంగా రాష్ట్రస్థాయిని ఒక ఎపెక్స్ సహకార మార్కెటింగ్ సంఘం పనిచేస్తున్నది. ఇదే హైదరాబాదులోని "దిఆంధ్రా కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్". ఒక విషయం ఇక్కడ చెప్పడం అవసరం. ఇంతవరకూ యీ మార్కెటింగ్ సంఘాలు నిజంగా అవి చేయాల్సిన మార్కెటింగ్ పనిని చేయడంలేదు. సహకార విధానంలో ఆహారధాన్యాల మార్కెటింగ్ పనులను యీ సహకార మార్కెటింగ్ సంఘాలు చేపట్టడానికి వీలుగా మార్కెటింగ్‌తో ఋణాన్ని ముడివేసే పద్ధతి ఒకటి రూపొందించబడింది. దీనిని అమలులో పెట్టాలంటే అన్ని ప్రాంతాలను ఆవర్తిస్తూ సహకార రంగం క్రింద ప్రోసెసింగ్ యూనిట్లు చాలా వరకు నెలకొల్పబడడం అవసరం. అందువల్ల పరపతి సంఘాలన్నిటినీ సహకార మార్కెటింగ్‌తో జతపరచి ప్రోసెసింగ్ యూనిట్ల అభివృద్ధివైపు వీటికృషిని మళ్ళించడానికి కృషిచేయడం జరిగింది. సహకార సంఘాలు 1965_66 లో మార్కెటింగ్ కార్యకలాపాల్ని చేపట్టాయి. 'ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'కు సబ్ ఏజంట్లుగా ధాన్యం, బియ్యం సేకరణ కార్యక్రమాలను యీ సహకార సంఘాలు ప్రారంభించాయి. 1965_66 లో యీ సంఘాలు రూ. 2 కోట్ల విలువగలధాన్యం, రూ. 50 లక్షల విలువగల మొక్కజొన్న, రూ. 20 లక్షల విలువచేసే కాయధాన్యాలను సేకరించాయి.

ఒంగోలు తాలూకాలోని పుగాకు ఉత్పత్తి దారులకు లాభసాటిగా వుండడానికిగాను ఒంగోలులోని పుగాకు సహకార ప్రోసెసింగ్, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్‌చేత ఆచరణకుతెచ్చే పైలట్ పథకాన్నొకదానిని రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీని ప్రకారం పరపతి సంఘాలద్వారా ఎకరాకు రూ. 250 చొప్పున

ఋణాలను పుగాకు ఉత్పత్తిదార్లకు అందజేయడం జరుగుతుంది. వారు ఉత్పత్తిచేసిన పుగాకు శుద్ధిచేసి గ్రేడింగ్‌చేసిన తర్వాత ఒంగోలులోని పుగాకు సహకార ప్రోసెసింగ్, మార్కెటింగ్ సంఘం మార్కెటిచేస్తుంది.

బలహీన వర్గాలవారు—సహకార సంఘాలు

బలహీన వర్గాలవారి సాంఘిక, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడం సంక్షేమ రాజ్యంయొక్క ప్రథమ కర్తవ్యం. అందువల్ల యీలక్ష్యాన్ని సాధించడానికిగాను సహకార రంగంద్వారా కృషి చేయడానికి ప్రభుత్వం తగుచర్యలు తీసుకుంటున్నది. తదనుగుణంగా బెస్తలను, రిక్షా డ్రైవర్లను, చాకళ్ళను, టాక్సీడ్రైవర్లు తదితరులను సహకార పరిధిలోకి తీసుకు రావడం జరిగింది. బెస్తల సహకార సంఘాలకు తృతీయ ప్రణాళికలో రూ. 5.77 లక్షలు మంజూరు చేయబడ్డాయి. ఈ సంఘాలకు సహాయపడే నిమిత్తం చతుర్థ ప్రణాళికలో రూ. 1.20 లక్షల్ని కేటాయించాలని ఉద్దేశించ బడింది. 1962-63లో రిక్షాడ్రైవర్ల సహకార సంఘాలు ఏర్పాటు చేయబడ్డాయి.

1962—63లో, 1965—66లో మొత్తం వీటికి రూ. 8.42 లక్షలు మంజూరు చేయడం జరిగింది. 21 సంఘాలు నమోదయ్యాయి. బెస్తల సహకార సంఘాల్ని ఏర్పాటుచేసే పథకం 1964—65లో మొదటి సారిగా ప్రారంభించబడింది. 1964—65లో, 1965-1966 లో వీటికి రూ. 0.91 లక్షలు మంజూరు చేయబడ్డాయి. నాలుగు బెస్తల సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. అదేవిధంగా టాక్సీ డ్రైవర్ల సహకార సంఘాలు 1964-65లో ఏర్పాటయ్యాయి. ఇలాంటి రెండు పనిచేస్తున్నాయి యిప్పుడు. వీటికి రూ. 3.16 లక్షల వరకు ఆర్థిక సౌకర్యం కల్పించబడింది.

పనిచేసే కార్మికుల నిమిత్తం కార్మిక సహకార సంఘాలు రూపొందించబడ్డాయి. ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో 27,198 మంది సభ్యులతో 315 ప్రాథమిక లేబర్ కాంట్రాక్టు సంఘాలు పనిచేస్తున్నాయి. వీటికి రూ. 3.56 లక్షల పెట్టుబడి వాటాధనంవుంది. హైదరాబాదులోను, గుంటూరు జిల్లా మాచెర్లలోను కార్మిక సహకార సంఘాలకు సంబంధించిన రెండు ఫెడరేషన్లుకూడా పనిచేస్తున్నాయి. తెలంగాణా ప్రాంతంలోని గీత పనివారలకు సహాయపడే నిమిత్తం గీతపని వారల సహకార సంఘాలకుకూడా ప్రభుత్వం ఆర్థిక సౌకర్యాన్ని విస్తరింప జేసింది.

గ్రామదాన, భూదాన సంఘాలు

గ్రామదాన, భూదాన ప్రాంతాలలోని సహకార సంఘాలకు ఆప్రాంతాలలో వ్యవసాయోత్పత్తిని అభివృద్ధి పరచడానికి ఆర్థిక సహాయం కల్పించే పథకాన్నొకదానిని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇది యిప్పుడు రాష్ట్రంలో అమలుపరచ బడుతున్నది. ఈ పథకాన్ని అమలు పరచడానికి అవసరమయ్యే నిధులను భారత ప్రభుత్వమే అందజేస్తుంది. 1966 జనవరి నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 97 గ్రామదాన, భూదాన సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. వీటిలో 28 సంఘాలకు 1964—65లో రూ. 3,36,000 వరకు ఆర్థిక సహాయం కల్పించబడింది. ఈ పథకానికి భారత ప్రభుత్వం నిధులను కేటాయిస్తే మిగిలిన సంఘాలకుకూడా 1965-66లో రూ. 9.96 లక్షలవరకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుంది. 1966—67లో పది సంఘాలకు ఆర్థిక సహాయాన్ని కల్పించాలని ఉద్దేశించ బడింది. ఇందుకుగాను 1966-67 వార్షిక ప్రణాళికలో లక్ష రూపాయలు కేటాయించబడ్డాయి.



ఈ ఉత్తరం మీ నాన్నగారికియ్యి. నువ్వు క్షవరం చేయించుకోకుండా ఇలా తాటి,టెంకపీచులా జుట్టుపెట్టుకుని వస్తే నిన్ను బళ్లోకి రానివ్వనని వ్రాసేను. !!!

బతికిన కాలేజి

పాలగుమ్మి పద్మరాజు

16

కల్యాణి, రాధా రెండో పక్కకి పరుగెత్తారు. వారికి అడ్డంగా పట్టూ మిస్టర్ చింతా ఎదురొచ్చారు.

పాట నడుస్తోంది, అలవాటు కొద్దీ అడుగులు పడుతున్నాయి కల్యాణికీ రాధకీ. ఇద్దరూ కుతకుత ఉడికిపోతున్నారు. అసలు పెళ్ళికొడుకు పారిపోవడంతో తెరపడి మళ్ళీ లేవాలి. కాని తెరపడిన తరువాత ఇంక తిరిగి లేవదని మిస్టర్ చింతాకి తెలుసు. ఈ ప్రదర్శనం తమర్ని మోసగించడానికి ఏర్పాటుచెయ్యబడిందని అర్థమయాక సోదరీమణులింక అందులో పాల్గొంటారా? అందుకే తెరదింపకుండా నాటకం ఆఖరువరకు ఆడెయ్యాలనీ అందరినీ హెచ్చరించాడు మిస్టర్ చింతా ఒక్క సోదరీమణులను తప్ప. రాధ గొంతుతగ్గించి.

"తెర దింపిస్తారా లేదా?" అంది.

"రాధా?" అన్నాడు పట్టూ.

"మిస్ రాణీ! మనం ప్రేక్షకులముందున్నాం. ప్రదర్శనం అయాక తక్కిన విషయాలు చర్చిద్దాం." అన్నాడు మిస్టర్ చింతా.

అయితే ఈనోరు మెదిలింపులన్నీ నాటకంలో భాగమే ననుకున్నారు ప్రేక్షకులు. వాళ్ళకి వినిపించింది, సంపత్‌జీ బృందగానం ఒకటే. కల్యాణీ, రాధా కోపం తట్టుకోలేకుండా ఉన్నారు.

చటుక్కుని గోలగా ఉన్న సంగీతం ఆగిపోయింది. సంపత్‌జీ రాగవరసలో 'హృదయకుసుమాలు' లోని వచనం చదవడం మొదలు పెట్టాడు. పట్టూ మోకరించి చేతులు ముందుకుచాచాడు.

"రాణీ," అని వణికింది సంపత్‌జీ గొంతు. పట్టూ శరీరం "రాధా!" అంటూ వణికింది. ఆ దృశ్యం చూడలేక ముఖం తిప్పుకుంది రాధా. ప్రేక్షకులకు వినిపిస్తున్నది సంపత్ గొంతు. "రాణీ నాజీవన మధువనీ! అనంత వసంతయామినీ! అనురాగ రసధునీ! ఈ పేద భిక్షువు నీప్రేమామృతం కోసం తన హృదయ పాత్రికచేతబుచ్చుకుని యాచిస్తున్నాడు. ఈభక్తుడు తన హృదయ కుసుమాలతో నిన్నారాధింపవచ్చినాడు. తన కవోష్ణ రక్త ధారలతో ఈకుసుమాలకు అరుణరాగము కూర్చినాడు'—కాని

జరిగిన కథ

రాధ, కల్యాణి, అక్కచెల్లెళ్లు. కల్యాణి పెళ్ళి పీటలపై తప్పిపోతుంది. శర్మగారి వద్ద నాట్య శిక్షణ పొందిన రాధా, కళ్యాణి రామలింగయ్య సహాయంతో నాటక ప్రదర్శన ఇవ్వగా, పట్టూ, చింతా చూస్తారు. పట్టూ రాధను కలుసుకొనుటకు గ్రీన్‌రూంకెళ్ళి కామన్న చేత దెబ్బలుతిని, చివరకు కామన్నను ఓడించి ఇంటికి వస్తాడు. చింతా కోరికపై నాటకములో వేషము వేయుటకు రాధా, కళ్యాణి ఒప్పుకొని, రామలింగయ్యకొక పాత్ర ఇస్తారు. నాటకంలో అభిప్రాయ భేదము వచ్చి మధ్యలో తెరపడుతుంది.

రాధకు మాత్రం పట్టూగొంతు ఒక్కటే గుండె చీలుస్తూ వినబడుతోంది. ప్రేక్షకులకు వినపడకుండా అంటున్నాడతడు.

"రాధా! నా కళ్లల్లోకి ఒక్కసారిచూడు రాధా! అందులో ఎక్కడైనా కల్మషంగాని, నీచత్వంగాని ఉందేమోచూడు. నాకింకేమీ అక్కర్లేదు. నేను చేసినవన్నీ నీ మీది ప్రేమకొద్దీ చేశాను తప్ప, మరో దురుద్దేశంతో చెయ్యలేదని నువ్వు గ్రహిస్తే చాలు. ఆ తరువాత నిశ్చింతగా చచ్చిపోతాను. నేను దుర్మార్గుణ్ణనీ రాక్షసుణ్ణనీ నువ్వనుకుంటున్నంత కాలం నేను ఆత్మహత్య కూడా హాయిగా చేసుకోలేను. నన్నర్థం చేసుకున్నట్టు ఒక మాటద్వారా,ఒక చూపుద్వారా నాకుచెప్పు. చాలు. నా జన్మ ధన్యమైనట్టే. అంతే నేనుకోరేది. రాధా! రాధా!"

రాధ దుఃఖం ఆగక తల తిప్పేసుకుంది. ఆమె కన్నీరు చూసి ప్రేక్షకులు వెర్రెక్కిపోయి చప్పట్లు కొట్టారు. ఆమె మళ్లీ నిజ పరిస్థితి తెలుసుకుంది. కోపంగా పట్టూ వంక చూసింది. అంత అకస్మాత్తుగా ముఖభావం మార్చగలిగినందుకు ప్రేక్షకులు మరింత వెర్రెక్కిపోయారు.

ఇంతలో రామలింగయ్యగారు కృష్ణ భగవానుడి రూపంలో ప్రత్యక్షమై, యువతీ యువకులకు హితబోధ చేశారు.

తెర పడిపోగానే వేషాలన్నా తియ్యకుండా కల్యాణీ, రాధా లాడ్జికి వెళ్లిపోయారు.

ప్రేక్షకులంతా తిరిగి తెర తెరచుకొంటుందనీ నటీనటుల పరిచయం జరుగుతుందనీ చప్పట్లు కొడుతూనే ఉన్నారు. తెర వెనక జరుగుతున్న నాటకం విషమఘట్టంలో పడిందని వాళ్ళ కేమి తెలుసు?

"ఏమిట్రా అబ్బాయి, కథ ఇలా అడ్డం తిరిగింది? అన్నాడు రామలింగయ్య. తనుకూడ ఈ కుట్రలో పాల్గొన్నాడని తెలిశాక కల్యాణీ రాధా ఒక్కనాటికి క్షమించరు. పట్టూ నీరసపడి ఒక మూల చతికిల పడ్డాడు. ప్రేక్షకులు చప్పట్లుతో బాటు ఈలలు ప్రారంభం చేశారు.

"లీ విట్ టు మిస్టర్ చింతా," అన్నాడు మిస్టర్ చింతా "పట్టూ" ఏంటల్లా షేక్స్పియర్ లాగ మొహంతేలేశావు? దిస్ ఈజ్ టైమ్ ఫర్ యాక్షన్ లే లాడ్జికి వెళ్ళు. మిస్ రాధని గది లోనించి వెడల నివ్వకు. ఆమె బయటికి పోడానికి ప్రయత్నిస్తే తలుపు మూసేసి అడ్డుగా నిలబడు నిన్ను తొలగించి తలుపు తీసుకుపోడానికి తగినంత బలం ఆమెకు లేదు. తక్కిన విషయాలు, లీవిట్ మిస్టర్. చింతా. బాబాయి. మీరు నా కారులో మాఇంటికి వెళ్ళి పొండి.

"అదికాదురా..."

"లీవిట్ టు, మిస్టర్ చింతా." మిస్టర్ చింతా ఆయన్ని బలవంతంగా పక్క సందులోకి తోసేసి, తెరముందుకొచ్చాడు.

"లేడీస్ అండ్ జెంటిల్‌మన్! సోదర సోదరీ మణులారా! అకస్మాత్తుగా వచ్చిన అనారోగ్యం కారణంగా, మిస్ వాణీ, మిస్ రాణీ ఇంటికి వెళ్లిపోయారు. వారిద్దరూ మీ అందరి పరిచయం చేసుకోవాలని ఎంత తహ తహ లాడినా, నేనే వసే మిరా అన్నాను. ఈ లాంఛనాలకంటె వారి ఆరోగ్యం ముఖ్యం మీకూ నాకుకూడా, ఒక శుభవార్త. నాటకం అంతం కాకుండానే ప్రేక్షక మహాశయుల వద్దనుంచి ఎన్నో చీట్లొచ్చాయి, ఈ నృత్య నాటకం మళ్లీ త్వరలో వేయించాలని కోరుతూ, (జేబులోంచి ఒక కాగితాల బొత్తి తీశాడతను.) మీ కోరికమీద మరొక వారం రోజుల్లో "హృదయ కుసుమాలు," తిరిగి ప్రదర్శించబడుతుంది. (చప్పట్లు.) అప్పుడు మాత్రం ప్రదర్శనానంతరం, మిస్ వాణీ, మిస్ రాణీ, మిస్టర్ రామలింగయ్య తప్పకుండా మీ దర్శనం చేసుకుంటారు."

అవతల కారులో ఎక్కి కూచున్న రామలింగయ్య లౌడ్ స్పీకర్ ద్వారా ఇది విన్నాడు. కోపంగా ఆశ్చర్యంగా కారు దిగబోయాడు. కాని డ్రైవర్ చక్రుని కారు ముందుకి లాగించడంతో ఆయన, వెనకసీటుకి అంటుకుపోయాడు. తీసిన తలుపు కారు వేగానికి టప్పుని మూసుకుపోయింది.

"వీడి కేమన్నా మతిపోయిందా," అనుకున్నాడు పైకే.

కల్యాణి క్షణంలో పెట్టి సర్దేసుకుంది. రాధకూడా సర్దడానికి మొదలెట్టింది గాని, తలగడ కిందున్న "హృదయ కుసుమాలు," కంట బడ్డంతోటే, ఇక సర్దలేక కిటికీ పక్కని చతికిలబడింది,

"తొందరగా కానియ్యి లే రాధా!" అంది కల్యాణి.

"ఎంత సేపు? టాక్సీ తెమ్మను," అంది రాధ, తన కన్నీళ్లు గొంతుకను పూడ్చెయ్యకుండా తంటాలు పడుతూ, "అన్నయ్యా! వాడా గదిలో ఉన్నాడు. రాధ బైటికి రాకుండా తలుపు వేసేశాడు" అంది కల్యాణి ఆత్రంగా.

"ఓహో!" అని తనకేం సంబంధం లేనట్టు తన గదిలోకి వెళ్లిపోయాడు కామన్న. అంటూ అవతలికి వెళ్లింది. అప్పుడు లోపల ప్రవేశించాడు పట్టూ, కల్యాణి చూడకుండా. అంతవరకూ అవకాశంకోసం అవతల కాచుకుని ఉన్నాడు.

"రాధా!" అన్నాడు,

"ఆఁ! నువ్వా!!" అంది రాధ.

"మనం ఎప్పుడు కలుసుకున్నా సంభాషణ ఇంతకు మించి సాగడంలేదు." అన్నాడు తెగించి పట్టూ,

"అక్కయ్యా! అంటూ అవతలికి వెళ్లబోయింది రాధ,

"నేను చెప్పేదంతా వింటేగాని నిన్నవతలికి వెళ్లనివ్వను," అన్నాడు తలుపుమూస్తూ పట్టూ. కంగారుగా వచ్చిన కల్యాణి ఆమాటలు వింది, తలుపు మూయ్యడం చూసింది,

"తియ్యి, తలుపు తియ్యి, చీ దుర్మార్గుడా! తియ్యి, రాధా." అంటూ తలుపుమీద దబదబ బాదింది.

"అక్కయ్యా! పోలీసుల్ని పిలు." అని అరిచింది రాధ.

"పిలిస్తే పిలవండి. కాని మీ చెల్లెలి వంటిమీద చెయ్యి వెయ్యనని హామీ ఇస్తున్నాను. తరవాత మీ ఇష్టం," అన్నాడు పట్టూ. మూసిన తలుపులోపలినించి.

"అన్నయ్యా" అంటూ కామన్నగదిలోకివెళ్ళింది కల్యాణి.

కామన్న టాక్సీకోసం వెళ్ళాడన్న సంగతి అప్పుడు గుర్తొచ్చింది ఆమెకి. మళ్ళీ హాల్లోకొచ్చింది వీధిలోపడి కేకలేసి పదిమందినీ లేపుదామనుకుంది. కాని తమ మర్యాదకే భంగమని మానేసింది. గదిలోంచి పట్టూ మాటలు వినబడుతున్నాయి.

"నేను చేసినఘోరానికి ప్రాయశ్చిత్తంగా నన్నేం చెయ్యమంటే అది చేస్తాను. చెప్పు నిప్పులోదూకమంటే దూకుతాను. విషం తాగమంటేతాగుతాను."

"ఏం చేసినా మా అక్కయ్య బ్రతుకంతేగా?" అంది రాధ ఏడుస్తూ.

కామన్న "టాక్సీ వొచ్చింది," అని చెప్పేసి తనగదిలోకి వెళ్ళిపోయాడు. కల్యాణి వీధిలోకి పరిగెత్తింది.

''డ్రైవర్! ఒక్కమాటిలా రా లోపలికి. మా చెల్లెల్ని ఎవలో రౌడీ వెధవొచ్చి.... తలుపు బద్దలుకొట్టాలి. కాస్తరా...''

''పోలీసోళ్ళని పిలిస్తే మంచిదమ్మా — పెద్దోళ్ళ మద్దె బక్కోళ్లుబడితే — మా లాంటోళ్లు — నలిగిపోతారు.'' అన్నాడు సీటులోంచి దిక్కుండా, ముఖమైనా చూపించకుండా. ఆమె తలుపు తెరిచి కార్లోఎక్కి కోపంగా తలుపుమూసింది.

''పోలీస్‌స్టేషన్‌కి పోనియ్యి.'' అంది ధాటీగా. కారు కదిలింది. పావుగంటైంది, అరగంటైంది, పోలీస్‌స్టేషన్ జాడ కనబడ్డంలేదు. అదీగాక కారుపోతున్న రోడ్డుకి రెండు పక్కలా చెట్లెక్కువగా ఉన్నాయి.

''డ్రైవర్,'' అంది కల్యాణి, ''ఎక్కడికి? ఆపుకారు.''

కారు రెండు పెద్దతలుపుల మధ్యనించి ఒక మంచి పూల తోటలోకి మళ్ళింది. ఎదురుగా చక్కని బంగళాఒకటి ఉంది.

''పోలీసుస్టేషనా? అంది కల్యాణి కాదని తెలిసే.

డ్రైవర్‌దిగి మర్యాదగా తలుపు తెరిచాడు.

''దయచెయ్యండి,'' అన్నాడు టోపీతీస్తూ.

''ఆ!! నువ్వా!!'' అంది కల్యాణి.

''మిస్టర్ చింతా, ఇది మా కుటీరం. మీ రాకవల్ల మా ఇల్లు......''

''దుర్మార్గుడా!''అంటూ గేటువేపు వెళ్ళబోయింది కల్యాణి.

''లాడ్జికి మీకు దారితెలీడం కష్టం. తెలిసినవాళ్ళకే గంట పడుతుంది నడవడానికి, చాలాదూరం.''

కల్యాణి ఆగింది.

''పట్టూ మీ చెల్లెలిమీద ఏదన్నా అత్యాచారం చెయ్యదలుచుకుంటే ఈపాటికే చేసేసిఉంటాడు ... అటువంటిదేమీ చెయ్యడని నేను హామీ ఇస్తున్నాను.''

''హామీట, సిగ్గులేకపోతేసరి.''

''లోపలికి దయచేస్తారా?''

''గదిలోపెట్టి నన్నుకూడా...''అని ఆగిపోయింది కల్యాణి.

''అటువంటి అనుమానఉంటే, ఈ తిన్నెమీదకూచోండి.''

మిస్టర్ చింతా పూసిన మల్లెపొద దగ్గరకువెళ్ళి గుండెల నిండా పీలుస్తూ.

''ఆహా! మల్లెలాంటి పువ్వేలేదండి. ఏమంటారు?'' అన్నాడు. కల్యాణి సమాధానం చెప్పలేదు.

''మిస్ కల్యాణీ! మీరొకటి గ్రహించారో లేదో. మీ సమస్యేగనుక లేకపోతే మిస్ రాధ పట్టూని ఈపాటికి సంతోషంగా పెళ్ళాడేసేది.''

''వొట్టిది. ఆ చవటని ఒక్కనాటికీ చేసుకోదు మారాధ.''



''పట్టూ చవటకాదనీ, దుర్మార్గుడుకాదని, రాధకీతెలుసు, మీకూతెలుసు. ఒకపెద్ద పొరబాటుచేశాడు, అది దిద్దుకోడం ఎల్లాగో వాడికి తెలీలేదు. అక్కణ్ణించి వాడు వేసినవన్నీ తప్పటడుగులే. ఏదిచేసినా విషమించింది పోనీ మీరు చెప్పండి, అతన్నేం చెయ్యమంటారు?''

"అన్యాయంగా నా గొంతుకొయ్యలే. ఇంకేం చెయ్యాలి?"

"మిస్ కల్యాణీ! ఆనాడు పెళ్లిపీటలమీద మర్యాదకోసం వాడు మీ మెడలోతాళిగడితే ఏమయ్యేది! వాడి మనస్సంతా మీ చెల్లెలిమీదుండేది. మీరొక గుదిబండలా కనిపించేవారు వాడికి. మీ చెల్లెలిమూలంగా మీ జీవితం నాశనమైందని మీరు ఆమెనుద్వేషించేవారు. మీ ముగ్గురి జీవితాలూ నరకప్రాయమై పోయేవి.

'మొదట్లో ఏ పొరబాటు చేసినా, ఈ దారుణానికి మాత్రం వాడు ఒడి గట్టలేదు· అందుకు మీరు సంతోషించాలి నిజంగా."

కల్యాణి ఇంక నిలబడలేకపోయింది. తిన్నెమీద చతికిల బడి ఏడవడం మొదలుపెట్టింది.

"గుడ్! ఏడిస్తే కొంత బరువు తగ్గుతుంది. మిస్ కల్యాణీ! మీరు మాత్రం మీ స్వార్థంకోసం మీ చెల్లెలి జీవితాన్ని నాశనం చెయ్యదలచుకున్నారు"

"నేనా." అంది కల్యాణి ఆశ్చర్యంగా.

"మీరు మీ అంతరాత్మని నిలబెట్టి అడగండి, పట్టూ రాధని ప్రేమిస్తున్నాడు. రాధకూడా పట్టూని ప్రేమిస్తోంది."

"లేదు, వొట్టిది, అబద్ధం."

"అది నిజమని మీకూతెలుసు. 'హృదయ కుసుమాలు' నవల చదివి ఆమె అనుక్షణం కంటతడెందుకు పెట్టేది? కావాలనే అందులోని కొన్ని ఘట్టాలు నేను నాటకంలో చూపించాను. ఆ ఘట్టాల్లో రాధ చేసింది నటననుకుంటున్నారా? ఆమె కళ్లలోంచి కారినవి ఉత్తి కన్నీళ్లనుకుంటున్నారా?"

"అదే నిజమైతే నాతోచెప్పి తీరుతుంది. మా ఇద్దరి మధ్యా దాపరికాలు లేవు." అంది కల్యాణి దుఃఖం ఆపుకుంటూ.

"కొన్ని విషయాలు ఆమె చచ్చినా మీకుచెప్పదు. మీరూ ఆమెకు చెప్పరు. పట్టూని మీరు మనసారా ప్రేమిస్తున్నారను కోండి."

"అసంభవం."

"ఒకవేళ ప్రేమిస్తే మీ చెల్లెలికి చెపుతారా? చెప్పరు. అతనిమూలంగా మీ బతుకు వీధినిపడింది. అటువంటప్పుడు అతని మీద ఎంత ప్రేమున్నా మీదగ్గరకొచ్చి 'అక్కయ్యా! నేనతన్ని ప్రేమిస్తున్నాను అతన్ని పెళ్లాడాలనుంది. నువ్వేమనుకోకేం!' అని ఎల్లాచెపుతుంది?"

కల్యాణి లేచి నిలబడింది.

"అదే నిజమైతే వాళ్ళ పెళ్లికి నేను హృదయపూర్వకంగా అనుమతిస్తున్నాను" అంది,

"మీరు అనుమతించినంత మాత్రాన్న లాభంలేదు, పట్టూ వల్ల మీకు జరిగిన అన్యాయానికి పరిష్కారం జరిగితే తప్ప, రాధ పట్టూని ప్రేమిస్తున్నట్టు కూడా ఒప్పుకోదు."

"అదెల్లా జరుగుతుంది?"

"మీపెళ్లి స్థిరపడితే తప్ప రాధ పెళ్లి జరగదు."

"నాపెళ్లా!!" కల్యాణి మళ్లీ తిన్నెమీద చతికిలబడిపో యింది. "పీటలమీద పెళ్లి చెడిపోయిన పిల్లని...నన్నెవరు పెళ్లాడతారు?"

"అంటే మీ కభ్యంతరం లేకపోతే." అన్నాడు మిస్టర్ చింతా.

"నన్నిలా వేళాకోళం చెయ్యడం న్యాయంకాదు." అంది కల్యాణి చూపులు కిందికిదింపుతూ.

"ఏ మానవుడన్నా తన ఆరాధ్యదేవతని వేళాకోళం చెయ్య గలడా? అంతేకాదు. మిమ్మల్ని ఎవరన్నా వేళాకోళం చెయ్యడానికి సాహసిస్తే, వాడి పీకనొట్టి చేతులతో నులిపి పారేస్తాడీదాసుడు."

కల్యాణి బొమ్మలు ముడివేసి అతనివంక చూసింది.

"ఏం? బొత్తిగా నాటకం డైలాగ్ లాగుందా. పోనీండి. మామూలు మాటల్లో చెపుతాను. ముందసలు ఈ అభాజకుడి కున్న అర్హతలేమిటని అడగరేం. దానికి సమాధానం నిర్మొగమా టంగా చెపుతున్నాడు. వీడికి ఏఅర్హతలూలేవు. తల్లిదండ్రు లిచ్చిన డబ్బూ, ఆస్తీ, తద్వారా సంక్రమించిన చదువూ తీసి పారేస్తే వీడొట్టిపురుగు."

కల్యాణి చెక్కిళ్ళెర్రబడ్డాయి.ఆమెమళ్లీ చూపులు దించేసుకుంది.

"ఇంకమీరేం చెప్పక్కర్లేదు. అర్థమైపోయింది. బాబాయి, రామలింగయ్య బాబాయి!" అని గట్టిగాపిలిచాడు మిస్టర్ చింతా.

తలుపుతెరుచుకుంది. పోర్టికోలో లైటువెలిగింది. రామలిం గయ్య బద్ధకంగా ఇవతలకి వచ్చాడు.

"ఏమిటీ అబ్బాయి, ఇంక మమ్మల్ని నిద్రపోనివ్వరాఏమిటి!" అన్నాడు.

కల్యాణి అంతవరకూ కళ్లప్పగించి చూస్తోంది.

"మామయ్యగారూ అంది. ఈ నాటకం అయిపోయాక ఆ గొడవలో ఆయనసంగతులు ఆమెకు గుర్తేలేదు.

"ఎవరూ, కల్యాణమ్మే! భేష్ రా అబ్బిగా! ఆఖరికికొట్టుకొచ్చా వన్నమాట," అని విరగబడినవ్వాడు రామలింగయ్య.

"అయితే మీరు ఉన్నారా ఈ నాటకంలో?" అందికల్యాణి.

"అసలు నాటకాలే గదుటమ్మా నాబతుకంత" అన్నా డాయన.

"బాబాయ్, మిస్ కల్యాణి! కార్లోకూచోండి. అసలువాళ్లు ప్రమాదమేమీ తల పెట్టకుండా అక్కడికి చేరుకోవాలి," అంటూ కారు తలుపు తెరిచాడు మిస్టర్ చింతా.

అక్కడ పసివాళ్లిద్దరూ "హృదయ కుసుమాలలో ఆఖరు ఘట్టం నడుపుతున్నారు. నాటకంలోదికాదు నవలలోది.

"ఇంకనాకు ఆత్మహత్య తప్ప మరొక గత్యంతరం లేదు." అన్నాడు పట్టూ.

"నన్నర్థం చేసుకోలేరా?" అందిరాధ.

"అర్థంచేసుకున్నాను. ప్రేమకన్న ప్రతీకారవాంఛనీలో ప్రబలంగా ఉంది సరే తీర్చుకో, నీప్రతీకారం సాధించు. నావంటి

''నేను....నేను....హృదయ కుసుమాలలో హీరోయినంత క్రూరాత్మురాలనా ?'' అంది గుండె పగిలిపోయే గొంతుతో—

కళ్లు మూసికొని, ఇంక ఈ బాధభరించ లేనన్నట్టు గుడ్డిగా గది తలుపు గడియ తీసి తూలుతూ ఇవతల పడ్డాడు పట్టూ. అతను పడిపోకుండా పట్టుకుందొక చెయ్యి.

''స్టెడీ పట్టూ స్టెడీ,''

గొంతు గుర్తుపట్టి కళ్లు విప్పాడు పట్టూ,

''చింతా అంటూ అరచి అతన్ని కౌగలించుకొని అతని భుజంమీద ఏడవడం మొదలు పెట్టాడు.

మిస్టర్ చింతా జేబురుమాలు అతని కళ్లకూ తనకోటుకీ మధ్య అడ్డుపెట్టి.

''నో నో, కన్నీళ్లు కార్చవలసింది నా కోటుమీదకాదు.'' అంటూకొంచెం దూరంలో ఉన్న కుర్చీమీద కూర్చొబెట్టాడు.

ఎందుకో కల్యాణికి చెప్పరాని సంతోషం వొచ్చింది. గది లోకి వెళ్లి తన చెల్లెల్ని పలకరించడానికి కూడా ఆమె సాహ సించ లేక పోయింది. రాధే గదిబయిట జరుగుతున్న గొడవవిని మెల్లగా బయిటికొచ్చింది. కల్యాణిని చూసింది.

''అక్కయ్యా !'' అంది రాధ.

అయినా కల్యాణి కదల్లేదు. రాధ ఆశ్చర్యానికి అంతులేదు. ''మిస్ రాధ ! ఒక శుభవార్త మిస్ కల్యాణి అతిత్వరలో మిసెస్ చింతా కాబోతున్నారు.'' అన్నాడు మిస్టర్ చింతా.

ఆ దెబ్బకి రాధ తూలి పడిపోయేదే. కల్యాణి తన కౌగిట్లోకి తీసుకుంది ఆమెను. పట్టూ వెర్రిగా చూశాడు ఆమెవంక.

అప్పటికప్పుడే రామలింగయ్యగారు ఒకసోఫాలో నడుం వాల్చారు.

''రెండు పెళ్లిళ్లూ ఒకే ముహూర్తానికి.'' అని చెప్పేసి నిద్రపోయాడు.

''మా బావమరిదేడి, వ్హేర్ ఈస్ మై బ్రదర్ ఇన్‌లా ?'' అంటూ కామన్న గదితలుపుతోశాడు మిస్టర్ చింతా.

కాళ్లూ చేతులూ విచిత్రంగా ఉంగలు చుట్టేసి. సర్పాసనంలో ఉన్నాడు కామన్న.

''ఒక్క పదిహేను నిమిషాలు,'' అన్నాడు గుమ్మంవేపు తిరక్కుండానే మిస్టర్ చింతా తలుపు మూసేశాడు,

మా ఇంటికి వెళదాం. తరవాత కార్యక్రమం ఆలోచించ డానికి అందరం అలిసిపోయి ఉన్నాం కాస్త టీ కూడా అదీగాక మిస్‌కల్యాణి మీరు ఏ ఇంట్లో అడుగు పెట్టబోతున్నారో అదిముందు చూసుకోడం మంచిది. మీరు బయిటినించే చూచారుగాని, లోపల చూడలేదు ''

నలుగురు కార్లో కూచున్నారు మిస్టర్ చింతా పక్కని కల్యాణి ముందు సీట్లో, పట్టూ పక్కని రాధ వెనుక సీట్లో కారు మహావేగంగా కదిలి రోడ్డు మీదికి తిరిగింది.

(సమాప్తము)




మన పిల్లలు ఒకళ్ళ నొకళ్ళు బాగా ఎరుగుదురు...

పంచవర్ష ప్రణాళికా కార్యక్రమంలో ఒక భాగంగా ఇండియాలో రోడ్డు రవాణా, రహదారి మార్గాల అభివృద్ధికై కోట్లకొలది ధనం వెచ్చించబడుతున్నది. ఇందువల్ల ఇతరత్రా ఒనగూరు ప్రయోజనాలు మాత్రమేగాక, సువిశాలమైన ఈ దేశంలో విభిన్న సంస్కృతులు, మతాలు కలిగివున్న విభిన్న దృక్పథాలతో వ్యవహరించే వివిధ ప్రాంతాల ప్రజలను సన్నిహితపరచి వారి మధ్య సాముదాయిక ప్రవృత్తిని అలవరచడానికి ఇది దోహదకారి కాగలదు. ఎంత దూరంలోనున్న వారి మధ్యనైనా పరస్పరానురాగం, సమరస్య భావం కలగడానికి ఇది సాధనం కాగలదు.

1898లో ఇండియాకు మొదటి న్యూ మాటిక్ టైర్లను తీసుకువచ్చినప్పటినుంచి, దేశంలో రవాణా సౌకర్యాల అభివృద్ధి కార్యక్రమంలో డన్‌లప్ ప్రముఖ పాత్ర వహించింది. కలకత్తా సమీపంలోని డన్‌లప్ ఫ్యాక్టరీ—ఆసియాలోని టైర్ల ప్లాంట్‌లు అన్నింటిలోనికి పెద్దది—అనేక రకాల టైర్లను, రవాణాకు, పరిశ్రమలకు అవసరమైన అనేక రకాల పరికరాలను ఉత్పత్తి చేస్తున్నది. రవాణాల అభివృద్ధిలో నిత్యమూ పెరిగిపోతున్న అవసరాలను తీర్చడానికిగాను 1959 లో అంబత్తూర్‌లో రెండవ డన్‌లప్ ఫ్యాక్టరీ స్థాపించబడింది.

డన్‌లప్ మార్గదర్శి

DC-444 F TEL



వర్షాకాలము :

శ్లో॥ నిలీయమానైర్విహగైః నిమీలద్భిశ్చ పంకజైః
వికసంత్యా చ మాలత్యా గతోఽస్తం జ్ఞాయతే రవిః ॥
నవమాసధృతం గర్భం భాస్కరస్య గభస్తిభిః
పీత్వా రసం సముద్రాణాం ద్యౌః ప్రసూతే రసాయనం ॥
శక్యమంబరమారుహ్య మేఘసోపానపంక్తిభిః
కుటజార్జున మాలాభిరలంకర్తుం దివాకరం ॥

—వాల్మీకి

"వర్షాకాలమునందు పగలంతయు సూర్యుడు కనపడకుండుటచేత సూర్యాస్తమయము అయిన సంగతి తెలియని మనుజులు, పక్షులు గూండ్లలోకి పోవుటను, కమలములు ముకుళించుటను, మాలతీకుసుమములు వికసించుటను చూచి, సూర్యుడు అస్తమించినాడని తెలిసికొన గలుగుచున్నారు.

సూర్యుని తేజస్సుచేత నవమాసములు గర్భమును ధరించిన ఆకాశలక్ష్మి సముద్రముల నీరు పానము చేసి యిప్పుడు రసాయనమును ప్రసవించుచున్నది.

మేఘములు అను సోపానములద్వారా పైకి ఎక్కి గిరిమల్లికలు. కడిమిపుష్పములమాలంచేత సూర్యుని అలంకరించుటకు సాధ్యమగు చున్నది.

కవిప్రశస్తి :

శ్లో॥ భుజవనతరుచ్ఛాయాం యేషాం నిషేవ్య మహౌజసాం
జలధిరశనా మేదిన్యాసీదసావకుతోభయా ।
స్మృతిమపిన తే యాంతి క్ష్మాపాః వినా యదనుగ్రహం
ప్రకృతిమహతే కుర్మస్తస్మై నమః కవికర్మణే॥

—కల్హణ

సముద్రమేఖలయగు భూమి యేరాజులయొక్క భుజతరుచ్ఛాయలను ఆశ్రయించి నిర్భయముగా నుండెనో అటి రాజులు, ఏ కవుల అనుగ్రహము లేకున్నచో భూమండలములో జ్ఞప్తికిగూడ రారో, నైసర్గికముగా గొప్పదైన అట్టి కవికర్మకు నమస్కారములు చేయుచున్నాము,

చ॥ కదలనిక్రొమ్మెఱుంగు. కసుగందనికెందలిరాకు, నాచుతోఁ
బొదువనితూఁడు, బంగరపుఁబుత్తడి, మవ్వపుఁబువ్వు, భర్గుతో
నెదురనికామునమ్ము, ఫణియెంగిలికానిసుధాంశురేఖ నా
నొదవుచు నుండె రుక్మిణి పయోరుహనాభునిభాగ్యరేఖగాన్.

—మడికి సింగన

కల్యాణములో పెండ్లికూతురుగా నున్న రుక్మిణీదేవి, చలనములేని మెఱపో, కందనిచిగురుటాకో, నాచు తీగెలు చుట్టనితామరతూఁడో బంగారుబొమ్మయో, కోమలపుష్పమో, శివుని ఎదుర్కొనని మన్మథబాణమో, రాహువు మ్రింగి విడువనిచంద్రరేఖయో, యనునట్లు ఒప్పుచు శ్రీకృష్ణునిభాగ్యరేఖగా నుండెను.

ఉ॥ భావరస ప్రపంచమునఁ బర్వనలంకృతి, లక్షణంబు, ఛం
దోవిచిత్రిప్రచారముఁ గుతూహలదస్ఫురదంధ్రదేశభా
షావి విధప్రసంగములచందము నందముగా నొనర్చి వి
ద్యావిధి గానిపించుటగదా చతురత్వ మనంగ మేదినిన్. —విన్నకోట పెద్దన

"భావము, రసము, అలంకారము, లక్షణము, ఛందోవైభవము, కుతూహలము గలిగించునాంధ్ర దేశపువివిధప్రాంతములభాషావిశేషప్రసంగములు" ఈ మొదలైనవిశేషములతో అందముగా రచించిననే కదా అది కవిచాతుర్య మనిపించుకొనును.

ఉ॥ పెట్టక కీర్తి లేదు; వలపించక యింతికి నింపు లేదు; తాఁ
దిట్టక వాదు లేదు; మఱి ధీరత వైరుల సంగరంబులన్
గొట్టక పేరు లేదు; కొడు కొక్కఁడు లేక పరంబు లేదు; నా
పట్టపురాజుకైన నిది పద్ధతి శ్రీశరభాంకలింగమా ! —శరభాంక కవి

మ॥ చరమక్ష్మాధరచారుసింహముఖదంష్ట్రాకోటి యా నాఁగ నం
బరశార్దూలనఖంబు నాఁగఁ దిమిరేభప్రస్ఫురద్గర్వసం
హరణకూ్రరతరాంకుశం బనఁగ నుద్యల్లీల మేరేఖ ని
త్యరుచిం బొల్పెఁగఁ బెంపగున్ విదియచంద్రా! రోహిణీ వల్లభా! —రావిపాటి తిప్పన్న

పడమటి కొండ యనెడు సింహముయొక్క కోరయో, ఆకాశమనెడు పులియొక్క నఖమో, చీకటి యనెడు గజముయొక్క గర్వమును అణచు అంకుశమో అనునట్లు తోచుచు స్వచ్ఛమైన శరీరకాంతితో విదియ చంద్రుడు ప్రకాశించుచున్నాడు.

ద్విపద :— "పదునాలుగేండ్లును బగలును రేయి
నిదుర వోవక యుండ నియమంబు సేసి
తమయన్న సెజ్జకు దవ్వుల నిలిచి
యమలమానసుడు నైయటు గొల్చి యుండ
నారాత్రి నిద్ర మాయారూపు దాల్చి
ధీరు డాలక్ష్మణదేవునిఁ జేరి
'యేను నిద్రాదేవి; యేర్పడఁ దెల్పు
మా నాకు నింకెట్లు మానాథ్య! యంత
విధి విధించెను వెంట వెంట వర్తింప;
విధ మేది నిన్ను నే విడుచుట కింక''
ననినఁ నూర్మిళయందు నహరహంబులును
జని యుండు; మంత నీసమయంబు దీర్చి
వచ్చినఁ గైకొందు వరుస ని'' న్ననిన
నిచ్చ 'నౌఁ గా' కంచు నేగె నిద్రయును:
నలరుచు 'నీ దేవతానుగ్రహంబు
గలిగె నా' కనుచు లక్ష్మణదేవు ఁడుండి" (రంగనాథ రామాయణము) —గోన బుద్ధారెడ్డి

వర్షా మేఘము :

శ్లో॥ మించుందమ్ములత్రుంపు లుండుబురదల్, మిన్భూమిలేఁబచ్చికల్,
ప్రాంచత్కంజనవాంకురాభజలధారావల్లి కేదారముల్
చంచద్భూధ్రశిరస్సరిజ్జలమిలచ్ఛైవాలముల్, సూర్యచం
ద్రాంచత్కారలు వారివాహములు నేత్రానందమున్ గూర్చెడిన్. —ఆంధ్ర బిల్హణ

''మెఱపులు అను పంకజములకు పంకము, ఆకాశము అనుభూమిపైన ఒప్పుపచ్చికబయిళ్లు, కమలపు మొలకలవంటి జలధారాలతలకు మళ్లు, పర్వతములశిఖరములపై ప్రవహించు నదులలోని నాచుతీగలు, సూర్య చంద్రులకు కారాగృహములునైన యీ వర్షాకాల జలధరములు కన్నులపండువై పిలిసిల్లుచున్నవి.

త్యాగరాజ కీర్తనలు సాహిత్యము

శ్రీమతి ఐ. సరస్వతి

"సంగీతమపి సాహిత్యమ్ సరస్వత్యాస్స్తన ద్వయమ్
ఏకమాపాత మధురమ్ అన్యదా లోచనామృతమ్"

శారదాదేవి తన అపార మాతృ వాత్సల్యముతో భారత దేశమున బెక్కు మహాకవి కిశోరములకు వుగ్గుపాలతో కవితామృతముఁబోసి వారి యశోవికాసముల కాచంద్ర తారకముగా శాశ్వత ప్రతిష్ఠ ననుగ్రహించినది. మధురాతి మధురముగా తన సంస్కృతాంధ్ర సాహితీ జ్ఞానమునకు స్వరరాగ సుధారసమును మేళవించి "మృదుగితా వల్మీకి జన్మామునిః" యనుదివ్యకీర్తి నార్జించి సర్వసామాన్యముగా వుత్తమ భక్తి భావముతో అందర హృదయములను అప్రయత్నముగా సర్వేశ్వరుని వంక కాకర్షింపజేయు గేయ ప్రబంధమును సృష్టించిన వాగ్గేయకారక చక్రవర్తి శ్రీ త్యాగరాజస్వామి. ఈ మహానుభావుడు వేద వేదాంగముల నభ్యసించిన పండితుడు. ఈయన కేవలము తన పాండిత్య ప్రకర్షముఁ జాటుకొనుటయందే లక్ష్యము గలవాడు గాక, తన విజ్ఞాన ధన ప్రాయమున చక్కని లలిత పద విన్యాసముతో, మత భేదము జూపని నిశ్చల భక్తితో, జన సామాన్యము యొక్క హృదయ ఫలకములపై పరమపావనమగు శ్రీ తారకమంత్రమును స్వర్ణాక్షరములతో లిఖించిన వాడు. కావుననే సర్వాంతర్యామిని యీ విధముగా స్తుతించెను.

"వేదశాస్త్ర పురాణ విద్యలచే భేద వాదములు
తీరక భ్రమసే వారలఁజూచి, నిన్నే నెరనమ్మి
నానురా ఓ రామయ్య రామ" ॥నిన్నే॥

"రాగ లోభములతో దీపము జేసితే బరగతి కలుగ
నేర్చునా................నళినలోచన నిన్ను గాక
యన్యుల నమ్మిన నరజన్మ మీడేరునా॥"

జయదేవుడు, నారాయణ తీర్థులు, క్షేత్రజ్ఞుడు మున్నగు వాగ్గేయకారకు లెందరో సంస్కృతాంధ్ర భాషల యందనేక గేయ ప్రబంధములను నిర్మించిన వారు గలరు కాని సంగీత సాహిత్యముల కలయికచే నొక వినూత్న మార్గమును గాయకులకు జూపి బెక్కు సంగతులతో గాన మొనర్చుట కనువగు నట్లు లలితయలతి పదముల కూర్పుచే గేయ సాహిత్యమును శోభాయమానము గావించుటలో త్యాగబ్రహ్మదే పై చేయి యనక తప్పదు.

"సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము గలదే
మనసా ॥సం॥

"సంగీత జ్ఞాన విహీనులకు మోక్షము గలదా భువిలో"

"రాగ సుధారస పానము జేసి రంజిల్లవె ఓ మనసా"

పై కీర్తనల యందలి భావముల బట్టి సంగీతము ఈశ్వర సాక్షాత్కారము బడయుటకు సులభమార్గమని నాద బ్రహ్మ యన దగిన త్యాగరాజస్వామి యుద్దేశమని తెలియ నగును.

ఈ మహాత్ముడు నిగర్వి. "ఎందరో మహానుభావులు. అందరికీ వందనములను కీర్తనలో భాగవతాగ్రేసరుల నందరిని స్తుతించెను. ఈ కీర్తన త్యాగబ్రహ్మ యొక్క సుప్రసిద్ధములైన పంచరత్నములలో కొనియాడదగినది.

ఈ మహనీయుడాయా సమయములలో శ్రీ రామచంద్రుని యందు భక్తిభావ ముప్పొంగినపుడు వివిధ రీతుల నాలపించిన కీర్తనలసంఖ్యాకములై యున్నవె. వీరు రెండు వేల నాలుగువందల (2400) కీర్తనల రచించినట్లు మనము తెలిసికొన గలము. కాని గేయ రాజములన్నియు ప్రస్తుతము లభ్యములు గావు. వీని నన్నిటిని కలిపి మొత్తముగా "మహాకావ్య" మను సంకేతములో పేర్కొనవచ్చును. ఈ గేయములందాయా సందర్భములలో రామాయణ భాగవతము భారతాది పురాణేతిహాసములలో ఆణి ముత్యముల వంటి ఘట్టములెన్నో పేర్కొనబడినవి. త్యాగయ్యగారు "దివ్య నామ కీర్తనలు, ఉత్సవ సాంప్రదాయ కీర్తన" లను బృంద కీర్తనలకూడ రచించిరి. వీరు ప్రహ్లాద విజయము, నౌకా చరిత్రమను గేయనాటకములను రచించిరి. "వినతాసుత వాహనుడై వెడలెను. శ్రీ కంచి వరదుడు"॥ (ఉత్సవ సాంప్రదాయ కీర్తనలలో నొకటి).

ఈ కీర్తనలందలి శయ్య, శబ్దాలంకారములు, మనోహరములగు యమకములు, వృత్తి రీతులు ప్రశంసనీయములు.

"సీతో మెల్లని మాటో కన్నుల తేటో మరివలె వాటో"॥

"నీ మనసు నీ సొగసు నీ దినుసు వేరే ॥లావణ్యరామ॥

ప్రాసముల సొంపు చూపుటయందీ వాగ్గేయకారక చక్రవర్తి కడు సమర్థుడు.

"బాల కనకమయ చేల సజ్జన పరిపాల శ్రీ రమాలోల
విధృతశర నీల నవ్యవన మాలికాభరణ ॥ఏల॥

"జలజాప్తకుల భూషణ సుభాషణ సజ్జన పోషణ
జనకసుతా రమణ" ॥నళినలోచన॥

"పూజలు సేయరుగా మనసార బూజలు సేయరుగా
చేలము గట్టరుగా బంగరు చేలము కట్టరుగా
హారతు లెత్తరుగా ముత్యాల హారతు లెత్తరుగా'' ॥
(లాటాను ప్రాసము)

ఇంకను వీరి కీర్తనలందు ముక్తపదగ్రస్తములు మొదలగు ననేక చిత్రములు గలవు. మధురభక్తి భావమున కీర్తించునపుడా ప్రవాహములో నందమైన శబ్దములు, ద్వ్యర్థములు, మిశ్ర సమాసములను సరసముగా త్యాగరాజు ప్రయోగించి యున్నాడు. భాషావాదుల విమర్శలెట్లున్నను యీ మహామహుని భక్తి ప్రవాహమున కెట్టి యంతరాయమును గానరాదు.

''ఏకోరసః కరుణ ఏవ నిమిత్త భేదాత్'' అను భవభూతి వచనమును బట్టి త్యాగరాజ కీర్తనలందు ప్రధానముగా కరుణరసమే అంగిగా కనుపట్టును. శృంగార హాస్యములు అంగములు.

ఇక త్యాగరాజ కీర్తనలందచ్చటచ్చట వాడిన సామెతలు, ఉపమానములు లోకోక్తులు, ఉత్ప్రేక్ష మొదలగు అలంకారములు కొల్లలుగా గలవు. అవి రమణీయార్థ ప్రతిపాదకములై నొప్పుచున్నవి.

"దొంగ మగని భక్తి మీర నమ్మినమంచి త్రోవ జూప నేర్చునా"

''సోమిదమ్మ సొగసుగాంద్ర గోరిన సోమయాజి
స్వర్గార్హుడెట్లౌను''
''కోకలు వెయ్యున్న కట్టుకొనుట ఒకటేగాని"

ఇన్నియు గలసి పరమశాంతమగు భక్తితో కలయిక జెంది పరిపూర్ణత్వమును గాంచును.

ఒక్కొక్క తరి త్యాగయ్య తనయందు నాయికా భావము గల్పించుకొని శ్రీరాముని గూర్చి ప్రేమతో ముచ్చటలాడుచుండును. ఒకప్పుడు ఖండిత నాయికవలె స్వామిని యేమేమో దూరుచుండును. మఱొక సమయమున విప్రలంభము నభినయించును.

"నీరజనయన ఒక ముద్దీర, బంగారు వలువలు నే బాగుగ
గట్టెద, మరి శృంగారించి సేవజేసి కౌగిటఁ జేర్చెద''
"ఏలర యీ బాధ తాళ
జాలర దయజూడ నీ కేలర శ్రీకృష్ణ నాతో చలము"

మూఢాచారములను, దాంభిక కృత్యములను త్యాగయ్య తన కీర్తనలందచ్చటచ్చట పరిహసించి యున్నాడు.

''కొంగ వంటి ధ్యానము జేసిన దనకోరిక
కొనసాగునా'' ॥నళిన॥

త్యాగరాజు భగవంతుని [illegible] నొకపుడు పంతములాడుట, వెంటనే జాలితో దీనుడై ప్రార్థించుట, యపరాధము నారోపించుట మున్నగు మధురభక్తి భావములు వీరి కీర్తనలందు అడుగడుగున గానవగును. శ్రీరాముని నిద్రమేల్కొల్పుట, అలంకరించుట, ఆరగింపజేయుట, జోకొట్టుట మున్నగు షోడశోపచారములు, రాజోపచారములు, "ప్రేమ ముప్పిరిగొను వేళ నామము దలచుట.'' "మనసున దలచి మైమఱచియుండుట," శ్రీరాముడు తన కట్టెదుట సాక్షాత్కరించినట్లు దోచుచో స్తుతించుట మొదలగు గంభీర విషయములు. వీరి కీర్తనలందలతి యలతి పదములతో సామాన్యజనుల హృదయముల నాటుకొనునట్లు చెప్పబడినవి.

భగవంతునిపై నింగాస్తుతి, స్తుతినిందా వచనములు త్యాగయ్య కీర్తనలలో గానవగును. వీరి కీర్తనలందలి సాహిత్యముదాత్త శైలిలో నడచును. ఇంకను వీరి కీర్తనలలో ద్వయితాది మతముల వివరణ, భగవద్భక్తి సిద్ధాంత నిరూపణ, పై మతములందలి భేదవాదములు, వానిని సమరస భావముతో సమర్థించుట మున్నగు గొప్ప విషయములు గోచరించును. ''తత్త్వమసి'' మహావాక్యార్థ నిరూపణ, భగవంతునితో భక్తుని ఐక్యానుభూతి, తత్ఫలితముగా అలౌకికానందము త్యాగరాజ కీర్తనలందధికముగా గోచరించును. శ్రీరాముని ''చేతులార శృంగారము చేసి'' ''కన్నుల కరువు దీరునట్లా తని దివ్యసుందర విగ్రహమును గాంచుట త్యాగయ్య యొక్క జీవితాశయము.

ఇంకను రామకృష్ణాద్యవతారములు, దేవతాస్తుతులు, క్షేత్రాదిస్థాన దేవతల వుత్సవ సాంప్రదాయ కీర్తనలు మున్నగునవి ఆ మహనీయుని వాఙ్మయ సముద్రమందలి భావతరంగములు.

త్యాగరాజు కీర్తనల యందలి సాహిత్యభాగములు సుబోధకములైన సందేశములతో నగ్రస్థానము వహించినవి. అవి ఉపనిషద్వాక్యముల వలెను, గీత బోధనల వలెను, జ్ఞాన బోధకములుగా నున్నవి. త్యాగయ్య రాగసుధారసము "యాగ, యోగ, త్యాగ, భోగ ఫల మొసంగు'' నని చెప్పి యున్నాడు. ''భక్తిలేని కళలెన్ని నేర్చినను పొట్టకూటికే'' నని ఆయన యుద్దేశము. త్యాగరాజు ''నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?'' యని తనలో వితర్కించుకొని శాశ్వత సుఖప్రదమైన రాముని సన్నిధినే కోరుకొన్నాడు. ''నిగమశిరోర్థము గల్గిన నిజవాక్కులతో స్వరశుద్ధముతో సొగసుగా మృదంగతాళము జతగూర్చి'' శ్రీరామచంద్రుని చొక్కజేసి, భక్తిపరవశుడైన త్యాగబ్రహ్మ కర్ణాటక గాన శాస్త్ర ప్రవర్తకులలో ప్రప్రథములని చెప్పవచ్చును. త్యాగరాజ కీర్తనలు నేర్చుకొననివారిని గాయకులుగా గుర్తించుటకు వీలుకాదని పెద్దలగు మహావిద్వాంసులు నిర్ణయించిరి. త్యాగరాజ కీర్తనల వలన తెలుగు తల్లి కెనలేని గౌరవము కలిగినది.

త్యాగరాజ కీర్తనల గుఱించి చెప్పుట యన సముద్రపు నీరు కొలుచుట యనవచ్చును. ★


కడపజిల్లాలోని కొన్ని దర్శనీయ స్థలాలు

రావుల సూర్యనారాయణమూర్తి

ఉజ్జ్వల చరిత్రకూ, ఉదాత్త సంస్కృతికీ ఆలవాలమై ప్రకృతి సౌందర్యముతో పరిఢవిల్లుతూ ప్రాచీన కట్టడాలతోను, అపారమైన ఖనిజ సంపదతోను అతిమనోహరంగా సాక్షాత్కరించే కడప జిల్లాలోని వివిధ ప్రాంతాలను 1966 జనవరి ద్వితీయ పక్షంలో చిత్తూరు జిల్లా పాత్రికేయుల బృందం ఒకటి సందర్శించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేయబడ్డ ఈ పర్యటనలో పత్రికా ప్రతినిధులు పంచాయతీరాజ్యసంస్థలు సాధిస్తున్న సత్వర సర్వతోముఖ ప్రగతిని పరిశీలించడంతో పాటు యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తున్న కొన్ని ప్రదేశాలను దర్శించారు. ఆ స్థలాల ప్రత్యేక విశిష్టత, ప్రాధాన్యమును వివరించడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

వేంపల్లె గండి

పరమ పావనమైన పాపఘ్ని నదీతీరాన మహోన్నత శృంగాలతో అలరారుతూవుండే రెండు కొండల మధ్య సకల జనులను సమ్మోహితులను గావించే సహజ సౌందర్యసంభరితమైన ఆంజనేయ క్షేత్రం వేంపల్లి గండి. పురాణేతిహాసాలను బట్టి రామాయణ కాలానికి పూర్వంనుంచీ కూడా ఈ ప్రాంతం వర్ధిల్లుతున్నట్లు తెలుస్తున్నది. అనాటికీ ఈనాటికీ పవిత్రమైనదిగా పరిగణించబడుతున్న గండిక్షేత్రం కడపకు నైరృతి మూలగా 25 మైళ్ల దూరాన పులివెందుల, రాయచోటి తాలుకాల సరిహద్దులో ఉన్నది. సమున్నతమైన శేషాచల పర్వత శ్రేణులలో ప్ర[illegible] శైలాల నడుమ దక్షిణం నుంచి ఉత్తరాభిముఖంగా ప్రవహిస్తున్న పాపఘ్ని నదీతీరాన వెలసిన వీరాంజనేయ దేవాలయం శ్రితజనవత్సలుడైన శ్రీరామచంద్రుని పాదరజస్స్పర్శచే పూతమైన దివ్యస్థలం.



వేంపల్లె గండి

పుణ్యదాయిని అయిన పాపఘ్ని అయిన ప్రదేశాలలో మహాపవిత్రంగా పరిగణించబడుతున్నట్లు వాయుపురాణంలో వ్రాయబడింది. అందులో భాస్కరక్షేత్రమనే నామాంతరంగా గల వేంపల్లె ఒకటి. అక్కడ పాపఘ్ని ఉత్తర వాహిని కావడంవల్ల గండిక్షేత్రం మరింత సమున్నత స్థానం సముపార్జించుకున్నది. ఈ పుణ్యతీర్థంలో స్నానమాచరిస్తే జన్మాంతరార్జితాలైనట్టి సమస్త పాపాలనుంచి సద్యః విముక్తులవుతారని ప్రతీతి. ప్రకృతి రామణీయకతకు నిలయమైన గండివద్దగల పర్వత పంక్తుల ఎత్తు రమారమి రెండు వేల అడుగులు. నీరం తీరాలుదిగి వినిర్మలమై ప్రవహిస్తూ మానవాళితో మౌనవచః ప్రసంగాలు చేసే పాపఘ్ని మనోహరమైన పర్వత లోయల మధ్య మలుపులు తిరిగి ప్రవహించి కడపవైపు మైదానంలో ప్రవేశిస్తున్నది.

ప్రశాంతత, రామణీయకత, నైర్మల్యం వ్యక్తమవుతూ అనంతతరు సంశోభితమై, నిరంతరము సాధు సంసేవితమై విరాజిల్లుతున్న వేంపల్లె గండి మహామహిమ సంపన్నమైనది. మోక్షఫలప్రదాయకమైన ఈ ప్రదేశానికి పుణ్యప్రదమైన ఒక పురాణగాథ వున్నది. దాని ప్రకారం నీలనీరద సమున్నిభ దేహుడైన శ్రీరామచంద్రుడు రావణుని సంహరించి [illegible] సేతుకట్ట లంకనుంచి తిరిగివస్తూ తీవ్రతర సాధనలు సలిపి, దేవతాశక్తి కలిగిన వాయుదేవుడు సుందర మందహాస వదనారవిందంతో స్వాగతమివ్వగా నిర్మలినాంతరంగమైన నిర్ఝరిణీ తీరాన పాల కొండలకు పాపఘ్ని చొచ్చుకునిపోయే స్థలంలో కొంత సమయం గడిపాడనీ, ఆ సందర్భంలో ఒక శిల్పి తన భక్త్యాగ్రేసరుడైన ఆంజనేయుని రూపం [illegible] చిత్రించాడనీ తేటతెల్లమవుతున్నది. చిటికెన వ్రేలు మాత్రం అసంపూర్ణంగా విడిచిపెట్టి వేయబడ్డ ఈ ఉజ్జ్వల విగ్రహాన్ని వ్యాసరాయలవారు ప్రతిష్ఠించారని ప్రఖ్యాతి. ఆ సత్ప్రదేశంలో ఆంజనేయ దేవాలయం నిర్మితమయింది.

కారణజన్ముడైన కారుణ్యరామునికి సాదర స్వాగతమిచ్చే తరుణంలో తపోనిష్ఠుడైన వాయుదేవుడు సర్వపర్వతాలలో శ్రేష్ఠాలై దేవ సంఘాలచేత, ముని సంఘాలచేత ఆశ్రయించబడ్డ ఆ రెండు పర్వతాల నడుమ ఒక భవ్యమైన బంగారు తోరణం నిర్మించాడనీ, అది అతులిత విజ్ఞాన ప్రభావం, అనుపమ ఆధ్యాత్మిక దివ్యశక్తి, లోకోత్తర తపోగరిమ గల మహనీయులకు మాత్రమే సాక్షాత్కరిస్తుందనీ, అది కనుపించిన వారికి అద్యతన భావిలో పరమపదం ప్రాప్తిస్తుందనీ ప్రజల ప్రగాఢ విశ్వాసం. సర్వజనులను ఆశ్చర్యచకితులనుచేసే మన్రో

మరణాసన్నగాథ నేటికీ కానవస్తుందని ఆ పసిడితోరణం నిరూపిస్తున్నది.

సర్ థామస్ మన్రో సుమారు 140 సంవత్సరాల క్రితం కడపజిల్లాకు కలెక్టరుగా పనిచేసిన ఆంగ్లేయుడు. అతి పవిత్ర సదాచారం, అకుంఠితసత్ప్రవర్తన, నియమబద్ధ సదాచరణాల చేత ప్రసిద్ధిగాంచిన ఆ మహనీయుడు ఒకనాడు పరివార సమేతుడై గండిగుండా వెళుతుండగా బంగారుతోరణం కనిపించిందట. అప్పుడాయన తన క్రింది ఉద్యోగులకు ఆ విషయం వివరించగా మన్రో ఆత్మాను భూతిద్యుతులు, విజ్ఞాన జ్యోతులు తపః ప్రాభవ పరం పరలు యెరిగినవారు ఆయనకు అవసాన కాలం ఆసన్నమయిందని తెలియ జేశారట. ఆ సంఘటన సంభవించిన ఆరు నెలలు తిరుగక పూర్వమే ఆత్మజ్ఞాన సంపన్నుడు కరుణాశాలి, పూతచరితుడు అయిన మన్రో పరలోక గతుడయ్యాడట.

పరమ శోభనమైన పాపఘ్నిలో చేసిన స్నాన మహిమ వల్ల మానవులు ఇష్టార్థసిద్ధి, ఇహలోక సుఖాలు, పరలోకానందం అనుభవిస్తారని అందరి విశ్వాసం. కనుక కష్టనివారణకు భక్తులు ఇక్కడ భజనలతో నిరంతరం కాలక్షేపం చేస్తుంటారు. కొందరు కోరికలీడేర్చుకొనే నిమిత్తం బహు దూరపు ప్రాంతాల నుంచి విచ్చేసి ఈ గండిక్షేత్రంలో నెలల తరబడి నివసిస్తూ ఆధ్యాత్మిక విచారం భగవత్సంస్మరణం సల్పుతుంటారు. అలాంటి భక్తవరేణ్యుల సౌకర్యార్థం సత్రాలు కొన్ని నిర్మించ బడ్డాయి. అందులో శ్రీ తాడిపత్రి భుజంగరావు గారి ధర్మసత్రం ప్రసిద్ధమైనది. ఈ క్షేత్రంలో శ్రావణ శనివారాలు అత్యంత పర్వదినాలు. ఆ విశేష పుణ్యకాలంలో వేలాది భక్తులు వీరాంజనేయుని సందర్శించి, సంసేవించి సర్వాభీష్ట సిద్ధులవుతారు.

శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి అతి సమీపంలో అతులిత పుష్పోద్యానమై భవ్య సుందరాకారంతో బహు విధాను కూల్యాలతో అలరారే శ్రీ భూమానందాశ్రమం వున్నది. లోక కళ్యాణార్థం సతత ప్రయత్న శీలమై విలసిల్లుతున్న ఆశ్రమంతో పాటు ఈ పరిసరంలో పావురాళ్లగుట్ట, నామాల గుండు, మతంగ గుహ, దాసరయ్య గుహలు, సిద్ధేశ్వర గుహ మొదలైన అనేక పురాణ ప్రసిద్ధమైన ప్రదేశాలు వున్నాయి. ప్రాచీనమూ, ప్రభావ ప్రపూరితమూ అయిన ఈ వేంపల్లె గండి సద్భక్తులూ, సౌందర్యోపాసకులూ సందర్శించ దగ్గ దివ్యక్షేత్రం.

శ్రీ బ్రహ్మంగారి మఠం

కడప జిల్లాలోని కందిమల్లయ్యపల్లి వేద వేదాంత ధర్మ మర్మ ప్రచారకుడైన వీరబ్రహ్మంగారి సజీవ సమాధితో విరాజిల్లుతున్న విఖ్యాత యాత్రికస్థలం. మహర్షి పుంగవులకు, మత ప్రవక్తలకు, మహాభక్తులకు భారతావని దివ్యజన్మస్థలం. కారణ జన్ములు, లోకోద్ధరణ తత్పరులు, ఆధ్యాత్మిక దివ్యతేజః ప్రతిబింబులూ అయిన మహాత్ములు ప్రజలలో ధార్మిక భావన అడుగంటి, అధర్మం ప్రవర్తిల్లుతున్న తరుణంలో భారతమాత గర్భాన ఆవిర్భవించి అలౌకిక ధర్మప్రబోధామృతాన్ని లోకంలో వర్షిస్తున్నట్లు పవిత్ర చరిత్ర నిరూపిస్తున్నది. అలాంటి అవతార పురుషులలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారు ఒకరు. తపశ్చర్యలో, వర్గవర్ణ వాసనా రహిత మంత్రోపదేశ విధానంలో, గార్హస్థ్య పావిత్ర్య నిరూపణలో గ్రామీణ శిల్పవృత్తి నిర్వహణలో, విగ్రహారాధన విశిష్టతా విశదీకరణలో, సర్వమత సామరస్య సాధనలో అనన్య సామాన్య ప్రతిభను ప్రదర్శించి అశేష ప్రజల ఆదరాభిమానాలకు పాత్రుడైన ఆ వీరదేశిక విభుని జీవితవృత్తాంతం పరమోత్కృష్టమైనది.

పదహారవ శతాబ్దంలో పాపాగ్ని పీఠాధిపతులైన వీరభోజయాచార్యుల వారు, తమ సతీమణి వీరపాపమాంబ సమేతంగా సంతానార్థులై తీర్థయాత్రలు సల్పుతూ సరస్వతీ నదీతీరాన, వారాణసి సమీపంలో ఆశ్రమవాసి అయిన అత్రిమహర్షి వద్దనుంచి దత్త పుత్రునిగా వీరనారాయణను స్వీకరించారు. శైశవక్రీడలలోనే శిల్పకళా కౌశలమూ, వేదాంత ప్రజ్ఞ ప్రకటిస్తుండే ఈ సహజ జ్ఞాన విలాసుని చిన్నారి పొన్నారి చిరుతప్రాయంలోనే వీరభోజయాచార్యులు పరమపదించారు. దానితో దుఃఖ సంతప్తచిత్త అయిన మహాసాధ్వి వీరపాపమ్మ గుండె దిటవు పరచుకుని వీరనారాయణ అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ వుండేది. ద్వాదశ వర్షప్రాయుడైన ఆయన సర్వమానవాధ్యాత్మిక జీవనోన్నతి సాధనకు పాపాగ్ని పీఠాధిపత్యాన్ని పరిత్యజించి దేశసంచారం ప్రారంభించారు.


వీరదేశికుడు దేశాటనంలో ఉత్తర దేశంలో గల కాశీ, ప్రయాగ మొదలైన దివ్యక్షేత్రాలు సందర్శించి, కర్నూలు జిల్లాలో గల బనగానపల్లె గ్రామంలో పరమసాధ్వీరత్నమైన శ్రీమతి గరిమిరెడ్డి అచ్చమాంబగారి యింటి సేవకవృత్తిని స్వీకరించి, ఆమెకు తత్త్వోపదేశంచేసి, సనాతన ధర్మ సముద్ధరణకు పూనుకోవడమే కాకుండా కాలజ్ఞానం అనే భవిష్యద్విషయాలతో నిండిన మహత్తర గ్రంథాన్ని రచించాడు. ముముక్షువులు సమాశ్రయించదగింది సన్న్యాసాశ్రమం మాత్రమే అనే ప్రవక్తల ప్రచారం వల్ల ప్రజానీకంలో అలుముకున్న గార్హస్థ్య నిరసన భావాన్ని రూపుమాపి, ఉత్తమ గృహస్థాశ్రమ ఆదర్శాలను నిరూపించే నిమిత్తం ఆయన గోవిందమ్మ అనే పుణ్యసాధ్విని వివాహం చేసుకుని సంతాన సిద్ధుడయ్యాడు. జీవనోపాధికి శిల్పకర్మ నాచరించి శిల్పవిద్యాదేవి నారాధించవలసిన ఆవశ్యకతను విశదీకరించాడు.

సదాచార పవిత్రుడూ, సాధు సంపూజితుడూ అయిన వీర బ్రహ్మం తాను అనుష్ఠించిన సనాతన ఋషి ధర్మమైన శిల్ప కర్మయోగంలో వీరభద్ర విగ్రహం ఒకదానిని శిలతో నిర్మించి దానికి ప్రాణ ప్రతిష్ఠ చేయగా అది కుముద్వతీ నదిలో పడి ప్రవాహ వేగంతో అల్లాడుతు పల్లె చేరుకుంది. ఆ శిలావిగ్రహం

కొరకు అనునిత్యం ఒక బాలుడు ఆ గ్రామానికివచ్చి సవయస్కులతో సాయంత్రంవరకూ ఆనందోత్సాహాలతో ఆటలాడి, అనంతరం నదిలో మునిగి అదృశ్యుడయ్యేవాడు. ఆ వీరభద్రస్వామి కొన్నాళ్ళకు ఆవూరు పెద్ద కాపుకు స్వప్నంలో సాక్షాత్కరించి ఒక దేవాలయం నిర్మించి తనను అందులో ప్రతిష్ఠించి, పూజించుమని ఆదేశించాడట. ఆప్రకారం జరిగిన తర్వాత శ్రీ వీరబ్రహ్మం ఆ వింతగాథను విని అల్లాడుపల్లెకువచ్చి వీరభద్రస్వామిని కొంతకాలం ఉపాసించి, విగ్రహారాధన ప్రభావ ప్రయోజనాలను ప్రజలకు ప్రబోధించారు.

సహజానుభవ జ్ఞాన విలాసుడు, సర్వమత సమన్వయ మూర్తి అయిన శ్రీ వీరబ్రహ్మం సిద్ధప్ప అనే మహమ్మదీయ బాలుని శిష్యునిగా అంగీకరించడంతో ఆయనవారికీ అన్యమతస్థులైన మహమ్మదీయులకూ ఆగ్రహావేశాలు కలిగాయి. అయితే మహా మహిమాభిశోభితుడైన ఆయన బోధసుధతో వారు సంతుష్టు లయ్యారు. ఈ విధంగా నిరంతర కఠోర పరిశ్రమవల్ల అతీత వ్యస్త సమస్త శక్తులను కైవసం చేసుకుని తాము అనుభవించిన ఆత్మ జ్ఞానామృతాన్ని అందరకూ అందజేసి, అనేకమైన అలౌకిక మహిమలను ప్రదర్శించిన త్రికాలజ్ఞులు శ్రీ వీరబ్రహ్మంగారి దివ్యస్మృతులతో పూతమై, కడపకు ఆగ్నేయ మూలగా 43 మైళ్ళ దూరంలోగల కందిమల్లయ్యపల్లె భక్తులు, జిజ్ఞాసులు, సద్గృహస్థులు సందర్శించదగ్గ దివ్యస్థలం.

ఒంటి మిట్ట



ఒంటి మిట్ట ధర్మ సంస్థాపనము, అధర్మ విధ్వంసనమూ సలిపే నిమిత్తం స్వయంవ్యక్తమూర్తి అయి వెలసిన శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంతో అతి పవిత్రమైన యాత్రాస్థలంగా వన్నె కెక్కింది. ఈ ప్రదేశాన్ని పురాణాలు అత్యున్నతస్థానంలో స్తుతిస్తున్నాయి. రామాయణ గాథనుబట్టి పితృవాక్య పరిపాలకుడైన శ్రీరామచంద్రుడు సీతా లక్ష్మణ సమేతుడై దుర్భర దురంత దుష్ట విచేష్టలతో మునీంద్రులను పీడిస్తున్న రాక్షసుల్ని సంహరించడానికి దండకారణ్యంలో దశ వర్షాలు నానా ఋష్యాశ్రమాలలో సంచరించాడని వ్యక్తమవుతున్నది. మృకండ్వాది మునీశ్వరులకు తావలమైన ఈ ప్రాంతంలో రాజ్యహీనుడైన రాఘవుడు కొంతకాలం నివసించాడు. ఆ విధంగా సిద్ధవటానికి 8 మైళ్ళ దూరంలోగల ఈ క్షేత్రరాజం శ్రీ సీతారామలక్ష్మణ చరణ కమల పరాగంచేత పవిత్రమయింది.

శ్రీ రఘురాముడు ఆత్మసతి అయిన సీతతోను, అడవులలో కలిగే ఆపదలు తన మనస్సులోకూడా తలపెట్టకుండా వెంబడించిన లక్ష్మణుడితోను ఈ ప్రదేశాన్ని విడిచిపెట్టి యితర ఆశ్రమాలకు బయలుదేరే తరుణంలో ఆ వియోగ భారాన్ని భరించలేక, వారి దర్శన సేవాదులు మాని జీవించలేక మునీశ్వరులంతా వెళ్లవద్దని వేడగా కరుణా సాగరుడైన శ్రీరాముడు వారికి సముచిత రీతిని నచ్చజెప్పి, సమర్చనార్థం తమ ప్రతిరూపాన్ని యిచ్చి భవిష్యత్కార్య నిర్వహణ నిమిత్తం ముందుకు సాగాడు. ఏకాక్షరంలో అక్షరత్రయం లాగా ఏక శిలలో మూడు విగ్రహాలు ఉద్భవించి భక్తాగ్రగణ్యులకు తత్వ సూచకమై వున్నాయి.

కోదండ ధరుడైన శ్రీరాముడు నృసింహ మూర్తికంటె ఉగ్రతర మూర్తి అని ఉపాసకుల తలంపు. ఆయన శరచాపాలు పట్టగా చూచి ప్రేమ స్వరూప అయిన లోకమాత సీత ఆయనకు అహింసా ధర్మం బోధించింది. తరువాత కోదండరాముడి రౌద్రాగ్నిని కొంతవరకు చల్లార్చిన వాడు ప్రసన్నాంజనేయులు. ఒంటి మిట్టలోగల ఈ కోదండ రామస్వామి, భక్తుల విషయంలో అత్యద్భుత మహిమలు ప్రదర్శించారు. అందువల్లనే ఆ మహాదేవాలయం అత్యున్నతమయింది.

అప్రతిమానభక్తి విశేషం, అనితర సామాన్య కవితా మహాత్మ్యం కల పోతనామాత్యుడు ఈ ఒంటిమిట్ట గ్రామనివాసి అని నాలుగైదు దశాబ్దాల క్రితం ఒక వాదం పొడసూపి బహుముఖాల విస్తరిల్లింది. భక్తిలో పుట్టి, భక్తిలో పెరిగి, భక్తి రస సిద్ధుడైన మహనీయుడు పోతన "వరంగల్ వాడా? ఒంటిమిట్టవాడా?" అనే వాదవివాదాలు చెలరేగాయి. ఏది ఏమైనప్పటికీ ఒంటి మిట్ట వాదులలో ఉత్తమోత్తములూ, మహా భక్తులూ ఆంధ్ర రామాయణకర్త, ఆంధ్ర వాల్మీకి అయిన శ్రీ వావిలికొలను సుబ్బారావుగారి సేవా విశేషంవల్ల శిల్పనిర్మాణ సౌందర్యంలో ప్రఖ్యాతి వహించిన కోదండ రామాలయం కొంతవరకూ జీర్ణావస్థనుంచి ఉద్ధరితమై జీవకళలతో విరాజిల్లుతున్నది. ఇచ్చటి పరిసర ప్రదేశాలు ప్రకృతి సౌందర్య శోభితాలై చూపరులకు ఆనందం కలుగజేస్తాయి. భక్తిరసోద్బోధకమైన ఈ దేవాలయంలోగల శ్రీరామచంద్రుని దర్శించి సేవించి భజించి అర్చించి ఉపాసించి అనేకమంది భక్తులు అనునిత్యం ధన్యులవుతున్నారు.

★

WHAT'S CHARMINAR GOT THAT NO OTHER INDIAN CIGARETTE HAS?

WORLD CLASS.

THAT'S WHAT!



Among the world's top 20 cigarettes, India's billion-seller has **what it takes** to give *real* smoking pleasure. The secret is in its tobaccos. They're **deep** brown...rich. Just like the tobaccos in the world's ten most popular **brands.** Remember, Charminar tobaccos are specially developed. And, triple **matured.** They give every Charminar a flavour that's rich...a taste that's unique. **If you** smoke Charminar, you know what we're talking about. If you don't, **find out** for yourself—*today!*

There's nothing like Charminar—India's greatest cigarette!

A VAZIR SULTAN PRODUCT

CMVS-14

సీరియల్

గృహిణి

పిలకా గణపతి శాస్త్రి

> **జరిగిన కథ**
>
> పార్థసారథికి నాటకాలపిచ్చి, రాత్రిళ్ళు మరీ ఆలస్యం వచ్చేవాడు. భార్యఆరోజున కాస్త కోపంగా మాట్లాడేసరికి, తింటూ తింటూన్న అన్నం వదిలేసి లేచి వెళ్ళిపోయాడు పార్థసారథి.

విజయలక్ష్మి తండ్రి వెంకటేశ్వరరావు మధ్య తరగతికి చెందిన సామాన్య సంసారి. అతనికిద్దరాడపిల్లలు. ముగ్గురు మగపిల్లలు. విజయలక్ష్మి అందరికన్న పెద్ద, కమల అందరికన్న చిన్న. వెంకటేశ్వరరావు బి. ఎ. పాసయి, ఎల్. టి. పూర్తి చేసి గవర్నమెంటు హైస్కూలులో ఒక చిన్న అసిస్టెంటుగా కుదురుకున్నాడు. ఆతరువాత అతనికి క్రమక్రమంగా విద్యాశాఖలో డిప్యూటీ ఇనస్పెక్టరు ఉద్యోగంకూడా దొరికింది.

ఆ విధంగా పై మెట్టు ఎక్కిన తర్వాత అతనికెంతో ఉత్సాహం కలిగింది. ఇక సీనియర్ డిప్యూటీ ఇనస్పెక్టరుగిరి ఒక్కటే గట్టి అడ్డుగా నిలబడింది. అదిదాటితే డి.ఇ.ఒ. ప్రమోషన్ అంతకష్టం కాదని, గవర్నమెంటు ఉద్యోగం కనక అధికారుల ఆగ్రహానుగ్రహము లంతగాపని చెయ్యవని అతడనుకున్నాడు. మరి కొన్నేళ్ళు గడిచిన తరవాత, ఎట్టకేలకొక పెద్దమెట్టు పైకెక్కి సీనియర్ డిప్యూటీ అనిపించుకున్నాడు.

ఇక డి.ఇ.ఒ. మెట్టు ఒక్కటే మిగిలింది. అది ఎక్కబోయేతరుణంలో ఉద్యోగాల వైకుంఠపాళీ ఆటలో అకస్మాత్తుగా అతని నొక పెద్ద పాము బాగా నోరు తెరిచి గట్టిగా కాటు వేసింది! అతనిని కాదని ఆప్రమోషన్ ఇంకొకరికిచ్చారు. వెంకటేశ్వరరావుకి ఒక్కమారుగా పిడుగు మొత్తినట్టనిపించింది. దానితో అతను బాగా కుంగిపోయాడు!

అతని ఆశాభంగానికి అనేకులేమేమో కారణాలు చెబుతారు. ఆ విమర్శన చాలా వరకు నిజమే. వెంకటేశ్వర రావుకి ఉద్యోగాలలో చరచరా పైకి వెళ్ళడానికి కావలిసిన చాకచక్యాలేవీలేవు. అదీగాక అతనికి వేర్వేరు విషయాలలో గట్టి స్వతంత్రాభిప్రాయాలు కొన్ని ఉన్నాయి. అయినప్పుడు కానప్పుడు అవి పై అధికారుల సమక్షంలో బాహాటంగా వెల్లడిస్తూ ఉంటాడు. వారికా ధోరణి బొత్తిగా నచ్చదని అతనికి తెలియదు. ఆపైన ఇచ్చకాలు, మొదలయిన హంగు లతనికి సరిపడవనడం కన్నా సహజంగా చేతకావనడమే న్యాయం!

తలవని తలంపుగా విరుచుక పడిన ఆ ఆశాభంగంతో తనకి చాలా అన్యాయం జరిగిపోయిందని డిప్యూటీ డైరెక్టరికి, డైరెక్టరికి అర్జీలు పెట్టుకున్నాడు. ఆ ఉద్యోగం న్యాయంగా తనకే రావాలని నెత్తీ, నోరు బాదుకున్నాడు. కాని సరి అయిన సమాధానాలు కూడా రాలేదు.

ఏది ఏమయితేనేం, ఆ ఉద్యోగంమీద చాలా కాలంనించి అతడు పెట్టుకున్న ఆశ కాస్తా అడుగంటింది. మరి కొంత కాలానికి గవర్నమెంటు ఉద్యోగాలకన్న ప్రైవేటు ఉద్యోగాలే నయం! అని తీర్మానించుకొని కొంతవరకు సంతృప్తి పడ్డాడు. కాని జీవితానికంతటికి ఏకైక లక్ష్యమయిన ఆ ఉద్యోగం కాస్తా ఇంకొక వ్యక్తి తన్నుకొని పోయేసరికి అతనికి బ్రతుకంతా పూర్తిగా విషమయంగా కనిపించింది.

అప్పటికి వెంకటేశ్వర రావుకి యాభై ఏళ్ళునిండాయి. మొత్తంమీద అతనిది స్థూల శరీరం, కొంచెంపొట్టి, చామనఛాయ. కళ్లు పెద్దవేకాని, మాంద్యము, స్తబ్ధత సదా పాపలలో ప్రతిఫలిస్తూంటాయి. ఏళ్లు పైబడి సంసారభారం పెరిగిన కొద్దీ ముఖంలో కొంత నైరాశ్యంకూడా స్థిరపడింది. పలచ బడిన క్రాపింగులో తెల్ల వెంట్రుకల పాలెక్కువయింది. క్రమక్రమంగా కళ్లద్దాల అంతస్తు పెరిగింది.

పెద్దపిల్ల విజయలక్ష్మి పెళ్ళి సంగతి అతనెప్పుడూ గట్టిగా పట్టించుకోలేదు. దానికొక కారణం కలిసి వచ్చింది. వెంకటేశ్వరరావు పెద్ద మేనల్లుడు కృష్ణమూర్తిని చిన్నప్పటినించి ఇంట్లోనే అట్టే పెట్టుకొని చదువు చెప్పించాడు. మరి కొంతకాలం గడిచిన తరవాత అతనికే విజయలక్ష్మినిచ్చి పెళ్ళి చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

పాపం, కృష్ణమూర్తి తండ్రికి స్కూలు ఫైనలు దాకా చదువు చెప్పించే తాహతుకూడా లేకపోయింది. ఆపరిస్థితుల్లో మేనమామకి అతనిమీద అభిమానం కలగడానికి కుమార్తె వివాహ సమస్యకూడా ఒక ప్రధాన కారణమే. కృష్ణమూర్తి చదువుమీద బాగా శ్రద్ధపట్టి ఒక్క ఏడాది తప్పకుండా క్రమక్రమంగా బి. ఎ. పాసయ్యాడు. కాని అదేమి పాపమో గాని ఎన్నెన్ని విధాల ప్రయత్నించినా అతనికెక్కడా చిన్న

ఉద్యోగంకూడా దొరకలేదు. అయినా వెంకటేశ్వరరావు నిరుత్సాహపడలేదు. కాలంకలిసి వస్తే ఎక్కడయినా కాస్తమంచి ఉద్యోగం దొరక్కపోదని సమాధాన పడ్డాడు.

కృష్ణమూర్తి ఒక్క రవ్వ పొడగరి. సన్నగా సళాకులా గుంటాడు. శరీర ఛ్ఛాయ నలుపే అయినా నేరేడుపండులా నిగనిగ లాడుతుంటుంది. చక్కని కన్ను ముక్కు తీరున్న ముఖం. కళ్లు కలకల లాడుతుంటాయి. అందుచేత అతని యెడల అనాకారి అన్నమాట పుట్టలేదు. తల్లిదండ్రుల పేదరికంతో జీవితం చేదువిషంగా తయారవడంవల్ల ఊహా ప్రపంచంలో విహరిస్తూండడం కృష్ణమూర్తి కొక పరిపాటిగా, అలవాటుగా పరిణమించింది.

విజయలక్ష్మిని అతనికిచ్చి పెళ్లి చేస్తే కట్నకానుకల బెడద తప్పిపోగలదని వెంకటేశ్వరరావు ఎంతయినా ఉబలాట పడ్డాడు. ఆ మాటే ఒకసారి భార్యతో ప్రస్తావించాడు. ఆమె మొట్టమొదట విననట్టు మాట్లాడుకూరుకుంది. మళ్లీ ఇంకొకసారి కదిపినప్పుడు 'చాలుచాలు లెండి!. అతనికి మన పిల్లనిస్తే కాకిముక్కుకి దొండపండు కట్టినట్టుందని నలుగురూ విరగబడినవ్వరూ?' అని రుసరుస లారంభించింది.

వెంకటేశ్వరరావు భార్య రుక్మిణమ్మకి మేనల్లుడంటే సరిపడక పోవడానికి అనేక కారణాలున్నాయి. కృష్ణమూర్తి తల్లి ఆమె పెద్ద ఆడబడుచు. కాపరానికి వచ్చిన కొత్తలో ఆవిడ రుక్మిణిని చీటికి మాటకి రాసి రంపానపెట్టింది. అయిన దానికి కాని దానికి పురుగుని ఏరినట్టు తీసిపార వేసింది. అప్పటి నించి వారిద్దర మధ్య పచ్చిగడ్డి వేస్తే బగ్గుమని మండింది. ఎడతెగని వైమనస్యాగ్ని రాజుకుంది. ఆనాటి కానాటి కది ఇంకా రగులుకొన్నదే కాని కొంచెమయినా శాంతించలేదు. రుక్మిణమ్మకి కృష్ణమూర్తి అంటే ఇష్టం లేక పోవడానికదే ప్రధాన కారణం. ఆపైన అతనికి ఆస్తిపాస్తు లేవిలేవు. అదే గాక మేనల్లుడి ఒంటినలుపు ఆ ఇల్లాలికి బొత్తిగా సరిపడలేదు. ఆమె దృష్టిలో విజయలక్ష్మి బంగారపు బొమ్మ! అందాల బరిణె! అందుచేత ఆ అమ్మాయిని కృష్ణమూర్తికివ్వడాని కెంత మాత్రము అంగీకరించలేదు!

విజయలక్ష్మి తల్లిఅనుకున్నంత గొప్ప అందకత్తె కాక పోయినా నిజానికి చక్కని చుక్క! చిన్ననాటినించి ఆ పిల్ల ఎంతో అల్లారు ముద్దుగా పెరిగింది. వర్ధనమ్మ తన పెద్ద మనవరాలి నెన్నడు ఒక్కక్షణమయినా కిందఅడుగు పెట్టనీయ లేదు. విజయలక్ష్మి నవ్వినప్పుడల్లా చెక్కిళ్లమీద చిన్న చిన్న సొట్టలుపడి సుళ్లు తిరుగుతాయి. గుండ్రని సోగకళ్లు, పచ్చి పసుపురంగుతో మేళవించిన తెల్లని శరీరచ్ఛాయ, మొత్తంమీద విజయలక్ష్మికి తల్లి పోలికే గాని తండ్రి పోలిక రాలేదు. కనకనే రవంత పుష్టిగా పొడుగ్గా పెరిగింది. స్కూల్లో చదివినంత కాలము మంచి తెలివయిన పిల్ల అన్న పేరు తెచ్చుకుంది. అయితే ఆ రోజుల్లో ఆమె అల్లరికి, చిలిపితనానికి ఎక్కడా పట్టపగ్గాలుండేవికావు. కొంచెం జ్ఞానం వచ్చిన తరవాత ఆ దుందుడుకు ధోరణి తగ్గింది. క్రమక్రమంగా చదువుమీద శ్రద్ధ పెరిగింది.

భార్య వ్యతిరేకించినంతమాత్రాన కుమార్తె వివాహ వ్యవహారంలో వెంకటేశ్వరరావు తన సంకల్పం విరమించలేదు. కాని తిరిగి ఇంకొకసారి ఆ ప్రస్తావన వచ్చినప్పుడు రుక్మిణి కాదుకూడదని పెడముఖం పెట్టుకుని కూర్చుంది. ఆమొండి పట్టుదల గమనించి అతడెంతో చిరాకు పడ్డాడు. కాని కొంచెం తమాయించుకుని నెమ్మదిగా నసిగాడు.—

"అయితే పైవాళ్ళకి కట్నకానుక లెక్కడినించి గుమ్మరించగలం?"

అయినా ఆమె ఎక్కడా చెక్కు చెదరలేదు.

"అఁ! పిల్ల పెళ్లికి ఇప్పుడంత తొందర ఏమి వచ్చింది? నిక్షేపంగా చదువుకుంటూందిగదా! కాస్త స్కూలు ఫైనలు దాకానయినా చదివించండి! తరవాత అప్పటిమాట చూసు కుందాం లెండి!"

దానితో అతనికి పచ్చివెలక్కాయ గొంతున చిక్కు పడ్డట్టయింది. మొదటి నించి కుమార్తెకంతవరకుకూడా చదువు చెప్పించాలని అత డనుకోలేదు. ఆడపిల్లల చదువు సంధ్యలమీద అతని కంతగా పట్టింపులేదు. అదేగాక చదివించి నంత మాత్రాన పెళ్లి వ్యవహారం తేలికగా పరిష్కారంకాదు. పైగా మరింతగా కొండపైకెక్కి కూర్చుంటుంది. ఆడపిల్ల అన్న తరువాత ఎప్పటికయినా ఒక అయ్య చేతిలో పెట్ట వలసినదే కదా! చదువుకున్నంత మాత్రాన కట్నకానుక లేవి తగ్గవు! అధమం రెండు మూడు వేలయినా గుమ్మరిస్తేనే కాని సామాన్య సంబంధం కుదరడంకూడా కష్టమే! అతని దగ్గర ఆ మాత్రం తాహతుకూడా లేదు! ఏ నెల కానెల గడిచి గట్టెక్కడమే గగనమయి పోతూంది! ఒక్క సారిగా అంత సొమ్మెక్కడ నించి తేగలడు? అందుచేత విజయలక్ష్మిని కృష్ణమూర్తికే ఇచ్చి పెళ్లిచెయ్యాలని గట్టిగా నిశ్చయించు కున్నాడు.

అతని నిర్ణయం బలపడుతున్న కొద్ది రుక్మిణమ్మ మరింతగా భీష్మించుకొని కూర్చుంది. ఆనాటికానాటికి భార్యా భర్త లిద్దరి మధ్య కుమార్తె వివాహ వ్యవహారంలో గొడవలెక్కు వయ్యాయి. కృష్ణమూర్తికి పిల్లనివ్వాలని నిశ్చయించిన పక్షంలో కుమార్తెతో బాటు హరహరా అని అమాంతంగా పెరటిలో పెద్ద బావిలో దూకగలనని రుక్మిణమ్మ సన్నసన్నగా రాగా లారంభించింది.

అలాగా మరి కొన్నాళ్ళపాటు రభస చెలరేగిన తరువాత వర్ధనమ్మ అల్లుడు కొక చక్కని సలహా చెప్పింది. ఆమె దగ్గర పుట్టింటి వాళ్ళిచ్చిన స్త్రీధనం రొక్కం ఏడెనిమిది వేలదాకా మిగిలింది. పోనీ దానిలో అయిదారు వేలయినా ఖర్చుచేసి విజయలక్ష్మి కెక్కడయినా కొంచెం మంచి సంబంధం చూడవలిసిందని బలవంతం చేసింది. వర్ధనమ్మ కిక కావలిసిన వాళ్ళెవళ్ళూ లేనిమాట నిజమే. కాని కాశీరామేశ్వరాల యాత్రలకని ఆసొమ్ము ఎంతో భద్రంగా బ్యాంక్‌లో దాచుకుంది. అవసరం వచ్చినప్పుడు ఆవిడ అడపా తడపా తను కుటుంబానికి సాయం చేస్తూనే ఉంది. అలాంటప్పుడు తీర్థయాత్రలకని జాగ్రత్త చేసుకున్న ఆ సొమ్ము వెంకటేశ్వర రావు ఎలాగ తీసుకోగలడు? అందు చేతనే అతడా మాటే చెవికెక్కనీయ లేదు. కాని కాదుకూడదని అత్తగారు మాటి మాటికి బలవంతం చేస్తున్నప్పుడిక కాదనలేకపోయాడు.

పాపం! ఆ నిర్ణయంతో కృష్ణమూర్తి నిలువునా దిగాలు పడ్డాడు. విజయలక్ష్మి, అతనూ చిన్నతనంలో కలిసి మెలిసి ఆడుకున్నారు. అదీగాక ఆ అమ్మాయి రూపసి. చాలా తెలివైనపిల్ల. అందుచేత కృష్ణమూర్తి విజయలక్ష్మినే వివాహమాడాలని ఎంతయినా ఉబలాటపడ్డాడు. మేనమామ కూడా అతనిపక్షం వహించి శాయశక్తులా ప్రయత్నించాడు. కాని ఏంలాభం? ముసలావిడ, మేనత్త మరి తనమాటే తలపెట్టనీయలేదు. చిట్టచివరికొకసారి అతని తల్లిదండ్రులిద్దరు కూడా ఆ వివాహం సంగతి కొంచెం కుండబద్దలు కొట్టినట్టుగానే కదిపి చూశారు. కాని వెంకటేశ్వర రావు దానికేవిధంగాను సమాధానం చెప్పలేదు. తనకేమి పట్టనట్టు మాట్లాడకూరుకున్నాడు. కృష్ణమూర్తి మరి లాభం లేదని నిరాశ చేసుకున్నాడు. పోనీ తన మూలాన బయలుదేరిన ఆ ఇంటి రభస ఆ విధంగా నయినా శాంతించ గలదని కొంత వరకు సమాధాన పడ్డాడు.

విజయలక్ష్మికప్పటికే పదిహేనేళ్లు నిండాయి. అయినా ఆ అమ్మాయి ఇష్టా నిష్టాల గొడవ ఆ ఇంట్లో ఎవరు అంతగా ఆలోచించలేదు. రుక్మిణి, వర్ధనమ్మ విజయలక్ష్మికి లోలోపల కృష్ణమూర్తి అంటే కొంత ఇష్టం లేకపోలేదని పసికట్టారు. క్రమ క్రమంగా అది ఒక అనుబంధంగా పరిణమించగలదేమో అనికూడా భయపడ్డారు. కనకనే పిల్లకి త్వరగా పెళ్ళిచెయ్యవలసిందని వెంకటేశ్వరరావుని బాగా తొందర పెట్టారు.

అతడంతకు మునుపే కొంతకాలంక్రితం కుమార్తెనెంతో ఆప్యాయంగా దగ్గరికి పిలిచి 'ఏమే విజయా! బావని పెళ్ళిచేసుకుంటావటే!' అని అడిగాడు. అప్పటికి విజయలక్ష్మికింకా పట్టుమని పన్నెండేళ్ళయినా నిండలేదు. అయినా వల్లమాలిన సిగ్గుతో నిమిడిపోయి. 'పో! నాన్నా!' అని ఒక్క అంగలో వంట ఇంట్లోకి పారిపోయింది. వెంటనే రుక్మిణి అక్కడికి వచ్చి అందుకుంది.



'అదేమిటండీ! అలాగడుగుతారు! ముక్కు పచ్చలారని పసి పిల్ల. దానికేమి తెలుస్తుంది! మనమే మంచి చెడ్డలుచూసి ఆలోచించుకోవాలిగాని! తనకిష్టం లేకపోతే మాత్రం రాక్షాయించి చెబుతుందా ఏమిటి?'

భార్య ఆంతర్యం గ్రహించడానికి వెంకటేశ్వరరావు కెంతోసేపు పట్టలేదు. బాగా చిరాకు పడుతూ 'పసిపిల్లే అయినా గట్టిగా నూరిపోస్తే తనకిష్టంలేదనే చెబుతుందితే!' అని దురుసుగా అక్కడినించి వెళ్ళి పోయాడు.

ఇక పై సంబంధాలు చూడక తప్పనిపరిస్థితి ఏర్పడిన తర్వాత వెంకటేశ్వరరావు వరాన్వేషణ కోసం కాళ్ళకి బలపాలు కట్టుకుని తిరిగాడు. మరి కొంత కాలం దాకా భార్యకి, అత్తగారికి అన్నివిధాల నచ్చిన చక్కని సంబంధం ఏదీ కుదరలేదు.

కాని తలవని తలంపుగా ఒకనాడు పార్థసారథి సంగతి తెలిసింది. అప్పటికి అతని తల్లి దండ్రులింకా జీవించే ఉన్నారు. కట్నానికని నాలుగు వేలు, మిగిలిన లాంఛనాలకని ఇంకొక రెండు వేలు గుమ్మరించక తప్పలేదు. ఆ తరవాత వివాహం అంతా సలక్షణంగా అయిదు రోజులపాటు ఎంతో వైభవంగా జరిగిపోయింది. కొన్ని కొన్ని మర్యాదలేమీ తిన్నగా జరగ లేదని మగపెళ్లివారి బంధువులు, ఆడపెళ్లివారి ఆత్మీయులు అప్పుడప్పుడు పోట్లాడుకున్నారు గాని, మొత్తంమీద వియ్యాం కులిద్దరి మధ్య పెద్ద తగాదా లేవి బయలు దేరలేదు. అయితే అల్లుడి అలకపానుపు ముచ్చట మాత్రం అంత సంతృప్తి కరంగా పరిష్కారం కాలేదు.

రుక్మిణమ్మ, వర్ధనమ్మలకే, గాక బంధువులకందరికి ఆ కొత్త సంబంధం బాగా నచ్చింది. అందచందాలలో పార్థసారథి విజయలక్ష్మికన్నివిధాల తగినవాడే గాని ఏ మాత్రము తీసి పోడు. ఇరుగు పొరుగమ్మ లందరు ఆపిల్ల ఎంతో అదృష్టవంతు రాలని మెచ్చుకున్నారు. పార్థసారథి బంగారు పిచ్చుక. ఇంచు మించుగా ఇరవై ఆయిదు ఎకరాల మాగాణీ సుక్షేత్ర ఖండిక కధికారి. ఒక చిన్న మేడ,ఇంకో రెండు పెద్ద పెంకుటిళ్లు కూడా ఉన్నాయి. అతని తండ్రి పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటు గిరీ చలాయించిబ్యాంకులో పాతిక వేలదాకా నిలవ చేశాడు.

పార్థసారథికిక అన్నదమ్ములెవళ్లు లేరు. అక్క చెల్లెళ్లు ఇద్దరున్నారు గాని దూరంగా ఉన్న ఊళ్లలో చాలా కాలం నించి అత్తవారిళ్లల్లో వాళ్ల కాపరాలు వాళ్లు చేసుకుంటు న్నారు. పార్థధారథికి ఆడపిల్లల తండ్రి దండ్రుల బలపించే శుభలక్షణాలన్ని చక్కగా అమరి ఉన్నాయి. కాని చదువే అంతగా అంటలేదు. తండ్రి బలవంతం మీద స్కూల్ ఫైనల్ రెండుమూడేళ్లు దాకా పొడిగించాడు. కాని ఫలితం కనబడ లేదు. దానితో అతని విద్యాభ్యాసం ముగిసింది. బాగా ఆస్తి పాస్తులుండడ వల్ల ఎవ్వరికి అది ఒక ఎన్నదగ్గలోపంగా కని పించలేదు. పార్థసారథి కంతకన్న పెద్ద పెద్ద కట్నాలతోనే సంబంధాలు వచ్చాయి. కాని అతని తండ్రి విజయలక్ష్మి చక్క దనము, వెంకటేశ్వరరావు కుటుంబం సత్సంప్రదాయము గుర్తించి చిట్టచివరికి ఆ సంబంధమే నిశ్చయించాడు.

పెళ్లి అయిన తరువాత సొట్టలు పడిన చెక్కిలి మీది చిరుచుక్కతో, కాటుకతో మరింత కొనలు దేరిన గుండ్రని సోగ కండ్లతో, కళ్యాణ తిలకంతో పసుపు బట్టలతో కలకల లాడుతున్న విజయలక్ష్మికేసిచూసి వర్ధనమ్మ ఎంతయినా మురిసిపోయింది! దిష్టితీసి చిరుసిగ్గుతో ఎర్రబడిన మనుమరాలి మొఖంపైకెత్తి ముద్దుపెట్టుకొని ఒళ్లో కూర్చోపెట్టుకుంది. నా బంగారు తల్లి ఎంతో అదృష్టవంతురాలమ్మా! పూర్వజన్మలో చేసుకున్న పుణ్యంకొద్ది మణిపూసలాంటి పెనిమిటి దొరికాడు! చిన్నప్పటినుంచి దీనికేలాంటి సంబంధం వస్తుందో అని ఎంతో బెంగపెట్టుకున్నాను! ఆ చల్లని తల్లి దయవల్ల అన్ని విధాలా మంచి సంబంధమే దొరికింది! అని ఎంతో ఉప్పొంగిపోయింది.

తిరిగి. తలవంచుకున్న విజయలక్ష్మిముఖం పైకెత్తి ఉసూరుమని నిట్టూర్చి, 'ఏమే! అమ్మడూ! అప్పుడే అత్తవా రింటికి వెళ్ళిపోతావటే!' అని డగ్గుత్తికతో కంటనీరుపెట్టుకుంది. ఆ ప్రక్కనే కూర్చున్న ఇంకొక ముసలావిడ అది గమనించి అయ్యో! ఇదేమిటమ్మా! ఇలాగు బెంబేలు పడిపోతావు! ఆడపిల్ల అయిన తరువాత అత్తవారింటికెళ్ళకుండా ఉండి పోతుందా వదినా! తప్పమ్మా! పెళ్ళి ఇంట్లో కన్నీటి బొట్టు కిందపడకూడదు! అని మాటి మాటికి ఓదార్చిన పిమ్మట కళ్లు తుడుచుకొని క్రమ క్రమంగా శాంతించింది.

x x x

నాటకం ముగిసిన తరవాత పార్థసారథి తెల్లవార కుండానే తిరిగివచ్చి వీధిగుమ్మం తలుపు రెండు మూడు సారులు గట్టిగా తట్టాడు. ఆ అలికిడి విని వర్ధనమ్మలేచి వచ్చింది. పార్థసారథి తిన్నగా పడక గదిలోకి వెళ్ళి పందిరి పట్టి మంచం మీద పడుకున్నాడు. విజయలక్ష్మి వేరొక మంచంమీద పసి పిల్లతో బాటు ఆదమరచి నిద్రిస్తున్నది. సన్నినదీపంవెలుగులో నిద్రాముద్రితమైన భార్య ముఖం పరిశీలించి అతడు రవంత సేపు ఆలోచనలో పడ్డాడు. గతరాత్రి తానావిధంగా దురుసుగా అన్నం తో వేసి వీధిలోకి వెళ్ళిపోయిన విషయం తలుచుకుంటే పార్థసారథికి కొంచెం పశ్చాత్తాపం కలగకపోలేదు.

అయితే అయినదానికి, కాని దానికి, అస్తమానము లేనిపోనిగొడవ లేవదీస్తే ఎలాగ? నాటకం రిహార్సల్ అన్నతర వాత నలుగురు రాకపోతే ఎలాగ సాగుతుంది? అన్నీ సరిగ్గా మనము అనుకున్నట్టే జరుగుతాయా? అని ఆలోచించుకొని సమాధానపడ్డాడు. మరి కొంత సేపటికతనికి గాఢంగా నిద్ర పట్టింది. అప్పటికి గడియారం నిద్రతో జోగుతున్నట్టు నెమ్మదిగా అయిదు గంటలు కొట్టింది.

విజయలక్ష్మికి అతడు లోపలికి వచ్చినట్టే తెలియదు. కాని ఆ తరవాత పసిపిల్ల పాలకేడ్చినప్పుడు కళ్ళునులుము కుంటూ లేచి భర్త పందిరి పట్టె మంచంమీద నిద్రపోతున్నట్టు గమనించింది. మరి కొంత సేపలాగే అతని వైపుచూచి ఉసూరు మని నిట్టూర్చింది. ఏలాంటి మనిషి ఎలాగ మారిపోయారూ! అనుకుని మేలుకున్న పసిపాపని నెమ్మదిగా జోకొట్టింది. ఆసమ యంలో విజయలక్ష్మికి చాలాకాలం క్రితం పుట్టింట ఉన్నప్పుడు జరిగిన సంఘటన ఒకటి జ్ఞాపకానికి వచ్చింది.

అప్పటి కామె కాపురానికి వెళ్ళి ఇంచుమించుగా అయి దారు నెలలకన్న ఎక్కువకాలేదు. ఆ తరవాత సంక్రాంతిపండు గలకని తిరిగి పుట్టింటికి వెళ్ళడం జరిగింది. కాని పదిపదిహేను రోజులయినా గడవకమునుపే పార్థసారథి, తల్లివంట్లో బొత్తిగా బాగుండడంలేదని వెంటనే విజయక్ష్మిని దిగబెట్టవలసిందని మామగారిపేర ఉత్తరం వ్రాశాడు. ఆ జాబు చదువుకొని వెంకటేశ్వరరావు ఎంతో ఆశ్చర్యపడ్డాడు. కోడలిని పంపించవలసినదని, కోరవలసినది వియ్యంకుడు! అది కుటుంబ మర్యాద. అంతేగాని తానై స్వతంత్రించి అల్లుడలాగ

ప్రాయడం భావ్యంకాదు. అయినా, పిల్ల బొమ్మలనోము పట్ట బోతున్నట్టు, అది ముగిసిన మరునాడే పంపించివేస్తున్నట్టు, వెంటనే వియ్యంకుడి పేర ఉత్తరం రాశాడు. కాని దానికి సమాధానమేమీ రాలేదు. ఒక వేళ ఊళ్ళో లేరేమో! క్యాంపులో ఉన్నారేమో! అనుకొని కొంతవరకు సంతృప్తి పడ్డాడు. తిరిగి ఆ మరునాడే వెంటనే విజయలక్ష్మిని పంపించ వలసినదని పార్థసారథి దగ్గరనుంచి ఇంకొక జాబువచ్చింది.

ఈ సారి మరిబాగుండదని తిన్నగా అల్లుడి పేరే సమాధానం రాశాడు. సంక్రాతికి తప్పక రావలసినదని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు. మనవరాలిచేత బొమ్మలనోము పట్టించాలని అత్తగారు ఎంతోకాలంనుంచి ముచ్చట పడుతున్నట్టు ప్రస్తావించాడు. అది అయిపోయిన మరునాడే తప్పక పంపించివెయ్యగలనని మాట ఇచ్చాడు. అంతవరకు మరి కొన్నాళ్ళపాటు ఓపిక పట్టవలసినదని మృదువుగా బ్రతిమాలుకున్నాడు.

కాని దానికికుడా ప్రత్యుత్తరం రాలేదు. అంతేకాదు అసలు సంక్రాంతికి అల్లుడు అత్తవారింట అడుగేపెట్టలేదు! దానికి ఇంటిల్లిపాది ఎంతోనొచ్చుకున్నారు. ఇరుగు పొరుగమ్మలు ఆసంగతి ఒక పెద్ద విడ్డూరంగా చెప్పుకున్నారు. పాపం. ప్రత్యేకించి వెంకటేశ్వరరావు ఎంతయినా ఖిన్నుడయినాడు. 'ఒక వేళ వియ్యపురాలి ఆరోగ్యం బాగా అధ్వాన్నమయిందేమో!' అనుకుని ఆత్రపడ్డాడు.

వెనువెంటనే ఆమె ఆరోగ్యం సంగతి తెలియజేయ వలసినదని అల్లుడిపేర వియ్యంకుడిపేర వేర్వేరుగా రెండు ఉత్తరాలు రాశాడు. నాలుగయిదు రోజులు గడిచినా వాటికికూడా సమాధానాలు రాలేదు! దానితో వెంకటేశ్వరరావు మరింత కంగారుపడ్డాడు.

మరుచటి రోజున పార్థసారథి దగ్గరనించి ఒక అర్జెంటు టెలిగ్రామ్ వచ్చింది. దానిలో తానా మరునాడు సాయంకాలానికి వస్తున్నానని, విజయలక్ష్మిని ప్రయాణానికి సిద్ధంగా ఉంచమని తెలియజేశాడు. అంతేగాని తల్లి ఆరోగ్యం సంగతే ప్రస్తావించలేదు.

ఆ మరునాటి సాయంకాలం దీపాలవేళ పార్థసారథి గుర్రపుబండిదిగి గుమ్మంలో అడుగుపెట్టాడు. అందరూ అతనిని ఎంతో ఆత్మీయంగా ఆదరించారు వెంకటేశ్వరరావు అల్లుడుగుమ్మంలో అడుగుపెట్టగానే ఉట్టిపడుతున్న ఆత్రంతో ప్రశ్నించాడు. 'అక్కగారికి ఒంట్లో బాగానింపాదిగా ఉందా? నాయనా!'

'నింపాదిగానే ఉందిగాని ఇంకా నీరసంతగ్గలేదు'.

'ఓహో అలాగా! మీ నాయనగారు కాంపునించి తిరిగి వచ్చారా?

'ఆఁ వచ్చారు.'

పార్థసారథి ఇలాగా ముభావంగా ప్రత్యుత్తరాలిచ్చాడు. అల్లుడిధోరణి మామగారికెంతో విడ్డూరంగా కనబడింది. భోజనాల సమయంలో పార్థసారథి మరునాడు భార్యని వెంటబెట్టుకు పోతున్నట్టు వెల్లడించాడు. వెంకటేశ్వరరావు దానికే విధంగాను ప్రతిసమాధానం చెప్పలేదు. విజయలక్ష్మి బొమ్మల నోముపట్టి పట్టుమని నాలుగురోజులయినా కాలేదు. అది మధ్యలో మానివెయ్యడం బొత్తిగా కూడనిపని. ఆ పైన పార్థసారథి వియ్యపురాలికి కొంచెంనింపాదిగా ఉన్నట్టు మాట్లాడుతున్నాడు. పోనీబొమ్మలనోము పూర్తి అయిన తరువాత తీసుకు వెళ్ళకూడదా? అంత నిలుచున్నపాటుగా కాళ్ళకింద నిప్పులు పొయ్యవలసినంత అగత్యం ఏమివచ్చింది? అంతగా అవసరమయితే దగ్గరబంధువుల నెవరినయినా వారం పదిరోజుల పాటు ఇంట్లో అట్టేబెట్టుకోకూడదా? అదికుదరకపోతే పోనీ కొన్నాళ్ళపాటువంటలక్క నెవరినయినా కుదుర్చుకోకూడదా? నిలుచున్నపాటుగా విజయలక్ష్మిని వెంట బట్టుకుని పోవలసినంత ఫుట్టిమునక ఏమివచ్చిపడింది.

వెంకటేశ్వరరావు చాలామృదువుగా ఆ సంగతే బయట పెట్టాడు. రుక్మిణమ్మ, వర్ధనమ్మ అదేధోరణిలో వంతపాడారు. కాని పార్థసాథి ఆ మాటలేవీ తిన్నగా వినిపించుకున్నట్టే కనబడలేదు.

ఆ మరునాటి మధ్యాహ్నం భోజనం చేసినతరవాత, గుర్రపుబండికోసం కబురుపంపించమని పార్థసారథి మామగారితో అన్నాడు. వెంకటేశ్వరరావు ఇక ఏమి అనలేక కొంచం తటపటాయించాడు. ఎలాగయినా బొమ్మలనోము పూర్తిఅయ్యేదాకానయినా మనమరాలిని అట్టేబెట్టవలసిందని వర్ధనమ్మ బ్రతిమాలుకుంది. రుక్మిణమ్మ అదేమాట అందుకుని తిరిగి ఇంకొకసారి ప్రాధేయపడింది. 'చలిమిడికూడా చెయ్యలేదుగదా! ఇంత అర్ధాంతరంగా పిల్లనెలాగ పంపించగలం చెప్పునాయనా ?' అని సూటిగాఅడిగింది. కాని పార్థసారథి ఆ మాటలేవి తిన్నగా వినిపించుకోకుండానే లోనికి వెళ్లిపోయాడు ! మరికొంత సేపటికి ఒక గుర్రపు బండి రయ్యిన దూసుకొనివచ్చి వీధిలో నిలబడింది ! పార్థసారథి దానిలోనించి కిందికి దూకి తిన్నగా విజయలక్ష్మి దగ్గరికివెళ్లి బండిలో కూర్చోమనిచెప్పి ఆదరా బాదరాగా పెట్టె; బెడ్డు సర్దుకోవడం మొదలు పెట్టాడు. ఆ దురుసుతనం గమనించి వర్ధనమ్మ, రుక్మిణమ్మ నిలువునా నిర్ఘాంతపడ్డారు! వెంకటేశ్వరరావు లోలోపల బాగా చిరాకుపడ్డాడు. ఏది ఏమయినా, పిల్ల నిప్పుడు పంపించడానికి వీలులేదని నిష్కర్షగా చెప్పివేయ్యాలనికూడా నిశ్చయించుకున్నాడు ! కాని వర్ధనమ్మ అంతలోనే అతనివైఖరి కనిపెట్టి లోపలికొకసారి రావలిసిందని నెమ్మదిగా పిలిచింది. కుర్రతనంకొద్దీ అల్లుడు తొందరపడినా, మనంకూడా అలాగా తొందరపడడం మంచిదికాదని చల్లగా సలహా చెప్పింది. అది పసికట్టిన రుక్మిణమ్మకిక ఏమనడానికి పాలుపోలేదు.

(సశేషం)

ముఖ్య వార్తలు

రాష్ట్రంలో

11, జూన్ :—పరిపాలనా సంస్కరణల కమీషన్ సమావేశాలు హైదరాబాదులో ప్రారంభ మైనాయి.

18, జూన్ :—ప్రైవేటు పరిశ్రమలకు చెందిన 4వ అఖిల భారత సెమినారుకు కేంద్ర పరిశ్రమల మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

19, జూన్ :—మద్రాసు, మైసూరు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, తిరుపతిలో సమావేశ మైనారు. ఈ రాష్ట్రాలలో కరువు నివారణకు తీసుకో వాల్సిన చర్యలను గూర్చి వారు చర్చించారు.

22, జూన్ :—ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభల సంయుక్త సమావేశంలో గవర్నరు ప్రసంగించారు.

23, జూన్ :—ప్రధాన మంత్రి హైదరాబాదు, పబ్లిక్ గార్డెన్‌లోని జవహర్ బాలభవనానికి ప్రారంభోత్సవం చేశారు. ప్రధానమంత్రి, హైదరాబాదులోని కమలా నెహ్రూ బాలికల పాలిటెక్నిక్ భవనానికి ప్రారంభోత్సవం చేశారు.

24, జూన్ :—ప్రధానమంత్రి, వరంగల్లులో కాకతీయ వైద్యకళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు.

ప్రధానమంత్రి కడప చేరుకున్నారు.

25, జూన్ :—ప్రధానమంత్రి విజయవాడలో జవహర్ ఆటో నగర్‌కు శంకుస్థాపన చేశారు.

ప్రధానమంత్రి విశాఖపట్నం చేరుకున్నారు.

3, జూలై :—హైదరాబాదు ఇంజనీర్ల సంఘం 17వ వార్షిక సమావేశానికి రాష్ట్ర ఆర్థికమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

7, జూలై :—విశాఖపట్నంలో మెకానికల్ ఓర్‌హాలింగ్ ప్లాంటుకు కేంద్రపౌరవిమానయాన శాఖ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

8, జూలై :—న్యాయమూర్తి శ్రీ ఎన్. డి. కృష్ణారావు, ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.

10, జూలై :—విజయవాడలో క్రొత్త ఆటోమాటిక్ టెలిఫోన్ ఎక్చేంజికి కేంద్ర కమ్యూనికేషనుల స్టేట్ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

భారతదేశంలో

10, జూన్ :—భారత ప్రభుత్వం, జయంతి షిప్పింగ్ కంపెనీ యాజమాన్యాన్ని తన ఆధీనం చేసుకున్నది.

16, జూన్ :—బీస్‌డాం ప్రాజెక్టు నిమిత్తం యిచ్చే 33 మిలియన్ డాలర్ల అమెరికన్ ఋణానికి సంబంధించిన ఒప్పందంపై భారత, అమెరికా దేశాలు సంతకాలు చేశాయి.

17, జూన్ :—1966వ సం॥ పట్టువిరుద్ధ చర్యల (నిరోధక) ఆర్డినెన్సును రాష్ట్రపతి ప్రకటించారు.

27, జూన్ :—ఉత్తరభారత దేశంలోని ఢిల్లీ మరికొన్ని నగరాలలో భూమి కంపించింది. శ్రీ ధర్మవీర, పంజాబు గవర్నరుగా చండీఘర్‌లో ప్రమాణ స్వీకారంచేశారు.

29, జూన్ :—విద్యా విషయక కమీషన్ తమనివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించింది.

30, జూన్ :—శ్రీ జస్టిస్ కోకా సుబ్బారావు, భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా న్యూఢిల్లీలో ప్రమాణ స్వీకారంచేశారు.

3, జూలై :—ప్రధాన మంత్రి, ఆవడిలో ట్యాంకుల ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం చేశారు. ప్రధానమంత్రి త్రివేండ్రంలో చిన్నతరహా ఆయుధాల ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవంచేశారు.

5, జూలై :—పంజాబులో రాష్ట్రపతిపాలన ప్రవేశపెట్ట బడింది.

విదేశాలలో

20, జూన్ :—ప్రెసిడెంటు డిగాల్, రష్యాలో 12 రోజుల అధికార పర్యటనకై మాస్కో చేరుకున్నారు.

2, జూలై :—ఫ్రాన్సు దేశం, పసిఫిక్‌లో అటంబాంబును పరిక్షార్థం ప్రయోగించింది.

8, జూలై :—ప్రధానమంత్రి 2 రోజుల పర్యటనపై కైరో చేరుకుంది.

10, జూలై :—ఉపరాష్ట్రపతి డాక్టర్ జకీర్‌హుస్సేన్, ఆఫ్ఘానిస్థాన్‌లో 5 రోజుల సుహృద్భావ పర్యటనపై కాబుల్ చేరుకున్నారు.

ప్రధానమంత్రి బ్రియోని చేరుకున్నారు.

భారత సమైక్యభావన: తెలుగు కవిత

సి. నారాయణరెడ్డి

'ఉత్తరం యత్ సముద్రస్య
హిమాద్రేశ్చైవ దక్షిణం
వర్షం తత్ భారతం నామ
భారతీ తత్ర సంతతిః'.

విష్ణు పురాణం నిర్దేశించిన భారత దేశ భౌగోళిక స్వరూప మిది. సముద్రానికి ఉత్తరంగా హిమాద్రికి దక్షిణంగా ఉన్న దేశం భారతదేశం. ఆ దేశీయులు భారతీయులు.

'గాయంతి దేవాః ఖలు గీతకాని
ధన్యాశ్చ తే భారత భూమి భాగాః'.

భారతదేశాన్ని కీర్తిస్తూ దేవతలు గూడా గీతాల్ని ఆలపిస్తారని బ్రహ్మాండ పురాణం చెబుతుంది. మహేంద్ర మలయ సహ్యాది కులపర్వతాలు పెట్టనికోటలై వుండగా, గంగా యమునా గోదావర్యాది మహానదులు నిరంతర క్షీరధారలై ప్రవహిస్తుండగా, కాశి, మధుర, కంచిలాంటి పుణ్య క్షేత్రాలు అపవర్గానికి అపరంజి మెట్లై నిలిచి వుండగా, వేదకాలంనుంచి ఆధునిక కాలంవరకు ప్రపంచ పటంలో భద్రపీఠిమీద కొలువై వున్న దేశం భారతదేశం.

ప్రాచీన భారత సంస్కృతి యనగా స్థూలంగా వైదిక సంస్కృతియనే చెప్పాలి. వైదిక సంస్కృతి అంటే వేదాల్లో— వేదాంతాలైన ఉపనిషత్తుల్లో—ఉపనిషత్ సారమైన భగవద్గీతలో ప్రవచింపబడిన విజ్ఞానసారమే. భారతీయ సంస్కృతినీ, మతాన్నీ విడదీయటానికి వీలులేదు. ఒక్కొక్క కాలంలో తలెత్తిన ఒక్కొక్క మతంలోని సత్త్వం భారతీయ సంస్కృతి శరీరానికి పుష్టినిచ్చింది. ఇక్కడి మతాలు పేరుకెన్ని వేరుగా కనిపించినా వాటి అంతస్సూత్రమొకటే. అన్నీ ఆధ్యాత్మిక దృక్పథాన్నే ప్రతిపాదించినవి. అయితే ప్రాచీన భారతీయ సంస్కృతి వృక్షానికి మూలకందమైన హిందూమతం స్థూలంగాచూస్తే అనేక విశ్వాసాల ప్రదర్శన శాలగా, అనేక సిద్ధాంతాల కలగూరగంపగా కనిపించవచ్చు. వేదయుగంలో ఒకరకంగా, బ్రాహ్మణముల కాలంలో మరొక మాదిరిగా, బౌద్ధయుగంలో ఇంకొక తీరుగా ఈ మత తత్వం భాసించింది. శైవులు, వైష్ణవులు, శాక్తేయులు, ద్వైతులు ఈ మతాన్ని ఇచ్చవచ్చినట్టు మలచుకున్నారు. భారత దేశంలో ఎన్ని మతాలున్నవో అన్నిటికీమించి భాషలూ, వర్ణాలూ, కులాలూ వున్నవి. మతంలో, ప్రాంతంలో, వర్ణంలో, భాషలో ఎంతభిన్నత్వమున్నా, భారతజాతి అంతరంగంలో ఒకే సంస్కారం సురభిళించింది. భారతజాతి రక్తప్రసారంతో హైందవ మత సార సారణి శ్రుతికలిపి ప్రవహించింది. భిన్నత్వంలో ఏకత్వం ఈ జాతి అనాదినుంచి అవలంబిస్తున్న సంప్రదాయం. ఎన్ని దండ యాత్రలు వచ్చిపడినా, ఎన్ని అంతఃకల్లోలాలు పెల్లుబికినా, హైందవ సంస్కృతి వజ్రసంకల్పంతో వాటినెదుర్కొన్నది.

సత్యాన్వేషణమే హైందవ సంస్కృతి ప్రధానధ్యేయం. వివిధ మతాలు ఈ ధ్యేయసముపార్జనకే బయలుదేరినవి. హైందవ మతాన్ని నిర్వచించడమంటే దానిసత్యాన్వేషణ తత్త్వాన్ని విప్పిచూపడమే. నిరంతర సత్యాన్వేషణమే హైందవ మతమని, ఇదే సత్యసమ్మతమని, సత్యమే దైవమని, దేవుడులేడని అనడం విన్నాముగాని సత్యం లేదని అనడం మనమెక్కడా వినలేదని గాంధీజీ అభిప్రాయ పడినారు.

భారతీయ సంస్కృతి పౌరాతన్యం విస్మయావహమైంది. మానవజాతి చరిత్రలో తొలిఉషస్సు తొంగిచూసినప్పటినుంచే భారతందేశం ప్రపంచం నలుమూలలా తన ఆశయకాంతులను ప్రసరింపజేసింది. తన సాంస్కృతిక సామ్రాజ్యాన్ని సమస్త విశ్వంలో విస్తరింపజేసింది. ఇంతటి మహత్తర కృషిని ఈ దేశం ఎలాటి డాబూదర్పమూ లేకుండా నిశ్శబ్దంగా నిర్వహించింది. మనం చూడకుండానే, వినకుండానే ఎలాగైతే మంచుకురిసి అందమైన గులాబీ పూలను వికసింపజేస్తుందో, అలాగే భారతదేశం కూడా ప్రపంచ మత భావాలకు తాను చేయవలసిన దోహదం చేసిందని వివేకానందుడు వెల్లడించిన అభిప్రాయం భారతాత్మను చక్కగా ఆవిష్కరిస్తుంది.

ప్రాచీన భారతీయ సాహిత్యమంతా ధర్మార్థ కామమోక్షాలనే పురుషార్థాల పునాదులమీద నిర్మించబడిందే. చివరికి గీతగోవిందం లాంటి శృంగార కృతిలోగూడ మోక్షసిద్ధియే పరమలక్ష్యమని నిర్దేశింపబడింది. రామాయణం, భారతం, కాళిదాసాదుల కావ్యాలు ధర్మగోపురం మీద నిలిపిన మణిదీపాలు.

తెలుగులో కవిత్రయ భారతం ధర్మాద్వైతానికి అక్షర రూపమనే చెప్పాలి. పాలకురికి కావ్యాల్లో ఎంతటి వీరశైవం కరుళ్లెత్తినా, ప్రబంధయుగంలో ఆముక్తమాల్యదవంటి కావ్యాల్లో ఎంతగా వైష్ణవాధిక్యం కనిపించినా, ఈకృతులన్నీ భారతాత్మ అఖండ స్వరూప సముద్దీపనానికి దోహదం చేసినవె.

'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నది మన ప్రాచీన సూక్తి. ఇప్పటిదో అప్పటిదో కాదు, మనజాతీయ కవి వాల్మీకి రామాయణంలోనిది. ఈ సూక్తి ఇంతపురాతనమైనదైనా, నవ్యయుగంలో దీనికి ప్రత్యక్షర సార్థకత యేర్పడింది. భారతదేశాన్ని తల్లిగా భావించడం చిరకాలంగావున్నా, దానికి ఒక సమగ్రాకృతి యేర్పడింది 1905లో— వందే మాతరం నినాదంతో. బంకించంద్రుని కలంనుంచి వెలువడిన ''వందేమాతరం,

సుజలాం, సుఫలాం, మలయజశీతలాం, సస్యశ్యామలాం, మాతరం వందే '' అనే ఈ గీతం భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లో పైరుగాలిలా వ్యాపించింది. అన్ని భాషల్లోని కవులు భారతదేశ సమైక్య దృక్పథాన్ని గానం చేశారు. తెలుగులో గురజాడవారి దేశభక్తి గేయంలో ఈ దృక్పథం తొలిసారిగా మందహాసం చేసింది. 'దేశమును ప్రేమించుమన్నా' అనడంలోనే చెప్పుకోదగ్గ నవ్యత తొంగిచూసింది. అయితే బంకిం చంద్రుని వందే మాతరం, రవీంద్రుని 'జనగణమన', ఇక్బాల్ 'హిందూస్తాన్‌హమారా' అనే గేయాల్లాగా గురజాడవారి గేయం కేవలం భారతదేశ సంకీర్తనంతోనే ఆగిపోదు. ఇది ఒక వైపు దేశీయుల్లో జాతీయాభిమానం నూరిపోస్తూనే, ఇంకోవైపు ఎల్లలుదాటి ఎగిసిపోయి సమస్త జాతులనూ విశ్వమానవ కోటినీ పలకరిస్తుంది. ఈ గీతం 'అన్న దమ్ములవలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయ్' లాంటి పంక్తుల్లో భారతీయ సంస్కృతికి ఆయువుపట్టులైన సహనానికీ, సౌజన్యానికీ మళ్లీ ఒక మాటు వెల్లగొడుగు పట్టింది. చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్థులంతా నడవ వలెనోయ్ అంటూ_భారత సమైక్య భావనకు మారాకు తొడిగింది. గతంకంటే భవితవ్యం గొప్పదనీ, మతం కంటే మానవత్వం గొప్పదనీ భారతీయుల్ని ప్రబోధించిన మహత్తర గేయమిది.

గురజాడ వారిజాడలో నడిచినా తన విలక్షణగళాన్ని వినిపించి భారతమాతృ సమారాధన గీతాలకు సరికొత్త ఒరవడి దిద్దిన కవీంద్రులు రాయప్రోలు సుబ్బారావు గారు. వీరి 'జన్మభూమి' గేయం దేశాభిమాన కవిత్వానికి మకుటాయమైన రచన.

'ఏదేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరే మనినా
పొగడరా నీ తల్లిభూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము'

అంటూ అంకురించిన ఈ గేయంలో 'జననీ జన్మభూమిశ్చ' అన్న ప్రాచీన సూక్తిరేఖయే అగుపించినా, అంతకు ముందు ఎవ్వరందించని ప్రగాఢ చైతన్యం తొణికిసలాడింది. ఇంత స్పష్టంగా, సజీవంగా మాతృభూమిపై గల మక్కువను అంతకు పూర్వం ఎవ్వరూ గానంచేయలేదు. 'లేదురా యిటువంటి భూదేవి యెందు' అనడంలో జాతీయాభిమానం అంచులు దాటింది. భారతదేశ ప్రాచీన వైభవం, ఆధ్యాత్మికశక్తి జ్ఞప్తి కెలయించ బడినవి. పొలాల్లో రత్నాలు మొలిచినవని, వార్ధిలో ముత్యాలు పండినవని, పృథివి దివ్యౌషధులను పితికిందని, భారతదేశం సిరిసంపదలు ముక్త కంఠంతో కీర్తింపబడినవి.

'అవమాన మేలరా! అను మానమేల
భారతీయుడనంచు భక్తితో పాడ'

వంటి చరణాలలో జాతీయ దృక్పథం ప్రబోధరూపకంగా తరగెత్తింది. వీరి 'శ్రీలుపొంగిన జీవగడ్డయి' అనే గేయంకూడా భారత జాతీయతకు నివాళులెత్తిన మరో మంచిగేయం.

రాయప్రోలు వారిలాగే ఆత్మ విశ్వాససూర్యోదయ కాంతులతో భారత జాతీయ గీతము లాలపించిన కవికోకిల శ్రీ దువ్వూరి రామిరెడ్డి. వీరు 'నైవేద్యము' అనే శీర్షికతో భారతమాతృ చరణ పూజకై తరలిపోయిన సామాన్య ప్రజలగీతిని సముజ్జ్వలంగా వినిపించారు. ఆ మాతృ పదసన్నిధిలో పూజ్యులు, అధములు, ధనికులు, బీదలు అనే భేదంలేకుండా అందరూ నిలిచి హారతులెత్తారు. కన్నెపూలను దోయిలించారు. కొందరు నిర్భాగ్యులు 'కంటి క్రొన్నీటి ముత్యాలు' కానుకలు పెట్టారు. కవిమాత్రం హృదయపు సుగంధ దీప మర్పించి ధన్యుడయ్యాడు. 'మాతృ మందిరం' అన్న వీరి పద్య సముచ్చయంలో మాతృచరణ సన్నిధానంలో ఆత్మలను కర్పూరంగా వెలిగించనిదే స్వాతంత్ర్య ఫలం సిద్ధించదనే ప్రబోధముంది.


భావకవుల తరంలో పలువురు తెలుగు కవులు భారతావని యశోగానంచేశారు. 'పరమార్థనిధియైన భారత భూమి పైనకు కొరగాక పొడగుచుండ' ఆర్య సంతతివారు 'కనుమూసి కాలంబు గడుపుట తగునె' అంటూ వేంకట పార్వతీశ్వరకవులు హెచ్చరించారు. తుమ్మల సీతారామ మూర్తిగారు భారత సవిత్రిని 'వెన్నతోడనె చతుర్వేద ఋక్కులు పంచి సుతులచుంచు దువ్వెన' తల్లిగా భావించారు. జాషువాగారు 'సింధు గంగానదీ జలక్షీర మెప్పుడు గురిసి బిడ్డల పోషించు కొనుచున్న పచ్చిబాలెంతరాలు మా భరత మాత' అంటూ ప్రస్తుతించారు.

ఈ రకంగా ఆత్మాశ్రయరీతిలోనే కాక ఏదో ఒక వస్తువును గ్రహించి భారత జాతీయతను భంగ్యంతరంగా ప్రబోధించిన రచనలూవున్నాయి. శివభారతం, రాణాప్రతాపసింహ చరిత్ర ఈ కోవకుచెందిన మహాకావ్యాలే. ఇవికాక ద్రౌపదీ సందేశం, పాంచాలి సాంత్వనం లాంటి శీర్షికలద్వారా జాతీయాభిమానాన్ని ప్రజ్వరిల్లజేసిన పద్యాలూ, రసపుత్రుల మహారాష్ట్రుల సిక్కుల వీరగాథలను ఇతివృత్తాలుగా గ్రహించి రచించిన ఖండకావ్యాలూ, భారతజాతీయ సమైక్య దృక్పథానికి పాదులు వేసిన రచనలే.

ఇటీవల ఒకవైపు చైనా, మరోవైపు పాకిస్తాన్, మనం కనుపాపల్లా కాపాడుకుంటున్న యెల్లలను కబళించడానికి ప్రయత్నించినవి. వెన్నవంటి భరతావని గుండెలో నిప్పులు కురిసినవి. ఈ దుశ్చర్యలతో భారతజాతి ఒక్కుమ్మడిగా ఉద్బుద్ధమై నిలిచింది. సమస్త భారతీయులు తమలో నడుమ నడుమ చెలరేగిన చిల్లర తగాదాలు మానుకుని సింగాల్లా ముందుకుదూకారు. ఆధునిక కవులు ఈ సమైక్య దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ సముజ్జ్వల గీతాలను పాడుకుంటున్నారు. ఆ మహాగానంలో నేనూ ఇలా శ్రుతి కలిపాను.

'ఎవరు హిందు వెవరు తురక ఎవరురా కిరస్తానీ?
ఎవరిది తెలు గెవరిదరవ మెవరిది హిందూస్తానీ?
ఒకే తోట వికసించిన రకరకాల పువ్వులురా.
ఒకే వాణి గుడిలో వెలుగొందిన మణిదివ్వెలురా.'

★



16

వాసిరెడ్డి సీతాదేవి

పోరాటం వ్యక్తుల మధ్య జరగదు. వ్యక్తుల విభిన్న ఆదర్శాల మధ్య జరుగుతుంది. విభిన్న ఆదర్శాలూ, అభిరుచులూ గల ఇద్దరు వ్యక్తులు ప్రాణస్నేహితులుగానో, లేక ప్రేమికులుగానో వుండగలుగుతున్నారంటే వారిలోని మానవత వారి అభిరుచులనూ, ఆదర్శాలనూ అదుపులో పెట్టగలిగి వుండి వుండాలి. ఈ కోవకుచెందిన వ్యక్తులు జీవితంతో రాజీ పడగలరు. పరిస్థితులతో రాజీపడటం మానవ వికాసానికి గొడ్డలి పెట్టే కావచ్చును. కాని తను ప్రేమించే హృదయం ముందు తమ ఆదర్శాలనూ, అభిరుచులనూ అదుపులో పెట్టుకోక తప్పదు. అలా కానప్పుడు ఇద్దరు ప్రత్యేక వ్యక్తిత్వంగల వ్యక్తులు ఒకరికొకరు ఎంత దగ్గరకు రావాలని ప్రయత్నించినా దూరంఅవుతూనే వుంటారు.

చంద్రం, హేమల మధ్య ఇలాటిపోరాటమే జరుగుతున్నది. వారిద్దరూ ఒకరికొకరు ఎంత దగ్గరకు రావాలని ప్రయత్నిస్తున్నారో అంతదూరం అవుతున్నారు. హేమలోని అభిమానం, అభిజాత్యం తన ప్రేమను ప్రకటించడంలో అడ్డు పడుతున్నాయి.

అవమానించబడిన ప్రేమ ద్వేషంగా మారుతుంది. కృష్ణారావు ఇంట్లో జరిగిన సంఘటన హేమ అహాన్ని దెబ్బ కొట్టింది. చంద్రంగారి లాటివారిని సమర్థించటం గాయపడిన హృదయాన్ని మళ్లీ రేపినట్లయింది. ఆమె హృదయాంతరాళాల్లో ఎక్కడో లోతుగా చంద్రం యెడల ద్వేషం తేలు పిల్లలా కదల సాగింది. తను ప్రేమించే వ్యక్తినే ద్వేషించ సాగిన హృదయం పడేయాతనంత బాధ మరోటి లేదేమోనని పిస్తుంది హేమకు.

ప్రేమ, ద్వేషం, మధ్య జరుగుతున్న పోరాటంలో హేమ హృదయం విలవిల్లాడి పోతుంది. ఏదో అశాంతి నీడలా వెన్నంట సాగింది హేమను. చంద్రం ఆ ఊరు వచ్చి నాలుగు నెలలు కావస్తుంది. దాదాపు రోజూ సాయంత్రం హేమ దగ్గరకు వస్తూనేవున్నాడు. హేమ ఒకవైపు చంద్రాన్ని అసహ్యించుకుంటూనే కొంచెం అతనురావటం ఆలస్యం అయితే అశాంతితో అల్లాడిపోతుంది. ఒకరోజు రాకపోతే గౌరితో చంద్రాన్ని ఊహించుకుంటూ చంద్రాన్ని అసహ్యించుకుంటుంది. అతన్నిచూట్టం, అతనితో మాట్లాడటం తనకు అసహ్యం అనుకుంటుంది. మళ్లీ అతని ముఖం చూడకూడదని ఎన్నోసార్లు నిర్ణయించుకుంటుంది. అంతలోనే వెక్కివెక్కి ఏడ్చేస్తుంది. ఆ తరవాత హృదయం కొంత తేలిక పడుతుంది. ద్వేషం స్థానాన్ని ప్రేమ వశపరుచుకుంటుంది. చంద్రం కోసం మనస్సు గిజగిజలాడి పోతుంది.

వారం రోజులనుంచీ చంద్రం రాకపోవటానికి కారణం అనేక రకాలగా వూహించుకోసాగింది హేమ. ఆరోజు సాయంత్రం ఆమె హృదయం శ్రావణ మేఘంలా భారంగా ఏకొంచెం చల్లగాలి తగిలినా వర్షించటానికి సిద్ధంగావుంది.

హేమ అశాంతిగా ఇంటిముందు ఆవరణలో తిరుగుతుంది. తనకు తెలియకుండానే మొక్కల పువ్వులు తెంపింది. ఆకులుతెంపి పళ్ల సందునుంచి చేత్తోచింపుతుంది. లోపలకు వెళుతుంది. హాలులో ఆగి మళ్లీ వెనక్కు వరండాలోకి వస్తుంది.

ఈ రోజు ఏమయినా తను ఖచ్చితంగా చెప్పదలచుకుంది. తను అంత చవకబారు అభిరుచులు గల మొగవానిని ప్రేమించలేదు. చంద్రం అంటే తనకు అసహ్యం. అతనితో ఆమాట ఈ రోజు చెప్పేస్తుంది. లేకపోతే తనను ఏమనుకుంటున్నాడు ? కాలక్షేపంకోసం తన దగ్గరకు వచ్చి కబుర్లు చెబుతున్నాడా ? ఆ బజారు పిల్లకోసం ఆ గుడిసెల్లో పడివుంటాడా ? తనంటే ఏకొంచెం లక్ష్యంవున్నా తన అభిరుచులను తెలుసుకోవడానికి ప్రయత్నించడా ?

జరిగిన కథ

చిన్ననాడే తల్లిదండ్రులు లేని చంద్రం వదినద్వారా దొంగగా నిరూపించబడి, తీవ్రంగా శిక్షింపబడి అమాయకపు స్త్రీ అయిన గౌరి సహాయాన బయట పడతాడు. ప్రకాశంను ఆత్మహత్య స్థితినుంచి తప్పించి అతని తండ్రి ఆదరణ ద్వారా చాల గొప్పస్థితిలోకొస్తాడు. గౌరిని అనాథ శరణాలయంలో చేరుస్తాడు. ఆ తరువాత తాను చిర కాలం నుంచి కలుసుకోవాలనుకున్న హేమను కూడా కలుసుకుంటాడు. తనను కలిసేందుకు వచ్చిన గౌరిని చంద్రం ప్రకాశం ఇంటికి తీసుకు వెడతాడు. అక్కడ గౌరి లేవలేని స్థితిలో ఉండగా, చంద్రం ప్రకాశంలు చాలా సహాయం చేస్తారు. ప్రకాశం స్థలంలోనే ఒక చిన్న నిట్టాడి గుడిసెలో వుంటున్న రాజవ్వదగ్గర గౌరిని పెట్టాడు ప్రకాశం. ఆమె బాగోగులు చూస్తున్నాడు.

ఆ అమ్మాయితో......ఛీ! అలాటివాడిని తను ప్రేమించడం ఏమిటి? చంద్రంలో బలహీనతవుంది కాబట్టి తన దగ్గర చనువు తీసుకోలేకపోతున్నాడు. ఒకవ్యక్తి ఒకేసారి ఇద్దర్ని ప్రేమించగలడా? కేవలం వ్యామోహం......కేవలం ఆలోచిస్తున్న హేమకు గుండెలు చిక్కపట్టినట్లయింది. వెళ్లి వరండాలో వున్న కుర్చీలో యాంత్రికంగా కూలబడింది. కళ్లనుంచి తనకు తెలియకుండానే ఎంతోసేపుగా కారుతున్న నీటిని ఉలిక్కిపడి గబగబా తుడుచుకుంది. ఇంకానయం చంద్రం రాలేదు. తను ఏడుస్తున్నట్లు కనిపిస్తే చంద్రం దృష్టిలో ఇంకా చవక అయివుండును.

తను చంద్రాన్ని నిజంగా అసహ్యించుకుంటుందా? కాదు........తన ప్రేమను అవమానించాడనే కసి కొద్దీ తనే కావాలని అతనిమీద అసహ్యాన్ని పెంచుకోవటానికి ప్రయత్నిస్తుంది. కాని అది సాధ్యమా?

చిన్ననాటి స్నేహం తనకు తెలియకుండానే ప్రేమ రూపాన్ని ధరించి తనలోని ప్రతి జీవాణువుతో పాటు పెరిగింది. రక్తంలో ప్రవహిస్తుంది. తనలోని రక్తం గడ్డకట్టిననాడు కాని చంద్రంయెడల ప్రేమ కరడుకట్టదు. రక్తనాళాలలో రక్తంతో పాటు ప్రవహిస్తూ హృదయంలోకి ప్రతి నిముషం ప్రవేశిస్తూనేవుంది. చంద్రం ప్రేమను ద్వేషిస్తుందంటే తనను తనే ద్వేషించుకుంటుందన్నమాట!

తను చంద్రాన్ని మరచిపోవటం అసంభవం. అతను లేని జీవితం తనకు అక్కరలేదు. మగవాడు-పైగా పెద్దల రక్షణకు దూరంగా పెరిగినవాడు. పరిస్థితుల కారణంగా కొన్ని అలవాట్లకు లొంగిపోయి వుండవచ్చు. తను చంద్రాన్ని సానుభూతితో అర్థం చేసుకొని, అతన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి బదులుగా, ప్రతి చిన్న విషయాన్ని కొండంతలుగా వూహించుకొని అసహ్యించుకుంటూ అతన్ని దూరం చేసుకుంటున్నది. అసహ్యంతో వ్యక్తుల్ని దూరం చేసుకుంటామే కాని దగ్గరకు లాక్కోలేము. ఇకనుంచి తన హృదయం మీది కృత్రిమ తెరలను తొలగించుకొని చంద్రాన్ని దగ్గరగా తీసుకోవాలి.

చంద్రం మరీ అమాయకుడులా ప్రవర్తిస్తున్నాడు. తన ముఖంలోని జుగుప్సను చూసినప్పుడు చంద్రం, ముఖాన్ని ఎంత చిన్నపుచ్చుకుంటాడో! అలా చిన్నపోయిన చంద్రం ముఖం చూస్తుంటే తన రెండు చేతులూ మెడ చుట్టూ చుట్టి అనునయించాలనిపిస్తుంది. కాని తను వస్తే అలా చెయ్యలేదు. ఎందువల్ల!

చంద్రం అలా దూర దూరంగా ఎందుకుంటున్నాడు. చంద్రానికే ధైర్యంవుండి ఇంగ్లీషు సినిమాల్లో, కొన్ని నవలల్లోని హీరోలాగ బలవంతంగా తనను దగ్గరకు లాక్కుంటే తను లొంగిపోకుండా వుండగలదా? అభిమానంగల స్త్రీ ఎప్పుడూ తను ప్రేమిస్తున్న వ్యక్తులద్వారా శాసించబడాలనే కోరుకుంటుంది. ప్రేమతో కూడిన అధికారానికి లొంగని స్త్రీ హృదయం వుండదేమోనని తను అనుకుంటూ వుంటుంది అప్పుడప్పుడు. రచయిత అయిన చంద్రం తనలోని బలహీనత ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నాడు!

ఎవరో గేటు తెరచుకొని లోపలకు వస్తున్నట్లు ఆలోచనల్లోవున్న హేమకు లీలగా అనిపించి అటువైపు చూసింది. చంద్రం, అంతవరకూ చీకటి గదిలో దేనికోసమో వెతుకుతున్న హేమకు అకస్మాత్తుగా ఎవరో మెర్క్యురీ లైటువేసినట్లనిపించింది. హృదయంలోని ఆ వెలుగును కళ్లద్వారా బయటపడకుండా బలవంతంగా వెనక్కు నెట్టేసింది. లేని పోని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకొన్నది ముఖంలోకి.

చంద్రం వచ్చి హేమకు ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు. హేమ చిరునవ్వుకు జవాబుగా నవ్వలేదు. చంద్రం మూతి బిగింపు చూసిన హేమకు నవ్వువచ్చింది.

"ఇంట్లో చాలా వుక్కగా వుంది. అలా ఓసారి పార్కు వైపుకు వెళదామా చంద్రం.

హేమ మాటలకు నమ్మలేనట్లు విస్మయంగా చూశాడు చంద్రం. చంద్రం వాలకం చూస్తుంటే ఆరోజు ఏదో నిర్ణయించుకొని, పోట్లాటకు సిద్ధంగా వచ్చినట్లనిపించి హేమకు తమాషా అనుభూతి కలిగింది. తనకు కావాల్సింది అదేనేమో!

హేమ, చంద్రం జవాబుకు ఎదురు చూడకుండానే లోపలకు వెళ్ళి ఐదు నిముషాల్లో హేండ్ బాగ్ తో వచ్చి నిల్చుంది. చంద్రం లేచి యాంత్రికంగా హేమ వెనకనే నడవ సాగాడు. హేమ ప్రవర్తనలోని మార్పు చంద్రాన్ని ఆశ్చర్యంతో ముంచివేసింది. పార్కు రెండు ఫర్లాంగుల దూరం

లోనే వుంది. ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. అలా ఒకరి పక్కన ఒకరు నడుస్తూ ఎవరి ఊహల్లో వారు తేలిపోతున్నారు.

హేమ తన పక్కన అలా నడుస్తుంటే చంద్రానికి ఎన్నో సామ్రాజ్యాలను జయించినట్లుంది. ఆనాడు తను గౌరితో నడుస్తూ అందరూ తమ వంకే చూస్తుంటే సిగ్గుతో తాబేలులా ముడుచుకుపోయాడు. తాబేలులాగ తనకూ ఓ కవచం వుంటే ఎంత బావుణ్ణు. ఎవరికీ కనిపించకుండా అందులోకి ముడుచుకుపోదును అనిపించింది. కాని ఆ మాటే ప్రకాశంతో అంటే తనను తిడతాడు. తనకూ న్యాయంగా అలా అనిపించకూడదు, అది తన బలహీనతే కావచ్చు. కాని ఈ రోజు తను సగర్వంగా నలుగురూ చూడాలన్నట్లు నడుస్తున్నాడు.

ఈ చంద్రం ఏమిటి? తను చొరవ తీసుకున్నా మాట్లాడడేం? బహుశా తన ప్రవర్తనలోని మార్పును ఊహించుకోలేకుండా వున్నాడేమో! పార్కులో తనూ చంద్రం...

చంద్రం చక్కగా కత్తిరించి పెంచిన గరికమీద పడుకున్నాడు. తల కుడిచేతిమీద ఆనించి ఎదురుగా కూర్చున్న తన ముఖంలోకి రెప్ప వెయ్యకుండా ఎలా చూస్తున్నాడో! తను సిగ్గుతోటి 'టచ్‌మినాట్' లా ముడుచుకుపోతుంది! అలా చూసి చూసి ఒక్కసారిగా తనచెయ్యి పట్టుకొని ముందుకు లాగాడు. తన తల చంద్రం గుండెలమీద పడింది.

హేమ ఉలిక్కి పడింది. పార్కు గేటు ముందుకు వచ్చారు. అంతా పగటి కలేనా!

చంద్రం ఒకమూలగావున్న బెంచీవైపుకు నడుస్తున్నాడు. హేమకు నిరుత్సాహం అనిపించింది. పలక్కుండా వెళ్ళి బెంచీ మీద చంద్రం ప్రక్కగా కూర్చుంది.

"నాలుగు రోజులుగా రాలేదేం?" హేమ ప్రశ్నించింది. చంద్రం ఎన్నిరోజులు రాకపోయినా అతని రాకపోకలు తనకేం పట్టనట్టు నటించే హేమ అలా ప్రశ్నించటంతో చంద్రం ఆశ్చర్యానికి అంతులేదు. చంద్రంలో సంతోషం పాలపొంగులా పొంగుతుంది. కాని చంద్రానికి మరోవైపు అనుమానంగానే వుంది. తనకు అంత అదృష్టమా అని ప్రకాశం వాళ్ల యూనియన్ వార్షికోత్సవానికి ఒక నృత్య నాటిక రాయమంటే రాశాను. గౌరి అభినయిస్తుంది. నేను ఆ హడావిడిలో వున్నాను.

గౌరి! ఎవరా గౌరి! ఆబజారు పిల్లకాని కాదుగదా!
"గౌరి ఎవరు?"

హేమ ప్రశ్నకు చంద్రం జవాబు ఇవ్వటానికి కొంచం జంకడం గమనించింది. "ఆ అడవి మల్లేనా?" స్వరంలో హేళన.

హేమ స్వరంలోని అవహేళనకు చంద్రం మనస్సు చివుక్కు మంది. హేమ కళ్లలో తిరస్కారం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది, ఏమిటీ హేమ! చాలా చిత్రమయిన మనిషి!



"ఇవాళే ప్రోగ్రాం! నిన్ను కూడా తీసుకు వెళటానికి వచ్చాను" అన్నాడు చంద్రం హేమకు కలిగిన అనుమానాన్ని వెనక్కు నెట్టటానికి ప్రయత్నిస్తూ. అతను తిరిగేది కాకుండా తననుకూడా అలాగా జనంలోకి రమ్మంటున్నాడు. హేమకు కోపం వచ్చింది. కాని అణచు కుంది. ఇలా లాభం లేదు. తను చంద్రం మంచి చెడ్డల విషయంలో జోక్యం కలిగించుకోక తప్పదు అనుకుంది.

"నువ్వురాసిన బ్యాలె నాకుకావాలి, మాకాలేజిలో ప్రదర్శిస్తాము," అంది హేమ మాటల ధోరణిని మరో వైపుకు మరల్చుతూ.

“అయితే ఇవ్వాళ నువ్వు రావన్నమాట అన్నాడు చంద్రం.

“నన్ను బలవంతం చెయ్యకు చంద్రం. ఆజనంలో నాకు ఊపిరి సలపదు. ఇవ్వాళ నువ్వు ఎక్కడకూ వెళ్ళటానికి వీల్లేదు. మాతో భోజనంచేసి వెళ్ళాలి” అంది హేమ.

నిజంగా హేమ ఇవ్వాళ చాలాచిత్రంగా ప్రవర్తిస్తుంది. హేమ అంతచనువుగా వుంటే తను ఆ అవకాశాన్ని ఎలా జారవిడుచు కోవటం? కాని ప్రకాశం... గౌరి, ఇద్దరూ తను రాకపోతే చాలా బాధపడతారు.

“ నిజంగా అంత ఆలోచన! [illegible] [illegible] చంద్రం లొంగిపోయాడు.

“ నీవు ఆజ్ఞాపిస్తే కాదనే శక్తినాలోలేదు. అలాగే కాని”

“ కానీలు ఏనాడో పోయాయి నయాపైనా అను, లే వెళదాం, నాన్న వచ్చివుంటారు.” అంటూ హేమ లేచింది.

చంద్రం హేమ చెయ్యి పట్టుకొని లాగి కూర్చో పెట్టాడు. “అప్పుడే ఏం తొందరా? నీతో కొంచెం మాట్లాడాలి కూర్చో” అన్నాడు చంద్రం.

హేమ కొంచెం గాబరాపడ్డది. “ఏం మాట్లాడతావు?”

ఈ రోజు చంద్రం ఇంట్లో బయలు దేరుతున్నప్పుడే అసలు హేమ తనను ప్రేమిస్తుందో లేదో తేల్చుకోవాలని నిర్ణయించు కొని బయలుదేరాడు. ఈ ముసుగులో ఆట ఎంతకాలమో తేల్చేయదలచుకున్నాడు. అనుకోకుండా హేమ కూడా సుముఖంగానే ఉన్నందుకు సంతోషించాడు చంద్రం.

“ నేను నీతో మాట్లాడ దగినవి ఏమీలేవా? ఇటు నా ముఖంలోకి చూసిచెప్పు?” అంటూ చంద్రం, ఎదురుగావున్న ఫౌన్ టెన్ వైపుకు చూస్తున్నట్లు నటిస్తున్న హేమ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు గోముగా. హేమ విముఖతను చూపించలేదు. చంద్రం ఆమెను దగ్గరకు తీసుకుంటూ “హేమా!” అన్నాడు. స్వర్గద్వారంలో అడుగుపెడుతున్న హేమను ఎవరో ఒక్కసారిగా బలంగా కిందకుతోసేశాడు. ఎవరది? గౌరి! గౌరి రూపం కళ్లకు కట్టింది. ఈ చంద్రం ఆ బజారు పిల్లనుకూడా ఇలాగే...ఛీ... శరీరం మీద పాకుతున్న విషపురుగును విదిలించినట్లు హేమ ఒక్క సారిగా చంద్రం పట్టును విడిపించుకుంది. ఆమె ముఖంలో ఏవగింపు, కళ్లలో ద్వేషం చూసిన చంద్రంకు మతి పోయినట్లయింది.

చిరాకుభర్తతో పరాకుభార్య—

“ఈపూట ఆనబకాయ వండేదా ఆవకాయ వండేదా?”

“ నా తలకాయ వండు ”

“ ఆవపెట్టి వండేదా? నూనె పెట్టి వేయించేదా? ”

ఉ॥ మెత్త నిపట్టుచీకటుల మేలిమిదుప్పటిలోన కౌగిలిన్
ఒత్తుము, నా కపోలగళదూర్మిక లై చనుబాష్పవారితో
హత్తెద నీయురమ్ము తడియై ఒకవింతసొబంగు దాల్ప, ఈ
మత్తున జోల పాడి నను మైమఱపింపుము శర్వరీప్రియా!

—స్వర్గీయ

దేవరకొండ బాలగంగాధర తిలక్.

[illegible] తనంటే ఇష్టంలేక పోవచ్చును. కేవలం చిన్ననాటి స్నేహితునిగానే అభిమానిస్తుందేమో! కాని అలాకూడా అనిపించదు. చంద్రానికి విసుగూ, కోపం కలిగాయి.

హేమ ముంజేతిని చాలాగట్టిగా పట్టుకున్నాడు. హేమ లాక్కోవటానికి ప్రయత్నించింది. కాని చేతిని విడిపించుకోలేక పోయింది. చంద్రం ఆమె చేతిని ఇంకా గట్టిగా నొక్కాడు. బాధతో హేమ ముఖం కంది పోయింది. చంద్రంలో ఇంత మొరటుతనం, ధైర్యం వుందని వూహించని హేమ విస్తుపోయి చంద్రం ముఖంలోకి చూసింది.

చంద్రం కళ్లలో ఉద్రేకం, ముఖంలో గాంభీర్యం, “హేమా చెప్పు! నేనంటే నీకు ఇష్టంలేదా? అలాని చెప్పు. మళ్లీ నీకు అసహ్యం కలిగించే నాముఖాన్ని చూపించను.” అంటూ హేమ చేతిని విసుగ్గావదిలేశాడు.

నిజంగానే చంద్రానికి కోపంవచ్చింది. చంద్రం నిజంగా అన్నంత పనిచేస్తాడేమో!

“ఊం చెప్పు! నాకు ఇవ్వాళే, ఈక్షణంలోనే జవాబు కావాలి?” చంద్రం ఒక్కొక్క మాటకు హేమ హృదయం మీటిన వీణలా మధుర కంపనంతో తన్మయం చెందుతుంది.


“నువ్వు చెప్పవు, నాకు తెలుసు నేనంటే నీకు అసహ్యం. అవును నీ చదువుకూ, అభిరుచులకూ నేను తగను. దొంగతనం చేసి ఇంటినుంచి పారిపోయిన వాణ్ణి. ఏదో చిన్నప్పటి స్నేహితుడుగదా అని ఇంతకాలం నన్ను ఆదరించి భరించావు క్షమించు. ఇప్పటికే నిన్ను చాలా బాధించాను. మళ్లీ ఇక ఈ జన్మలో నిన్ను బాధించను, సెలవు” అంటూ ఉద్రేకంగా లేచి నిల్చున్న చంద్రం చేతిని గాఢంగా పట్టుకుంది హేమ.

చంద్రం కోపంలో ఎంత అందంగా వుంటాడు అనుకుంది. చంద్రం కోపం చూస్తుంటే హేమకు నవ్వు వస్తుంది. హేమ నవ్వు ముఖాన్ని చూసిన చంద్రం తన చేతిని విసురుగా లాక్కున్నాడు. (సశేషం)

సీరియల్

పంచతంత్రము

★



టిట్టిభ సముద్రముల కథ

దమనకుడు సంజీవకునితో పై కథను ఈ విధముగా చెప్ప దొడంగెను.

ఒకానొక సముద్రతీరము నందు టిట్టిభ దంపతులు (లకుముకి పిట్టలు) నివసించుచుండెను. కొంత కాలమునకు టిట్టిభి గర్భము ధరించెను. ప్రసవసమయము రాగా టిట్టిభముతో నిట్లు చెప్పెను. ''ఓ ప్రియుడా! నాకు ప్రసవ సమయము ఆసన్నమైనది కనుక ఏలాటి ఉపద్రవము లేని ఒక స్థానమును వెదకుము. అక్కడ నేను గ్రుడ్లు విడిచి వానిని క్షేమముగా కాపాడుకొనెదను.''

టిట్టిభము :— ''ప్రియే! ఈ సముద్రప్రదేశము రమ్యముగా ఉన్నది. ప్రసవసమయమునిక్కడనే గడప వచ్చును గదా!

టిట్టిభి :— పున్నమ నాడు సముద్రము ఉప్పొంగును. సముద్రము పొంగు మదగజమునుకూడ ఆకర్షించును. కనుక యిక్కడ మనము ఉండకూడదు. దూరముగా అపాయము లేని స్థానము వెదకుము.

టిట్టిభము :— కాంతా! నీ మాట సరిగానే ఉన్నది. కాని నా కపకారము చేయగల శక్తి యీ సముద్రమునకెక్కడిది? నీవు విశ్వాసముతో ఇక్కడనే ఉండి గ్రుడ్లు పెట్టవచ్చును.''

ఈ మాట విని సముద్రుడు ఈ నీచ పక్షికి ఇంత గర్వమా? దీని గ్రుడ్లను నేను అపహరించినచో ఇది యేమి చేయును, చూచెదను గాక'' అని ఆలోచించి ఉండెను.

కొంతకాలమునకు ప్రసవమయ్యెను. ఒకనాడు టిట్టిభి గ్రుడ్ల నచ్చటనే విడిచి ఆహార సంపాదనకు వెడలి పోయెను. సముద్రుడు తన పొంగుతో గ్రుడ్లను తనలోకి లాగుకొనెను. టిట్టిభి వచ్చి గ్రుడ్లను గానక దుఃఖించుచు టిట్టిభముతో నిట్లనెను.

''ఓయీ! సముద్రపు పొంగుచేత మన గ్రుడ్లు నశించును, దూరముగా వెడలి పోవుద''మని తొలుతనే నీకు చెప్పితిని. నీవు అహంకారము చేత నా మాట వినక పోయితివి. హితుల మాటలు వినని వాడు, పూర్వము తాబేలు నశించినట్లు వినాశమును పొందును.''

ఆ కథ ఎట్లో చెపుమని టిట్టిభము అడిగెను. టిట్టిభి యీ విధముగా చెప్పెను.''

తాబేలు కథ

ఒకానొక నీటి మడుగులో ''కంబుగ్రీవము'' అను నొక తాబేలు నివసించుచుండెను. దానికి సంకటము, వికటము అను పేర్లు గల రెండు హంసలు ప్రియమిత్రములుగా ఉండెను. అవి ప్రతిదినము ఆ మడుగు తీరమును చేరి ఆ తాబేలుతో ఇష్టగోష్ఠి జరుపుచు అనేకమహామునుల కథలను చెప్పుకొనుచు సాయంకాలము తమ గూండ్లకు పోవుచుండెను. కొంతకాలమునకు అనావృష్టి చేత ఆ సరస్సు ఎండి పోయెను. అది జూచి, హంసలు ''మిత్రమా యీ సరస్సులో బురద మాత్రము మిగిలి యున్నది. కాబట్టి యిక్కడ నీ వెట్లు జీవించగలవని మేము బాధ పడుచున్నాము''

తాబేలు :— ఓయీ! ఇప్పుడు నాకు ఇక్కడ జీవించుటకు అవకాశములేదు. కనుక మీరు ఒక త్రాడో, కొయ్యనో తెచ్చి నచో దాని మధ్య ప్రదేశమును నేను దంతములతో కఱచు కొని యుండెదను, మీరు దాని రెండు కొనలు పట్టుకొని, సమృద్ధిగా జలము గల సరస్సునకు నన్ను చేర్చుడు.

హంసలు :—''మిత్రమా! అట్లేచేసెదము. కాని నీవు మౌనముతో నుండవలెను. నోరు తెరచితివేని ఈ కొయ్య పట్టువీడి క్రిందపడిపోయెదవు.

ఆ ఒడంబడిక ప్రకారమే తాబేలును మోసుకొని హంసలు పోవుచుండెను. దారిలో కంబుగ్రీవము ఒక పట్టణమును చూచెను. ఆ పురజనులు ఆ తాబేలును చూచి ఆశ్చర్యముతో, ''ఆహా! యీ పక్షులు ఒక సిత్రమైన వస్తువును తీసుకొని పోవుచున్నవి చూడుడు'' అని అనగా విని కంబుగ్రీవము ''మీకేటి కోలాహలము'' అని అనబోయి నోరు తెరవగనే పట్టువీడి క్రింద బడెను. పౌరులు దానిని ముక్కలు ముక్కలుగా ఖండించిరి. కనుక హితులు చెప్పినమాట విననివాడు నశించును.'' అని టిట్టిభి చెప్పి దీనికి ఉదాహరణముగా మరియొక కథనుగూడ ఈ క్రింది విధముగా చెప్పెను.

మూడు చేపల కథ

ఒకానొక సరస్సులో ''అనాగతవిధాత, ప్రత్యుత్పన్న మతి, యద్భవిష్యము'' అను మూడు చేపలు నివసించుచుండెను. ఒకప్పుడు చేపలు పట్టువారు ఆ సరస్సునుచూచి యిట్లనుకొనిరి:— ఆహా! అనేక మత్స్యములుగల యీ మడుగును మన మెప్పుడును చూడలేదుగదా. మనకిక్కడ సమృద్ధిగా ఆహారము లభించును. రేపువచ్చి యిక్కడ చేపలుపట్టుదము''

పిడుగువంటి ఆ మాటలువిని అనాగతవిధాత అను చేప ఆ మడుగులోని చేపలన్నిటిని పిలిచి యిట్లనెను. ''మీరు ఈ చేపల వారి మాటలను వింటిరికదా! ఈ రాత్రియే యీ చోటువీడి యితర సరస్సుకు వెళ్ళవలెను. లేకున్నచో తెల్లవారగనే చేపలవారు వచ్చి మనసందరిని పట్టుకొనెదరు. ఇక్కడ ఒక క్షణముకూడ ఉండ కూడదు.''

ఆ మాటవిని ప్రత్యుత్పన్నమతి యిట్లనెను ''నీవు చెప్పి నది నిజమే. నాయిష్టముకూడ అదే. అందరము వేరుచోటుకు వెళ్ళుదము.'' ఆ మాటవిని యద్భవిష్యము అను చేప బిగ్గరగా నవ్వి యిట్లనెను.'' మీరన్నమాట బాగులేదు ఒకమాట విన్నంత మాత్రముచేత తండ్రి తాతల కాలమునుండి మనము ఉన్న యీ సరస్సును విడవకూడదు. ఆయువు మూడినప్పుడు వేరుచోటగూడ మనకు మృత్యువు సంభవించును. కనుక నేను ఈ సరస్సు వీడి రాను. మీకు తోచినట్లు మీరు చేయుడు.'' యద్భవిష్యముయొక్క నిశ్చయము తెలిసికొని దానినచ్చటనే వీడి అనాగత విధాత, ప్రత్యుత్పన్నమతి అను రెండు చేపలు తమ పరివారముతో సహా ఆ మడుగును వీడి వెడలిపోయెను. మరునాడు తెల్లవారగనే చేపలు పట్టువారు వచ్చి వలపన్ని యద్భవిష్యముతోపాటు ఇతర మత్స్యములను కూడ ఆ మడుగునుండి పట్టుకొనిపోయిరి.

కనుక తెలివిలేనివాడు యద్భవిష్యమువలె నశించును. అని టిట్టిభి చెప్పెను. ఆ మాటవిని;

టిట్టిభము :—''ప్రియే! నన్ను యద్భవిష్యమువంటి వాడనుకొంటివా? నా బుద్ధి శక్తిని చూడుము. ఈ క్షుద్రసముద్రమును నాముక్కుతో ఎండగొట్టెదను.

టిట్టిభి :—అయ్యో! సముద్రముతో నీకు వైరము తగునా? కోపింపకుము.

టిట్టిభము :—ప్రియే! నీవట్లనకుము. ఉత్సాహశక్తికలవారు చిన్నవారైనను పెద్దలపై పరాక్రమము చూపగలరు. నీవు చూడుము. ఇప్పుడే నా ముక్కుతో సముద్రపు నీటినంతటిని పీల్చివేసెదను,

టిట్టిభి : ఓ ప్రియుడా! గంగ మొదలైన ఎన్నో వేలకొలది నదులను ప్రతిదినము ఈ సముద్రము తనలో కలుపుకొను చున్నది. నీముక్కుతో ఒక జలబిందువు మాత్రము గ్రహించగలవు. అట్టి నీవు అపారమైన యీ మహాసముద్రమును ఎట్లు శోషింపజేయగలవు? కనుక నేను నమ్మలేను.

టిట్టిభము : ప్రియే! నాముక్కు ఇనుమువంటిది. త్వరగా కాకున్నను, కొంత కాలములోనైన సముద్రమును శుష్కింప చేయజాలనా?

టిట్టిభి :—నీవు సముద్రముతో వైరము చేయదలచినచో ఇతర పక్షులనుకూడ నీకు తోడుగా తీసుకొనుము. ఎంత గొప్పవాడైనను విరోధులు అనేకులు ఏర్పడినప్పుడు నశించును. పూర్వమిట్లే ఒక మహాగజము నశించెను. వినుముఅని చెప్పెను.


చటకములు—ఏనుగు కథ

ఒక వనములో నొక కానుగుచెట్టుపైన చటకదంపతులు (పిచ్చుకలు) నివసించుచుండెను. కొంత కాలమునకు ఆ పక్షులకు సంతతి కలిగెను. ఒకనాడు మదించిన వనగజమొకటి యెండకు తాళలేక ఆ చెట్టునీడ చేరెను. మదాతిశయముచేత ఆ గజము, చటక పక్షులుగల కొమ్మను లాగి విరిచెను. దానివలన ఆ పక్షి గ్రుడ్లు చిదిగిపోయెను. చటక దంపతులు మాత్రము చావక మిగిలెను. పిల్లలను పోగొట్టుకొన్న చటకస్త్రీ దుఃఖించుచుండెను. అది చూచి దాని మిత్రమగు 'కాష్ఠకుట్టము' అను పక్షి సానుభూతితో చటకతో నిట్లనెను:—

''మిత్రమా! చచ్చినవాని గూర్చి వ్యర్థముగా దుఃఖించి నందువల్ల లాభమేమి?

చటక:—సత్యమే. కాని, అన్యాయముగా నా పిల్లలను చంపిన యీ దుష్ట గజము నెట్లైనను చంపి తీరవలెను. నా పగ తీర్చుకొనవలెను.

కాష్ఠకుట్టము:—నీ మాట సత్యమే : నా బుద్ధి శక్తి చూడుము. 'వీణారవము' అను పేరుగల ఒక ఈగ ఉన్నది. అది



నాకు మిత్రము. దానిని పిలిచి, దానిద్వారా ఈ గజమును బంధించెదను. అని ఆ ఈగను పిలిచి దానితో ఈ రెండు జంతువులు గజవధోపాయమును చూడుమనెను. ఆ ఈగ యిట్లనెను:- "ఇది యెంతపని? నా మిత్రుడు 'మేఘనాదుడు' అనునొక కప్పఉన్నది. ఈ కార్యమునందు దాని సహాయము కూడ తీసికొందము" అని చెప్పి ఆ మూడును ఆ కప్పవద్దకు పోయి జరిగినసంగతి చెప్పెను. అదివిని మేఘనాదుడు "అనేకులు, ఏకమైనప్పుడు ఆ గజమును సాధించుట యెంతపని? నా సలహాను పాటించుడు. ఓ మక్షికమా! నీవు మధ్యాహ్నసమయములో ఆ గజము చెవివద్ద ధ్వనించుచుండుము. ఆ నాదమునకు పరవశమై అది కనులుమూసికొనియుండును. అప్పుడు ఈ కాష్ఠకుటము తన ముక్కుతో ఆ గజము కన్నులు కుట్టుగాక. దానితో అది గుడ్డిదైయుండి దప్పిగొని నీటికి వాపోవును. అంత నేను, నా పరివారము నొక గుంటవద్ద చేరి అరచెదము. మా ధ్వని విని అది జలాశయము అను భ్రాంతిచే వచ్చి ఆ గుంటలోపడి మరణించును. అని యిట్లు ఆ జంతువులు కూడబలుకుకొని ఆ విధముగనే చేయగా గజము ఆ గుంటలో పడి చచ్చెను"

అనుట్టిట్టిభి మాటలు విని టిట్టిభము అట్లే కానిమ్మని చెప్పి, కొంగలు, హంసలు, నెమళ్లు మొదలగు పక్షి వర్గములను పిలిచి జరిగిన సంగతి చెప్పెను. అని, "సముద్రమును శోషింపజేయుట మనకు అసాధ్యము. మన జాతికి ప్రభువగు గరుత్మంతుని ఆశ్రయింతము. అతడు మన జాతికేర్పడిన కష్టము తీర్చగలడు. ఒకవేళ నిరాకరించినను, మన పక్షపుగనుక మనకు అవమాన మనిపించదు." అని చెప్పెను. అట్లు నిశ్చయించుకొని ఆ పక్షులన్నియు గరుడుని వద్దకు పోయి తమకు కలిగిన ఆపదనుగూర్చి చెప్పి యిట్లు మొరపెట్టుకొనెను:- "నీవంటి సమర్థుడు మాకు ప్రభువై యుండగా ఇట్టి అన్యాయము మన జాతికి జరుగుట తగదు. మన మూరకున్నచో ఇతరపక్షులనుగూడసముద్రుడు తన పొట్ట పెట్టుకోగలడు."

ఆ మాటలు విని గరుడుడు దుఃఖించి కోపముతో "ఈ అవమానము పోవుటకు తప్పక సముద్రమును శోషింపజేయవలెను." అని చింతించుచుండగనే విష్ణుదూత వచ్చి "స్వామి నారాయణమూర్తి ఆజ్ఞ అయినది. వారు అమరావతికి పోవలెనట, వెంట నేరమ్ము" అని చెప్పెను. ఆ మాటకు గరుడుడు:- ఓయీ! నావంటి క్షుద్రునితో స్వామికి పనియేమి? మరి యొకని నెవనినైన మంచివానిని భృత్యునిగా తీసికొనుమనుము. నా నమస్కారమును ఆయనకు నివేదించుము.

ఆ మాటకు విష్ణుదూత యిట్లనెను:—ఓయీ! ఎన్నడును స్వామి ఆజ్ఞకు వ్యతిరేకముగా నీవు చెప్పలేదు. నేడేల యిట్లనుచుంటివి."

ఆ మాటకు గరుడుడు:- "భగవంతుని ఆశ్రయకోటిలోనివాడగు సముద్రుడు మా టిట్టిభాండములను అపహరించెను. భగవంతుడు సముద్రుని నిగ్రహించి అండములను తిరిగి యిప్పించువరకు నేను భగవంతునకు భృత్యుడను కాను" అని ఆయనకు చెప్పుము.

దూత పోయి చెప్పిన గరుడుని మాట విని విష్ణుమూర్తి స్వయముగా గరుడుని కడకు పోయి అతని సత్కారము నందుకొనెను. అప్పుడు గరుడుడు:-"భగవన్! నీ యాశ్రయ బలముచేత మదించి సముద్రుడు నా భృత్యుల పిల్లలను హరించి నన్నవమాన పరచెను, మీపై గౌరవముచేత ఆగితిని, లేకున్న ఇదివరకే సముద్రుని మట్టుపెట్టి యుందును." ఆ మాట విని భగవంతుడు గరుడునితో స్వయముగా సముద్రుని కడకు పోయి ఆగ్నేయాస్త్రము చేత సముద్రుని నిగ్రహించి అండములను తిరిగి టిట్టిభమునకు ఇప్పించి పక్షి జాతిని, గరుడుని సంతోషపెట్టెను.

"కాబట్టి శత్రువు బలము తెలియకుండ ప్రయత్నింప కూడదు" అని దమనకుడు చెప్పిన మాటలు సంజీవకుడు విని యిట్లనెను:—

(సశేషము.)

లఘు పరిశ్రమల కీలకపాత్ర

లఘుపరిశ్రమల విస్తరణకు నాలుగవ పంచవర్ష ప్రణాళికలో ప్రాముఖ్యత ఇవ్వబడుతున్నది. సత్వర పరిశ్రమాభివృద్ధి జరుగుతున్న యీతరుణంలో వీటికితగు ప్రాధాన్యం యివ్వడం సముచితమేగాక రాజ్యాంగంలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. గుత్త పెట్టుబడిదారీ తత్వాన్ని అరికట్టుతూ ప్రైవేటు, పబ్లిక్ రంగాలలోని పరిశ్రమలను అభివృద్ధి పరచి మొత్తం దేశంలో భౌగోళిక పరిస్థితుల ప్రాతిపదికపై సమానంగా పరిశ్రమలను విస్తరింపజేయడమే పారిశ్రామికీకరణ పథకాలలోని ప్రధానలక్ష్యాలుగా నిర్దేశించారు. కొద్దిమందిచేతులలో పరిశ్రమలు కేంద్రీకృతమై ఉండరాదనే దృష్టితోనే పెట్టుబడిపై కంట్రోలు, యూనిట్ ట్రస్టువంటికొన్ని చర్యలను తీసుకుంటున్నారు. అయితే లఘుపరిశ్రమల అభివృద్ధి విస్తరణ కార్యక్రమం యీవిషయంలో సముచిత ఫలితాలు ఇవ్వగలుగుతుంది. పారిశ్రామికీకరణ కార్యక్రమాలకు కీలక, భారీ పరిశ్రమలు ప్రాతిపదికగా ఉన్నప్పటికీ చిన్నతరహా పరిశ్రమలు మాత్రమే మనదేశ పరిస్థితులకు తగినటువంటివి భారతదేశంలో సోషలిస్టు తరహా సమాజాన్ని నెలకొల్పాలనే అంతిమ లక్ష్యాన్ని చేరుకోవడానికి నిర్దేశించిన మార్గాలలో యీ రంగాన్ని అభివృద్ధి పరచి పటిష్ఠంచేయడంకూడ చేరిఉంది.

నాలుగవ ప్రణాళికలో తక్షణ లక్ష్యంగా ఉద్దేశించిన పరిశ్రమల విస్తరణను చిన్నతరహా పరిశ్రమల రంగంద్వారానే సాధించగలుగుతాము. భారీ పరిశ్రమలను నెలకొల్పడం అనేకక్లిష్ట అంశాలపై ఆధారపడి ఉంటుంది. అయితే ప్రతి ప్రాంతంలో ఏదోఒక రకమైన చిన్నతరహా పరిశ్రమను నెలకొల్పడానికి ఎప్పుడూ అవకాశంఉంటుంది.

ఈ దృష్టానేభవిష్యత్ ఆర్థికాభివృద్ధి రంగంలో చిన్నతరహా పరిశ్రమలరంగం ప్రముఖ పాత్రవహించాల్సి ఉంది. గత 15 సంవత్సరాల కాలంలో యీ రంగంలో జరిగిన అపారమైన విస్తరణను పరిశీలించినప్పుడు, చిన్నతరహా పరిశ్రమలు ఆశించిన దానికంటేఎక్కువ సత్ఫలితాలను కలిగింపజేస్తాయనడంలో సందేహంలేదు. ఇంతవరకు పరిశ్రమలరంగంలో చిన్నతరహా పరిశ్రమలు సాధించిన విజయాలను, ప్రగతిని కొన్నివాస్తవిక అంశాలనుండి తెలుసుకోవచ్చు. భారతదేశంలో మొత్తం పారిశ్రామిక పెట్టుబడిలో 30 శాతం లఘుపరిశ్రమలలో ఉంది. దేశంలో దాదాపు 1.3 మిలియన్‌మంది ప్రజలకు యీ రంగం ఉపాధి కలిగిస్తుంది అందువల్లనే ప్రథమ పంచవర్ష ప్రణాళికలో చిన్న పరిశ్రమలపెట్టుబడి రూ. 5 కోట్లు ఉండగా అది మూడవ ప్రణాళికలో దాదాపు రూ. 115 కోట్లకు పెరగడం ఆశ్చర్యకరమైన విషయంకాదు. ఫ్యాక్టరీల చట్టంక్రింద నమోదు అయిన యూనిట్లలో 90 శాతానికి పైగా చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి. 920 లకు పైగా చిన్నతరహా పరిశ్రమలు నమోదు చేయబడినాయి. అయితే వాస్తవంగాఉన్న యూనిట్లకన్నా యీ సంఖ్య చాలా తక్కువ పేరునమోదు చేయించే విషయం స్వచ్ఛందమైనది కాబట్టి దేశంలో ఉన్న చిన్నతరహా పరిశ్రమల నికర సంఖ్యను అంచనా వేయలేము. అంతర్జాతీయ పరిశీలక బృందం అంచనాల ప్రకారం 1961 లో కేంద్రలఘు పరిశ్రమలసంస్థ ఆధ్వర్యంలో దాదాపు 2 నుంచి 2.5 లక్షల యూనిట్లు ఉన్నాయి.

లఘుపరిశ్రమలు తయారుచేసే వివిధ వస్తువులను పరిశీలిస్తే యీ రంగం పరిధి, ఉత్పత్తిశక్తి అవగతమవుతుంది. గాజు వస్తువులు, రసాయనిక ఉత్పత్తులు, రంగులు, వార్నిష్, సింథటిక్, కాగితంఉత్పత్తులు, క్రిమిసంహారకవస్తువులు, ఫార్మాసూటికల్స్, ఔషధాలు ప్లాస్టిక్ ఉత్పత్తులు, వివిధరకాల పాలిష్‌లు, రబ్బరు ఉత్పత్తులు, టాయిలెట్ సామాగ్రి, సువాసన వస్తువులు, విద్యుచ్ఛక్తి పరికరాలు. ఇతర వివిధ ఉత్పత్తులు లఘుపరిశ్రమలలో తయారవుతున్నాయి.

లఘుపరిశ్రమలు ఎక్కువకావడమేగాక వీటి అభివృద్ధిని దోహదం చేయడానికి వీలుగా సహాయపడే ప్రభుత్వ యంత్రాంగంకూడా ఎక్కువఅయింది. లఘుపరిశ్రమల బోర్డు, కేంద్రసలహా, సమన్వయ సంస్థగా పనిచేస్తున్నది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల అధికారులు, పరిశ్రమలు, వాణిజ్యం, యితరవివిధ సంస్థల ప్రతినిధులు యీ బోర్డులో ఉన్నారు. విధానాలు, కార్యక్రమాలపై సలహాలనిస్తూ, సాధించిన అభివృద్ధిని తరచుగా సమీక్షిస్తూ భవిష్యత్ పురోభివృద్ధికి సూచనలను యీ బోర్డు అందజేస్తూవుంటుంది.

అభివృద్ధి కమీషనరు అధ్వర్యంలో ఉండే కేంద్ర లఘుపరిశ్రమలసంస్థ కేంద్రసమన్వయ, కార్యనిర్వాహక ఏజన్సీగా వ్యవహరిస్తుంది. 16 లఘుపరిశ్రమల సర్వీసు సంస్థలు. 6 బ్రాంచి సంస్థలు, 66 విస్తరణ, ఉత్పత్తి కేంద్రాల ద్వారా పనిచేస్తుంది.

అన్ని రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయిలో యిదేవిధమైన బోర్డులు ఉన్నాయి వీటికి తోడు ప్రతిరాష్ట్రంలోను, కేంద్రపాలిత ప్రాంతంలోను పరిశ్రమలశాఖ డైరెక్టరేటు కార్యాలయాలు పనిచేస్తున్నాయి. రాష్ట్ర హెడ్ క్వార్టర్స్‌లోని డైరెక్టరు కార్యా

—కర్ణ కఠోరమైన భాష విన్పించడం మినహా ఆ ముసలాయన శ్రీ నగేష్‌కు సందేహనివృత్తి మాత్రం చేయలేదు.

'ఈ పెద్దవాళ్లెపుడూ యింతే. అడిగిన దానికి బాగా సమాధానం చెప్పరు. పిన్నిని అడుగుతాను. చక్కగా విసుక్కోకుండా ఏమడిగినా చెప్తుంది' అంటూ పిన్ని దగ్గరకు చేరాడు.

శ్రీ నగేష్ చిన్నారి మెదడునందలి సందేహాల్ని తేలికగా తృణీకరించలేదు పిన్ని. ఆ లేత మనస్సులోని వేదననూ, సానుభూతినీ అర్థం చేసుకోగలిగింది.

"అసలు డాక్టరు చదువుకే చాలా ఖర్చవుతుంది బాబూ, చాలా ఖరీదైన విద్య అది. మరి వున్నదంతా ఖర్చు పెట్టుకొనీ, లేక అప్పుచేసో వేలకు వేలు వెచ్చించి చదువుకున్న చదువుతో యీ పల్లెటూళ్లో ప్రాక్టీస్ పెడితే వాళ్ల అప్పులెలా తీరతాయి? ప్రాక్టీస్ పెట్టటానికి కూడా చాలా డబ్బు కావాలి. పట్టణాలలో అయితే చాలా మంది జనం వుంటారు—రాబడి బాగుంటుంది. వాళ్ల అప్పులూ తీరతాయి. మళ్లీ వాళ్ల పిల్లల్ని కూడా చక్కగా చదివించుకొంటారు."

"అయితే బాగా డబ్బువున్న మనవంటి వాళ్లు డాక్టర్లై ఈ పల్లెల్లో వుంటే మన కెవరూ డబ్బు యివ్వక్కర్లేదు కదూ పిన్నీ? మనం వాళ్లకు వూరికేనే మందు లిచ్చేయ వచ్చు!"

పిన్ని ఆనందాతిరేకంతో ప్రశంశాపూర్వకంగా ముద్దిడు కొన్నది శ్రీ నగేష్‌ను.

"అందరికీ నీ అంత మంచి మనసు వుంటుందా బాబూ. చాలా మంది ప్రజలకు పెద్ద కబుర్లే కాని క్రియ శూన్యం. ధన దాహం అమితం. ఎంతవున్నా యింకా సంపాదించాలనే తాపత్రయంతోనే సతమత మౌతూంటారు కాని, తోటి ప్రజకూ, దేశానికీ సహాయ పడదామనే సత్సంకల్పం వుండదు—ప్రజ వివేకంతో తమ తమ తెలివినీ, కలిమినీ, బలిమినీ శక్త్యానుసారం ప్రభుత్వానికీ, ప్రజకూ అందజేస్తే దేశం మళ్లీ రత్న గర్భ అనే పేరును సార్థకం చేసుకొంటుంది. ప్రజ సుఖిస్తుంది; దేశమూ సుభిక్షమౌతుంది. కాని అంతటి సదుద్దేశమూ, సహకారం లభించినప్పటి మాట కదా!"

"అయితే నేను డాక్టర్నై యిక్కడే ఈ వూళ్లోనే వుంటాను. ఎవ్వర్నీ చచ్చిపోనివ్వను!" పసివాడు శ్రీ నగేష్ ప్రతిజ్ఞ చేశాడు.

అప్పుడే మరొక విషాద సంఘటన శ్రీ నగేష్ సంకల్పాన్ని మరింత దృఢతరం చేయగలిగిన దారుణం జరిగింది. శ్రీ నగేష్ తండ్రి శ్రీకంఠం తన స్వగ్రామం నుండి వచ్చాడు, అత్తవారి వూరు. మాతా మహుల యింట పెరుగుతూన్న కుమారుని చూచుకోవడానికి. మనుమడు శ్రీ నగేష్ అంటే తాత నాగన్న గారికి విపరీతమైన మక్కువ. అందువల్లనే అతడిని తన యింటనే పెంచేవాడు. చూడాలని వున్నపుడు అల్లుడు శ్రీకంఠం, కుమార్తె శ్రీదేవి వచ్చి చూచుకొని నాల్గు రోజులుండి వెళ్తూండేవారు.

రెండు వూళ్లకూ మధ్య మున్నైమైళ్ల దూరం మాత్రమే. శ్రీకంఠం ఎపుడు వచ్చినా తన పంచకళ్యాణి గుఱ్ఱం మీదనే వచ్చేవాడు అత్తవారింటికి. గుఱ్ఱపు స్వారీలో ఆ చుట్టుపట్ల సాటిలేని వాడతడు. అలవాటు ప్రకారం ఆనాడూ అలాగే వచ్చేడు శ్రీకంఠం అత్తవారి వూరు. కాని, అతడికంటే, అతని ఆగమన వార్త ముందుగా అత్తవారింటికి చేరింది. మిట్టమధ్యాహ్నపు ఎండలో వస్తూన్న శ్రీకంఠం, గుఱ్ఱపు స్వారీలో మేటి అయివుండి కూడా, ఏం జరిగిందో మరి అశ్వాన్ని ఆసమయంలో లొంగదీయలేక పోయేడు. నది వడ్డున ఇసుకలో అతడిని క్రింద పడవేసి పారిపోయింది గుఱ్ఱం. నదిలో బట్టలుతుక్కొంటూన్న చాకలి వాళ్లెవరో ఆ కబురు ఇంటికి తెచ్చారు. ఆత్మీయులందరూ ఆత్రంతో పరుగున వెళ్లి మేనాలో యింటికి మోసుకు వచ్చారు తక్షణ వైద్య సహాయం అవసరమైంది. కాని మరో పావుగంటకే, పట్టణం పోవడానికి బండి సిద్ధమయ్యేలోగానే శ్రీకంఠం యిహలోకాన్ని విడచి పోయేడు. దానితో శ్రీ నగేష్ హృదయంపై మరోసమ్మెట పోటుపడింది.

కాలచక్రం మరికొన్ని వలయాలను చుట్టింది. అపుడపుడే ప్రాజ్ఞతను సంతరించుకొంటూన్న శ్రీ నగేష్ లేత హృదయంపై మానని గాయాన్నిచేసి, వివేకంతో నూతనంగా వికసించుతూన్న ఎదలో ఆరని జ్వాలను రగిలించింది పిన్నిమరణం. వివాహమై భర్తతో వెళ్లి పోయిన అతడి పిన్ని కొన్ని నెలల అనంతరం పుట్టింటికి తిరిగి వచ్చింది—పాపాయినెత్తుకోవడానికి కాని, ప్రసవ సమయాన అతిప్రమాద పరిస్థితి ఏర్పడి, నిపుణమైన వైద్యసహాయం అత్యవసరమైంది. దగ్గర పట్టణంలో మంచి డాక్టరున్నాడు. మొదట వెనుకాడినా ఆమె ప్రాణరక్షణార్థం కుటుంబ మందరూ ఆమెను ఆ డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళడానికే నిశ్చయించుకొన్నారు. కాని, ఆమె ఆసమయంలో పురుష వైద్యాన్ని ఎంత మాత్రం అంగీకరించ లేదు. ఇంకా దూరాన ఎక్కడో ఒక లేడీ డాక్టరు వుంది. కాని, ఆమె వదకు వెళేసగనే

దగ్గర్నుండీ చిన్నిపై అమిత గౌరవం, అపారమైన ప్రేమ, భక్తి వున్నాయి. కారణం కరుణామయి అయిన ఆమె నన్ను, అమ్మ, నాన్నగారు, తాతగారు ఆదిగా గల ఆత్మీయులందరికంటే అమితానురాగంతో ఆదరించి లాలించేది. ప్రేమగా ఎన్నో సపర్యలు చేసేది. చక్కటి ఆదర్శవంతమైన కథలూ, గాధలూ అనేకం చెప్పి, చిన్ననాటి నుండి నాలో మంచినీ, మహదాదర్శాలనూ పాదుకొన జేసింది. అవివేకంతో, కుతూహలంతో నేనడిగే అనేక సందేహాలను ఓర్పుతో తీర్చి, అనేక విషయాలను తెలియజెప్పి, నన్ను సుశిక్షితుని చేసింది. అటువంటి చిన్ని—ఆదర్శ భారత నారీమణులకు ప్రతినిధియైన చిన్ని—నాకు మన దేశ స్థితిని విపులంగా తెలియ చెప్పింది. ప్రాణాపన్నమైన స్థితిలో కూడ పవిత్రతకే ప్రాధాన్యమిచ్చే మన స్త్రీలకు - స్త్రీ పురుషుల [illegible] భారత స్త్రీలకు ముఖ్యంగా పల్లె స్త్రీలకు లేడీ డాక్టర్లు ఎంత అవసరమో అప్పుడు గుర్తించాను. అందుకే మానవ సేవకు అంకితమైపోయే భాగస్వామినినే ఎంచుకోవాలని కూడా నిర్ణయించుకున్నాను. కాని అనుకోకుండా విధి వక్రించింది...... ఆ చిన్ని పేరు భాగ్యలక్ష్మి. ఆమె ఆనాడు పునాది వేసిన భావానికి రూపకల్పనే ఈ నాటి ఈ భాగ్యచక్రం. కాని ఆ ఆదర్శంలో సగభాగం అలా అసంపూర్తిగా ఎప్పుడూ వుండిపోతుందనే బాధే అప్పుడప్పుడు మనస్సును బాధిస్తున్నది."

మాటలు ముగించి, ప్రక్కకు తిరిగి చూచిన శ్రీనగేష్ కలవరపాటుతో ప్రశ్నించాడు: "ఏమిటిది శ్రీలక్ష్మీ! మీరు కూడా సామాన్యుల మాదిరిగానే బాధపడుతున్నారా?" "లేదు, లేదు" నీళ్లు తుడుచుకు నవ్వింది శ్రీలక్ష్మి. "మీ అనుభవ శ్రవణం, మీ మెత్తని మనసూ, ఆదర్శాలూ ఆనంద పారవశ్యం కలిగించి, కనులు చమరింప జేస్తున్నాయి."

నీరస నైరాశ్యాలు ధ్వనిస్తున్న ఆమె కంఠస్వరం శ్రీనగేష్ మస్తిష్కంలో అనిర్వచనీయమైన, అసంఖ్యాకమైన ఆలోచనా తరంగాలను రేపి, బాధించింది.

"మరి నేను వెళ్లాలి. సెలవు." భారంగా లేచింది శ్రీలక్ష్మి. "నడవండి, మీ అమ్మగారికి కూడా చెప్పివెళ్తాను."

"అయ్యో అప్పుడే వెళ్లిపోతావామ్మా?" అన్నది శ్రీదేవి నిరుత్సాహంగా. శ్రీలక్ష్మి నవ్వింది. "ఇప్పుడే బయలేరితేకాని చీకటికి ముందే ఇల్లుజేరుకోలేను. ఆలస్యమైతే నాన్నగారూ, అమ్మా కంగారు పడతారు."

"సరే, తొందరపడిపోతూంటే ఇక ఎలా ఆపుతాం? ఒంటరిగా వెళ్లగలవా మరి?" శ్రీదేవి సందేహం.

తేలికగా నవ్వేసింది శ్రీలక్ష్మి. "వచ్చేప్పుడు ఒంటిరిగారాలా? నా కలవాటేలెండి."

శ్రీనగేష్ కలుగజేసుకున్నాడు, ''ఉండండి. మా నౌఖరు నెవరి నైనా పంపిస్తాను మీతో, మిమ్మల్ని ఇంటికి దిగబెట్టి మళ్ళీ రాత్రికి వచ్చేస్తాడు, నేనే వద్దనుగాని బొత్తిగా తీరికలేదు.''

''పోనీ, వెళ్లిరా, కార్లో ప్రయాణం ఎంతసేపు?'' అన్నది శ్రీదేవి, కుమారుని.

''అందుక్కాదమ్మా. ఇప్పుడు వీలుపడదు, మళ్ళీ మామయ్యను ఒకసారి చూడవలసి వున్నదిప్పుడు. లేకుంటే తప్పకుండా వెళ్ళే వాడినే.''

''[illegible] నాకిలా తిరగటం [illegible] [illegible]కదా?'' అన్నది శ్రీలక్ష్మి.

''మీరలాగే అంటారులెండి.'' అంటూ ''నాగన్నా'' అని నౌఖర్ని కేకేశాడు శ్రీనగేష్, ''చూడు. కార్లో ఈ అమ్మాయి గారికి తోడుగా వెళ్ళి, మళ్ళీ వెంటనే బస్సులో తిరిగివచ్చేయి.'' అని చెప్పాడు.

శ్రీదేవి ఆజ్ఞపై మరో భృత్యుడు రెండు అరటి పళ్ళగెలలూ, బుట్టెడు చామంతి పూలూతెచ్చి కార్లోవుంచాడు. ఇంటిపనిజేసే ఒక ముత్తైదువ వచ్చి శ్రీలక్ష్మిముఖాన కుంకుమ వుంచి వెళ్లింది.

''ఎందుకండీ ఇవన్నీ?'' అని అనకుండా వుండలేకపోయింది శ్రీలక్ష్మి.

''ఫర్వాలేదు, అవి మన పద్ధతులు.'' అంటూన్న శ్రీదేవికి పాదాభి వందనంచేసి సెలవు తీసుకున్నది శ్రీలక్ష్మి.

''మీ అడ్రసు యివ్వండి.'' అని తీసుకున్నాడు శ్రీనగేష్ ఆమెదగ్గరనుండి.

''మన నాగన్న వారి యిల్లుచూచి వస్తాడుగా! ఇక అడ్రసు దేనికి?'' అన్నది శ్రీదేవి చిరునగవుతో.

నవ్వుతూ, ''అమ్మచూపు లెప్పుడూ చాలాముందుగా వుంటాయి'' అంటూన్న శ్రీనగేష్ మాటలకు శ్రీలక్ష్మి నవ్వుతూ, కారులోనుండే మరొక్కసారి తలవంచి శ్రీదేవితో ''వెళ్తానండీ'' అంటూ, డాక్టర్ వైపుతిరిగి'' ''గుడ్‌నైట్'' చెప్పింది.

''చీరియో'' నవ్వుతూ శ్రీనగేష్ చేయి ఊపుతూంటే కారు మెల్లగా సాగిపోయింది సాయంకాలపు నీరెండలో తళతళమంటూ.

కారు కనుచూపుమేర దాటిపోయిన పిమ్మట కూడా ఇంకా అటేచూస్తూ ద్వారంలో కదలకనిల్చున్న శ్రీదేవిని, ఆమె అన్య మనస్కతనూ తిలకించి, లోలోన ఆశ్చర్యపోతూ మెల్లగా అన్నాడు శ్రీనగేష్. ''నడవమ్మాలోపలికి.ఏమిటంత పరధ్యానంగా ఉన్నావేం?'' తల్లీ కుమారు లిద్దరు లోనికివచ్చి హాలులో ఆసీనులయ్యారు.

''ఏదో పెద్ద దగ్గఱచుట్టాన్ని పంపినట్టు పంపావే బొట్టూ, పళ్లూ పువ్వులూ యిచ్చి?'' అంటూనవ్వాడు శ్రీనగేష్.

శ్రీదేవి నవ్వలేదు. ఆమె వదనం గంభీరంగావున్నది. నేత్రాలు ఏదో స్థిరభావాన్ని జీర్ణించుకునివున్నాయి. ''అవును. దగ్గర బంధువులాగా, అతి ఆత్మీయురాలిలాగానే కన్పించింది నాకు. ఇంతలక్షణమైన అమ్మాయిని నేనెక్కడా చూడలేదు. ఆ అమ్మాయి ఉన్నంతసేపూ యిల్లు కళకళలాడిపోయింది కదూ?''

భారంగా నవ్వాడు నగేష్. ''ఎవరో మారనుసురాలినీ, పూర్తిగా అపరిచితురాలినీ గురించి ఎందుకమ్మా నీకంత ఆలోచనలు? వచ్చింది. కాస్సేపు కూర్చుని వెళ్లింది.''

''అపరిచితులే పరిచితులౌతారు. అతిదూరంగా ఉన్నవాళ్ళే [illegible]. అయినా నాకు [illegible].''

''బాగుందమ్మా! రోజుకు రెండు మూడు సార్లైనా ఈ పధంగా మాట్లాడుతూంటావు, ఎందుకు నిత్యం నీకీ అనవసర చింత? నేను సుఖంగానున్నాను; నువ్వుసుఖంగా వున్నావు, ఎవరో పరాయి పిల్ల అవసరమేమి? నా కటువంటి కోరికలులేవు.''

''చాల్లేరా నాకు చెప్పకు. గ్రామఫోను ప్లేటులాగా నీ సమాధా నాలు విని ఎలా విసుగెత్తిపోయాను. ఏదీ, ఆ అమ్మాయి యిచ్చిన అడ్రస్ కాగితం? మన పౌరోహిత్యుల్ని పిలిపించి అసలు వారి కుటుంబంగురించి మంచిరోజునపోయి తెలుసుకు రమ్మని పంపిస్తాను ఆపైన మనం వెళ్దాం. పిల్ల డాక్టర్ చదువుతోంది కూడా. నా అభిప్రాయాలకూ సరిపోతుంది.''

ఈసారి నిజంగా ఖంగారు పడ్డాడు శ్రీనగేష్. ''ఏంచేస్తావు పెళ్ళి? ఇరవై ఏళ్లుకూడాలేని మీ కన్యను, ముప్పైలు సమీపిస్తూన్న మా అబ్బాయికి, అందువా.........''

''కట్టిపెట్టు నగేష్.'' తీవ్రస్వరంతో మందలింపుగా అన్నది శ్రీదేవి ''నేను తల్లిని. నీ విషయం నాకు తెల్సు. నీ సుఖ సంతోషాల బాధ్యత నాది. మరి మాట్లాడకు.''

నిస్సహాయంగా నిట్టూర్చుతూ అన్నాడు నగేష్. ''నువ్వొక విధమైన ఆవేశంలో వున్నావమ్మా ఇప్పుడు మనం మాట్లాడు కోక పోవడమే మంచిది.'' అంటూ అక్కడి నుండి నిష్క్రమించ బోయిన నగేష్, శ్రీపతి యింటి నుండి నౌఖరు రావడంతో ఆగి, కారణం ఏమిటని ప్రశ్నించాడు. ''ఏమిటి? ఎలాగుంది? మీ అయ్యగారికి తెలివి వచ్చిందా?''

''బాబుగారికి తెలివొచ్చిందండి, బాగా నేవున్నారు.''

''నేను రానవసరం లేదన్నమాట?''

''వీలైతే ఒకసారి రమ్మనే చెప్పారండి అమ్మాయిగారు.''

''సరేలే, వస్తాను, వెళ్లు.''

వాడు కదలలేదు. అటు యిటూ చూస్తూ నిల్చున్నాడు.

''ఏమిటి నీసంశయం?'' నగేష్ ప్రశ్న.

''అయితే......... ఆ యిందాక వొచ్చిన అమ్మాయిగారు

మీకు సుట్టాలాండీ ? ఎల్లిపోయారా ?''

వాడి అనవసర కుతూహలానికి పైకిచిరాకన్పించి నా, బాగానే చెప్పాడు శ్రీనగేష్. ''ఆ, వెళ్లిపోయారు. మాకు బంధువులే''

''ప్చ్. పాపం. ఎంత దూరాన్నుండొచ్చారో ఏటో? అలా తరిమేసింది జయమ్మ. అయినా ఆ జయమ్మ స్వభావమే అంత లెండి. పమ్మల్నీ మాటి మాటికీ కసురుకుంటా, ఇసుక్కుంటానే పుంటది.''

''కట్టిపెట్టవోయ్. అధిక ప్రసంగం! వెళ్లు, నీ పనేందిగా?'' కోపంగా గర్జించాడు నగేష్.

''చిత్తం, చిత్తం.'' తన పాచిక పారని ఆ సేవకుడు డాక్టరుగారి అసాధారణ స్వభావానికి ఆశ్చర్యపోతూ నిష్క్రమించాడు.

''ఏమిటబ్బాయ్ అది ?'' శ్రీదేవి ప్రశ్నించింది.

ఇక జరిగిన ఉదంత మంతా చెప్పక తప్పలేదు శ్రీ నగేష్‌కు. క్లుప్తంగా చెప్పాడు ''మామయ్యగారి అబ్బాయి శ్రీహరికి నిశ్చయించుకున్న అమ్మాయి ఈ శ్రీ లక్ష్మి. ఆనాడు ఈ అమ్మాయినే కాల దన్నుకుని వివాహం చెడగొట్టుకుపోయి, ఆపద పాలైంది మామయ్య కుటుంబం.........అయినా తనకు జరిగిన అవమానాన్ని విస్మరించి, పాపం సానుభూతితో చూడవచ్చింది ఆ అమ్మాయి ఈ రోజు. ఈ అనర్థాని కంతకూ కారణం ఆ అమ్మాయే నంటూ నిందించి, దుర్భాషలాడి వెళ్లగొట్టేసింది జయ. పాపం చాలా చిన్నబుచ్చుకుంది శ్రీలక్ష్మి. అందుకే-ఎదురుగా అన్నీ చూస్తున్నాను, బాగుండదని మనింటికి తీసుకొచ్చాను, ఆ అమ్మాయి బాధపడుతుందేమోనని, ఆమె వుండగా నీకీ విషయం చెప్పలేదు...........''

శ్రీనగేష్ మాట్లాడుతూనే వున్నాడు. పూర్తిగా వినకుండానే ఉదాసీన వదనంతో లోపలికి వెళ్లిపోయింది శ్రీదేవి.

అంతకుతూహలంగా అడిగి, అలా వినకుండా అసహనం ప్రదర్శించడమేమిటో అర్థంగాక ఆశ్చర్యపోయాడు శ్రీనగేష్. కాని ఆవిషయమై అట్టే ఆలోచించ వ్యవధిలేక త్వర త్వరగా తయారై శ్రీపతి యింటిదెసగా నడచిపోయాడు శ్రీనగేష్.

శ్రీనగేష్ వెళ్లేసరికి మేడవరండాలో విచారంగా, పరధ్యానంగా ఒక చోట నిల్చుని ఉన్నది జయ. శ్రీ నగేష్ ప్రవేశంచూచి కూడా పలుకరించలేక పోయింది.

''ఎలావుంది మామయ్యకు? ఏం చేస్తున్నారు?'' తానే అడిగాడు.

మౌనంగా తండ్రి గదివైపు దారితీస్తూన్న జయశ్రీని అతడు వారించాడు. ''ఉండు నిన్నొక విషయం అడగాలి.''

జయ ఆగింది.

''అయితే, యిలా 'ఫిట్స్' వచ్చినప్పుడు యిదివరలో ఏంచేసేవారు? ఇవాళ ఆ ఊళ్ళలోని స్పెషలిస్టులనుంచి జవాబులు వచ్చాయికాని అవేమీ అంత ఆశాజనకంగాలేవు. ఏదేదో వ్రాశారు.''

జయ కొంచం యోచించి చెప్పింది: ''ఏముంది? ఇంట్లో అయితే నేనుహొసంగా ఊరుకోపడం మినహా ఏమీచేసేదాన్ని కాదు. అలా అలా అరిచి, స్పృహ తప్పిపడిపోయేవారు. హాస్పిటల్స్‌లో అయితే నానా బాధలూపెట్టేవారు. కొట్టేసేవారు; తలకు ఎలక్ట్రిక్ షాక్ యిచ్చేవారు. ఆయన బాధతో అరిచి ఏడుస్తూంటే నాకుబాధనిపించేది. అందుకే, అవన్నీ చూడలేక ఒక స్పెషలిస్ట్ సలహామీద ఈ ఊరుతీసుకొచ్చాను. ఇక అటువంటి పద్ధతులేం లాభంలేదని అక్కడ నిర్థారించేశారు.'' ఆమెగొంతు బొంగురుపోయింది.

''ఫిట్సు తగ్గాక—లేక మెలకువ వచ్చాక—ఎలా ప్రవర్తిస్తారాయన?''

''ఒక్కొక్కప్పుడు, ఏమో తనకే తెలియకుండా దుఃఖిస్తూ కూర్చుంటారు, ఒక్కొక్కసారి ఏగొడవావుండదు. లేచి మామూలుగా తిరుగుతూ, బాగానే ప్రవర్తిస్తారు.''

''ఊఁ.'' కొంతసేపుయేదో ఆలోచించాడు డాక్టరు. ''అయితే.........చూడు జయా, మీ అమ్మగారుకూడా మరణించారు కదామరి, ఆ ప్రమాదంలోనే?''

''అవును?''

''కుమారుని వయసువారినిచూస్తే ఆయనధోరణి—అదే ఒక్కొక్కసారి అనుకో, అధికమైపోతుందికదా! అలాగే ఎవరినైనా స్త్రీలను చూచినప్పుడు.........''

జయముఖం కందగడ్డలా చేసుకొని తల వాల్చుకుంది.

''ఏమనుకోకు జయా. అడగక తప్పదు. ఆయన స్వభావాన్ని నేనుపూర్తిగా తెల్సుకోవాలి కదామరి! అడగడానికి వేరెవరూ లేరుమరి! ఆయనకు ఈ మతి చాంచల్యంపోయి కుదుటపడాలని నీకెంత కోరిక వుందో—కేసును చేపట్టిన నాకూ అంత ఆత్రతగా వుంటుందని నీవు గ్రహించాలి.''

''అవును.'' మెల్లగా అన్నది జయ, ''అన్నయ్యల దగ్గరే అమ్మకూడా వున్నదని అంటూండంమినహా, ప్రత్యేకంగా నువ్వడిగినటువంటి దేమీలేదు.''

తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు శ్రీనగేష్. ''ఒక విధంగా బ్రతికిపోయాం. ఈ పిచ్చిలోవున్న విశేష మేయిది! ఏదో ఒక విషయంలోనే అలా మతి అస్థిరంగా వుంటుంది కాని, అన్ని విషయాలలోనూ అదే వర్తించదు. ఎంతో తెలివిగా వుంటారు. ఎంతపరిశోధించినా ఏమనస్తత్వ శాస్త్రజ్ఞునికీ అంతుపట్టని కొన్ని విషయాలలా వుండి పోతూనేవుంటాయి.''

''............''

''నడు. మామయ్యను చూద్దాం.'' అంటూ దారితీశాడు శ్రీనగేష్. యాంత్రికంగా కదలి అతడివెంట నడిచింది జయశ్రీ. (సశేషం)

PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD-24
PUBLISHED DIRECTOR INFORMATION AND PUBLIC RELATIONS, ANDHRA PRADESH, HYDERABAD

